అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
బుధవారం 20-12-2023
సంపుటి : 9 సంచిక : 299 Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar 12 పేజీలు వెల : 6.50

వెలుగు చూడని కాగ్ నివేదికలు
ఈ ఏడాది పార్లమెంటులో ప్రవేశపెట్టినవి 18 మాత్రమే



న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వ పద్దులపై ఈ ఏడాది కాగ్ సమర్పించిన ఆడిట్ నివేదికలలో కేవలం 18 నివేదికలను మాత్రమే పార్లమెంట్ ముందు ఉంచారు. వాస్తవానికి పార్లమెంటులో ప్రవేశపెడుతున్న కాగ్ నివేదికల సంఖ్య రానురానూ తగ్గిపోతోంది. 2019-2023 మధ్యకాలంలో సగటున ఏడాదికి ...11లో

ఆరు గ్యారంటీలపై వెనక్కి తగ్గం
- గత ప్రభుత్వ తప్పులను పునరావృతం కానీయం
- మాది ఇందిరమ్మ రాజ్యం.. ఫ్రెండ్లీ ప్రభుత్వం
- ఎవరిపైనా కక్షపూరిత చర్యలు ఉండవు..
- ప్రభుత్వ ఆస్తులు దోచుకుంటే చర్యలు తప్పవు : 'నవతెలంగాణ'తో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

3లో..

చైనాలో భారీ భూకంపం
- 116 మంది మృతి
- ఆరు వేలకు పైగా ఇండ్లు ధ్వంసం



- పూర్తిస్థాయి సహాయక చర్యలు చేపట్టాలి : అధికారులకు జిన్‌పింగ్ ఆదేశం

11లో..

ఆటోడ్రైవర్లు ఆందోళన చెందొద్దు
- మీ సమస్య మా దృష్టికి తీసుకరండి...పరిష్కరిస్తాం : మంత్రి పొన్నం ప్రభాకర్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్
ఆటో డ్రైవర్లు ఆందోళన చెందొద్దని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. వారు సమస్యలను తమ దృష్టికి తీసుకరావాలనీ, వెంటనే 11లో..

కరోనా సబ్ వేరియంట్ భయం
- అప్రమత్తమయిన గాంధీ ఆస్పత్రి




11లో..

అప్రజాస్వామికంలో ఆల్‌టైం రికార్డ్
మరో 49 మంది ఎంపీల సస్పెన్షన్
- ఈ సెషన్‌లో మొత్తం 141 మందిపై వేటు
- భారత పార్లమెంటు చరిత్రలో ఇదే తొలిసారి


పార్లమెంటు ఆవరణలో ప్రతిపక్ష సభ్యుల ఆందోళన...

నవతెలంగాణ- న్యూఢిల్లీ బ్యూరో
అప్రజాస్వామిక చర్యల్లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆల్‌టైమ్ రికార్డు సృష్టించింది. ప్రజావాణిని వినిపించే ప్రతిపక్షాల సభ్యులను పార్లమెంటు నుంచి గెంటివేసి తన మందబలంతోనే సమావేశాలను కొనసాగించింది. ప్రజాస్వామ్య మందిరాలుగా పరిగణించి చట్టసభల్లో సమాలోచనలు, సమగ్ర చర్చ జరగాలంటే ప్రతిపక్షాల ప్రాతినిధ్యం అవశ్యం. కానీ మోడీ సర్కార్ ప్రతిపక్ష సభ్యులు సభలో ఉన్నా.. లేకపోయినా గంపగుత్తగా సస్పెన్షన్ వేటు వేస్తూ నిరంకుశత్వాన్ని చాటుకుంటోంది. పార్లమెంటు భద్రతతో సహా దేశ ప్రజానీకం ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చకు పట్టుబట్టినదే తడవుగా సదరు సభ్యులపై మోడీ సర్కార్ వేటు వేస్తూ వచ్చింది. ఇదే క్రమంలో లోక్‌సభలో మంగళవారం 49 మంది ప్రతిపక్షాల సభ్యులపై సస్పెన్షన్ విధించారు. సోమవారం వేటు పడ్డ 78 మంది. అంతకుముందు 14 మందితో కలిపి ఈ శీతాకాల సమావేశాల్లో మొత్తంగా 141 మంది సభ్యులు సస్పెన్షన్‌కు గురయ్యారు. భారత పార్లమెంటు చరిత్రలో ఇంత పెద్ద సంఖ్యలో ఒక సెషన్‌లో సభ్యులు సస్పెన్షన్‌కు గురికావడం ఇదే తొలిసారి. మంగళవారం సస్పెన్షన్‌కు గురైనవారిలో ఎన్సీపీ నేత సుప్రియా సూలే, కాంగ్రెస్‌కు చెందిన శశిథరూర్, మనీష్ తివారీ, జమ్ముకాశ్మీర్ ...11లో



పోలీసుశాఖలో భారీ మార్పులు
డీజీపీగా రవిగుప్తా కొనసాగింపు
- కొందరు సీనియర్లకు ప్రాధాన్యత లేని పోస్టింగ్‌లు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి
రాష్ట్రంలో సీనియర్ ఐపీఎస్ అధికారుల బదిలీలు, పోస్టింగులలో తన మార్క్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి చూపించారు. రాష్ట్ర డీజీపీగా డాక్టర్ రవిగుప్తాను కొనసాగిస్తూనే.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఓ వెలుగు వెలిగిన కొందరు సీనియర్ ఐపీఎస్ అధికారులను అంతగా ప్రాధాన్యత లేని విభాగాలకు మార్చారు. మరికొందరి అధికారులకు కీలకమైన పోస్టింగులను ఇచ్చారు. ఈ విధంగా మొత్తం 20మంది ...2లో

14 మంది ఐఏఎస్‌లకు పదోన్నతులు
నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్
రాష్ట్రంలోని 14 మంది 2015 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారులకు జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ గ్రేడ్ స్కేల్ పదోన్నతులు కల్పిస్తూ ఆదేశాలిచ్చింది. ఈమేరకు ...2లో

ముందుకెలా వెళ్దాం!
ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్‌తో రేవంత్ భేటీ
- మంత్రివర్గ విస్తరణ, ఎమ్మెల్సీ, లోక్‌సభ, నామినేటెడ్ పదవులపై చర్చ
- ఢిల్లీలో ఉమ్మడి ఆస్తులు, తెలంగాణ భవన్ నిర్మాణంపై ఆర్సీతో సమీక్షా సమావేశం
- మంత్రి పదవుల కోసం అధిష్టానం చుట్టూ ఎమ్మెల్యేల ప్రదక్షిణలు


ఢిల్లీలోని తెలంగాణ భవన్ అధికారులతో భేటీలో రేవంత్ రెడ్డి

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో
మంత్రివర్గ విస్తరణ, ఎమ్మెల్సీల ఎంపిక, లోక్‌సభ స్థానాలు, నామినేటెడ్ పదవులపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పార్టీ అధిష్టానంతో సమాలోచనలు చేశారు. మంత్రివర్గ విస్తరణ, సుదీర్ఘ కాలంగా పార్టీకి సేవలందిస్తోన్న వారిని ఎంపిక చేయడంలో ఎలా ముందుకెళ్దామనే అంశంపై ముఖ్య నేతల సూచనలు తీసుకున్నారు. ఢిల్లీ పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బిజీ బిజీగా గడిపారు. మంగళవారం మధ్యాహ్నం 12:30 నిమిషాలకు ఢిల్లీ చేరుకున్న రేవంత్ రెడ్డి నేరుగా లోధి రోడ్‌లోని ఏఐసీసీ జనరల్ సెక్రటరీ(సంస్థాగత) కేసీ వేణుగోపాల్ నివాసానికి వెళ్లారు. దాదాపు 15 నిమిషాల పాటు కేసీ వేణుగోపాల్‌తో సీఎం భేటీ అయ్యారు. ఈ భేటీలో భాగంగా పొలిటికల్ అడ్వైజరీ కమిటీ(పీఏసీ)లో తీసుకున్న నిర్ణయాలను కేసీ వేణుగోపాల్‌కు రేవంత్ రెడ్డి వివరించారు. అలాగే ఈ నెల 28 నుంచి అమలు చేయాలని యోచిస్తోన్న మరో రెండు గ్యారెంటీల వివరాలను తెలిపారు. కొత్త ఏడాది కానుకగా వీటిని ప్రజల్లోకి తీసుకెళ్తున్నట్టు చెప్పారు. అలాగే మిగిలిన క్యాబినేట్ బెర్త్‌లు, ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక, నామినేటెడ్ పదవులపై చర్చించినట్టు సమాచారం. అయితే ప్రభుత్వాన్ని సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేలా మంత్రివర్గంలో కొత్త వారికి చోటు, ఎమ్మెల్సీల ఎంపిక నిర్ణయాన్ని రేవంత్ రెడ్డికే అప్పగిస్తూ అధిష్టానం ఫ్రీ హ్యాండ్ ఇచ్చినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఇదే విషయాన్ని రేవంత్ రెడ్డికి కేసీ వేణుగోపాల్ తెలిపినట్టు సమాచారం.

అనంతరం ఢిల్లీలో తెలంగాణ సీఎంకు అధికారికంగా కేటాయించిన తుగ్లక్ రోడ్ 23 నివాసానికి వెళ్లారు. తొలిసారి ఈ ఇంటిని సందర్శించిన సీఎం, పలు మరమ్మతులకు సూచనలు చేసినట్టు తెలిసింది. అలాగే తుగ్లక్ రోడ్‌లో ఎంపీలకు ఇచ్చే విందు ఏర్పాట్లపై ...11లో

వృత్తి నైపుణ్యాలు పెంచుకోవాలి
హెచ్‌పీఎస్ శతాబ్ది ఉత్సవాల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
విద్యతో పాటు విద్యార్థులు వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు. బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం నిర్వహించిన గ్రాండ్ ఫినాలే సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఆమె ప్రసంగించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ వందేండ్ల ప్రయాణంలో హెచ్‌పీఎస్ ప్రపంచం మెచ్చే గొప్ప మేధావులను తీర్చిదిద్దిందని కొనియాడారు. మైక్రోసాఫ్ట్ సీఈవో ...11లో



22న దేశవ్యాప్త నిరసనలు
ఎంపీలపై వేటు ప్రజాస్వామ్యానికి చేటు.. ఇండియా ఫోరం భేటీ నిర్ణయం


నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో
అన్ని ప్రజాస్వామ్య మర్యాదలను పక్కనబెట్టి, పార్లమెంటులో ప్రతిపక్ష ఎంపీలను మూకుమ్మడిగా సస్పెండ్ చేసిన మోడీ ప్రభుత్వ నియంతృత్వ చర్యకు వ్యతిరేకంగా ప్రతిపక్షాల ఇండియా ఫోరం ఈ నెల 22న దేశవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చింది. మంగళవారం అశోకా హోటల్‌లో ప్రతిపక్షాల ఇండియా ఫోరం నాలుగో సమావేశం జరిగింది. సమావేశానికి మొత్తం 28 పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, సీపీఐ(ఎం) నేత సీతారాం ఏచూరి, బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్, తమిళనాడు సీఎం ఎంకె స్టాలిన్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, పంజాబ్ సీఎం భగవంత్ మాన్, ఎన్సీపీ నేత శరద్ పవార్, ఆర్జేడీ నేత లాలూ ప్రసాద్ యాదవ్, ఎస్పీ నేత అఖిలేష్ యాదవ్, నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూక్ అబ్దుల్లా, సీపీఐ ప్రధాన కార్యదర్శి ...2లో

వేతన వ్యథలు.. అప్పుల బాధలు
పదోన్నతులు ఇచ్చారు..జీతాలు మరిచారు
- ఐదు నెలలుగా అందని వేతనాలు
- స్థానికత ఓ దగ్గర..ఉద్యోగం మరో చోట
- ఆందోళనలో పూర్వ వీఆర్ఏలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
రాష్ట్రంలో పూర్వ వీఆర్ఏల పరిస్థితి దుర్భరంగా తయారైంది. ఐదు నెలలుగా జీత భత్యాలకు నోచుకోక వారు అలమటిస్తున్నారు. గతేడాది చేసిన సుదీర్ఘ పోరాటం ఫలితంగా వారిని క్రమబద్ధీకరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇతర శాఖల్లో సర్దుబాటు చేసింది. ఆయా విభాగాల్లో చేరిన వారికి ఇప్పటి వరకు గుర్తింపు కార్డు కూడా ఇవ్వలేదు. స్థానికత ఓక చోట..ఉద్యోగం మరో చోట చేయలేక ఆర్థిక ...2లో

పవరేంటో చూపిస్తాం...
అధికార, ప్రతిపక్షాల సవాళ్లు...
- నేటి అసెంబ్లీలో ఆర్థిక స్థితిగతులపై పవర్ పాయింట్ ప్రజంటేషన్
- సీఎం, డిప్యూటీ సీఎంల్లో ఎవరో ఒకరు ఇచ్చే అవకాశం
- తమకూ అవకాశమివ్వాలంటూ బీఆర్ఎస్ పట్టు- స్పీకర్‌కు లేఖ
- తొలుత సంతాప ప్రతిపాదనలు
- అనంతరం 'రాష్ట్ర ఆర్థిక స్థితిగతులు-శ్వేతపత్రం'పై లఘు చర్చ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
పదేండ్ల పాటు పవర్(అధికారం)లో ఉండి తాజా ఎన్నికల్లో ఓడిపోయిన పార్టీ ఒకటి.. ఇటీవల ఎలక్షన్లలో గెలుపు జెండా ఎగరేసిన పార్టీ మరోటి... ఆ రెండూ శాసనసభా వేదికగా సమరానికి మరోమారు సిద్ధమవుతున్నాయి. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా శనివారం సభ హీటెక్కిన సంగతి విదితమే. మూడు రోజుల విరామానంతరం బుధవారం నుంచి నిర్వహించబోయే అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇస్తామంటూ అధికార కాంగ్రెస్ ప్రకటించింది. తద్వారా ప్రతిపక్ష బీఆర్ఎస్ చేసిన దుబారా, నిధుల దుర్వినియోగాన్ని ఎత్తి చూపుతామంటూ సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. అదే తరహాలో తమకూ సభలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చేందుకు అనుమతినివ్వాలంటూ ప్రతిపక్ష బీఆర్ఎస్ పట్టుబడుతోంది. తాము పదేండ్లలో వివిధ రంగాల్లో పెట్టిన పెట్టుబడులు, పెంచిన సంపద, వివిధ వర్గాలకు ఆయా ఫలాలను అందించిన విధానాన్ని వివరిస్తామంటూ ఆ పార్టీ కోరుతోంది. ఆ మేరకు ...11లో

హామీలు ఎగ్గొట్టడానికే శ్వేతపత్రాల డ్రామాలు
పవర్ పాయింట్ ప్రజంటేషన్ షోలు దేని కోసం?
- కాంగ్రెస్‌కు మాజీ మంత్రి కేటీఆర్ సూటి ప్రశ్న



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎగ్గొట్టేందుకే కాంగ్రెస్ శ్వేతపత్రాల డ్రామాలకు తెర లేపిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. గ్యారంటీలను గాలికొదిలేసి, శ్వేతపత్రాలతో గారడీ చేస్తామంటే కుదరదని హెచ్చరించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ హామీలతో ఊదరగొట్టిందని తెలిపారు. అధికారంలోకి రాగానే శ్వేతపత్రాల సాకుతో జనాల్ని మభ్యపెడతారా? అని ప్రశ్నించారు. గద్దెనెక్కిన తర్వాత వాగ్దానాలను గంగలో కలపడానికి కాంగ్రెస్ రంగం సిద్ధం చేసిందని దుయ్యబట్టారు. అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ షోలు దేనికని నిలదీశారు. ఎన్నికలప్పుడు అరచేతిలో వైకుంఠం చూపి పీఠం దక్కగానే జనానికి మొండి చేయి చూపిస్తున్నారని విమర్శించారు. తొమ్మిదినరేండ్ల తమ ప్రభుత్వ ప్రగతి ప్రస్థానమనేది తెలంగాణ ప్రజల ముందు తెరిచిన పుస్తకమని కేటీఆర్ పేర్కొన్నారు. శాసనసభకు సమర్పించిన బడ్జెట్ పత్రాలను ఆస్తులు, అప్పులు, ఆదాయ వ్యయాల శ్వేత పత్రాలే కదా అని పేర్కొన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో తాము విడుదల చేసిన ప్రతి ప్రగతి నివేదిక ఒక స్వచ్ఛమైన శ్వేతపత్రమని తెలిపారు. ఆడిట్ రిపోర్టులు, ఆర్బీఐ నివేదికలు ప్రతి పైసాకు లెక్కాపత్రం చూపించి ఆర్థిక స్థితిని ఆవిష్కరించాయని వివరించారు. ప్రతి రంగంలో పదేండ్ల ప్రగతి నివేదికలను ప్రచురించి ప్రజల ముందు ఉంచామని గుర్తుచేశారు. ఆ రకంగా తమ ప్రభుత్వం దాచింది ఏమీ లేదన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ శోధించి, సాధించేది ఏమీ ...2లో

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదును పెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, అజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.

హామీలు ఎగ్గొట్టడానికే శ్వేతపత్రాల డ్రామాలు

(మొదటిపేజీ తరువాయి)

ఉండబోదని ఎద్దేవా చేశారు. అప్పుల ముచ్చట్లు చెప్పి ఆరు గ్యారంటీలను నీరుగార్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు పన్నుతున్నదని విమర్శించారు. వంద రోజుల్లో నెరవేరుస్తామన్న హామీలను బొంద పెట్టేందుకు ఆ పార్టీ నాటకాలాడుతోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ఎన్ని కథలు చెప్పినా అది ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చేదాక వదిలిపెట్టబోమని కేటీఆర్ హెచ్చరించారు. కాకి లెక్కలతో తప్పించుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తే ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదని ఆయన హెచ్చరించారు.

కొత్తవేరియంట్‌పై ఆందోళ వద్దు..జాగ్రత్త అవసరం

మాజీ ఎంపీ, డాక్టర్ బూరనర్సయ్య గౌడ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కరోనా కొత్త వేరియంట్‌పై ఆందోళన అవసరం లేదనీ, ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని మాజీ ఎంపీ, డాక్టర్ బూరనర్సయ్య గౌడ్ సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పార్లమెంట్‌లో నిందితులు కలర్ స్ప్రే అటాక్ చేయడంలో కుట్ర కోణం దాగి ఉందని ఆరోపించారు. రెండు దశాబ్దాల క్రితం అదే రోజున పాకిస్తాన్ ప్రేరేపిత టెర్రరిస్టులు అటాక్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. పార్లమెంట్‌లో దాడి ఘటనపై దర్యాప్తు సంస్థల నివేదిక త్వరలో రాబోతున్నదన్నారు. ఈ విషయంలో కొందరు కేంద్రాన్ని చులకగా చూపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. నిందితులు తమ ఫోన్లను పగలగొట్టి దర్యాప్తు సంస్థలకు ఆధారాలు దొరక్కుండా చేశారన్నారు. నాలుగు రాష్ట్రాల్లో ఓటమిని కప్పిపుచ్చేందుకే ఈ విషయంలో కాంగ్రెస్ రభస చేస్తున్నదని విమర్శించారు. కరోనా జేఎన్- 1 వేరియంట్‌పై రాష్ట్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దగ్గు, జలుబు, జ్వరం ఉన్న వాళ్ళు ఇంటికే పరిమితం కావాలని కోరారు. ప్రజల మధ్యకు వెళ్లినప్పుడు తప్పనిసరిగా మాస్క్ ధరించాలని సూచించారు. కేంద్రం గైడ్‌లైన్స్ ప్రజలు తప్పనిసరిగా పాటించాలనీ, కోవిడ్ వ్యాప్తి చెందకుండా రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

భద్రతా వైఫల్యాన్ని సమర్థించే ప్రయత్నం

- ప్రతిపక్షాలపై మోడీ నిందలు

న్యూఢిల్లీ : పార్లమెంటులో చోటుచేసుకున్న భద్రతా వైఫల్యాన్ని సమర్థించేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోడీ ఆరోపించారు. బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశాన్ని ఉద్దేశించి మంగళవారం ఆయన ప్రసంగిస్తూ భద్రతా వైఫల్యం కంటే కొన్ని ప్రతిపక్ష పార్టీలు దానిని సమర్థించేందుకు ప్రయత్నించడమే ఆందోళన కలిగిస్తోందని వ్యాఖ్యానించారు. భద్రతా వైఫల్యంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా సభలో ప్రకటన చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో మోడీ ఈ వ్యాఖ్యలు చేశారు.

అమిత్ షా మాత్రం ఇప్పటి వరకూ సభలో ఎలాంటి ప్రకటన చేయలేదు. కానీ ఓ టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ప్రతిపక్షాలపై విమర్శలు కురిపించారు. ప్రతిపక్ష పార్టీలు ఈ అంశాన్ని రాజకీయం చేస్తున్నాయని మండిపడ్డారు. అటు మోడీ కూడా హిందీ దినపత్రిక దైనిక్ భాస్కర్ ప్రతినిధితో మాట్లాడుతూ భద్రతా వైఫల్యం తీవ్రమైన విషయమని, దానిని తక్కువగా అంచనా వేయకూడదని చెప్పారు. ఈ వ్యవహారంపై కేంద్ర హోం మంత్రి సభలో ప్రకటన చేయాలని డిమాండ్ చేసినందుకు పలువురు ప్రతిపక్ష ఎంపీలపై మూకుమ్మడి సస్పెన్షన్ వేటు వేసిన విషయం తెలిసిందే.

'ప్రజాస్వామ్యంలో విశ్వాసం ఉన్న వారు ఈ ఘటనను ఖండించాలని ప్రధాని చెప్పారు. మనం అందరం దీనిని సంఘటితంగా ఖండించాల్సి ఉంది. కానీ ఇటీవల వెలువడిన శాసనసభ ఎన్నికల ఫలితాలతో అసంతృప్తికి లోనైన కొన్ని పార్టీలు భద్రతా వైఫల్యాన్ని సమర్థించే ప్రయత్నం చేస్తున్నాయి. జరిగిన ఘటన కంటే ఇది చాలా ప్రమాదకరం' అని బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం అనంతరం కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషీ విలేకరులకు చెప్పారు. కాగా భద్రతా వైఫల్యంపై సమావేశంలో ప్రధాని విచారం వ్యక్తం చేశారని బీజేపీ ఎంపీ రవి శంకర్ ప్రసాద్ తెలిపారు. 'పార్లమెంట్ అనేది చర్చల వేదిక. దేశ పురోగతికి బాటలు వేసే అనేక బిల్లులపై అక్కడ చర్చించాల్సి ఉంటుంది. శాసనసభ ఎన్నికలలో ఓటమి పొందిన వారు నిరాశానిస్పృహలతో సమావేశాలను అడ్డుకుంటున్నారు. పార్లమెంటులో భద్రతా వైఫల్యానికి పాల్పడిన యువతీ యువకులు చేసిన పనిని ప్రత్యక్షంగానో లేదా పరోక్షంగానో వీరు సమర్థించడం ఆందోళన కలిగిస్తోంది. ప్రజాస్వామ్యంపై నమ్మకం ఉన్న ఏ పార్టీ అయినా రహస్యంగానో లేదా బహిరంగంగానో పార్లమెంటులో జరిగిన దానిని ఎలా సమర్థిస్తుంది? ఘటనపై విచారణ జరుగుతోంది' అని ఆయన అన్నారు.

భీమా కోరేగాన్ కేసులో గౌతమ్‌కు బెయిల్

ముంబయి : భీమా కోరేగాన్ కేసులో నిందితుడిగా ఉన్న మానవ హక్కుల కార్యకర్త గౌతమ్ నవ్‌లాఖాకు బాంబే హైకోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేసింది. లక్ష రూపాయల పూచీకత్తుపై గౌతమ్‌కు బెయిల్ ఇస్తూ జస్టిస్ గడ్కరీ, జస్టిస్ దిగేతో కూడిన డివిజన్ బెంచ్ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ ఉత్తర్వులపై సుప్రీంకోర్టులో అప్పీలు చేసుకునేందుకు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ)కు మూడు వారాల గడువు ఇస్తూ బెయిల్ ఆదేశాలపై స్టే ఇచ్చింది. బెయిల్ ఉత్తర్వులపై ఆరు వారాల పాటు స్టే ఇవ్వాలని అంతకుముందు కోర్టును ఎన్ఐఎ కోరింది. 2018లో పూనే సమీపంలోని ఓ గ్రామంలో చెలరేగిన కుల ఘర్షణల కేసులో గౌతమ్ ప్రమేయమున్నదని అభియోగాలు మోపారు. హింసకు కుట్ర పన్నారన్న ఆరోపణపై గౌతమ్ సహా 16 మందిని అరెస్ట్ చేశారు. గౌతమ్‌ను 2018 ఆగస్టులో అరెస్ట్ చేశారు. అయితే సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఆయన్ని గత సంవత్సరం నవంబర్ 19 నుండి గృహనిర్బంధంలో ఉంచారు. తన ఆరోగ్యం సరిగా లేదని, జైలులో పరిస్థితులు ఘోరంగా ఉన్నాయని గౌతమ్ పెట్టుకున్న పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. గౌతమ్ బెయిల్ పిటిషన్‌ను ఎన్ఐఎ కోర్టు గతంలో రెండుసార్లు తోసిపుచ్చింది. దీంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో నిందితులైన హక్కుల కార్యకర్తలు అరుణ్ ఫెరైరా, వెర్నన్ గాన్‌సాల్వ్స్, ఆనంద్ తెల్తుంబ్డే, రచయిత వరవరరావు, న్యాయవాది సుధా భరద్వాజ్‌కు ఇప్పటికే బెయిల్ లభించింది. గిరిజన హక్కులపై ఉద్యమించిన స్టాన్‌స్వామి కస్టడీలోనే చనిపోయిన విషయం తెలిసిందే.

ఎన్‌సీటీఈ నిబంధనలు అమలు చేయాలి

- టెట్ క్వాలిఫైడ్ టీచర్స్


(ఫైల్)

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టెట్ అర్హత కలిగిన ఉపాధ్యాయులతో పదోన్నతులు చేపట్టాలని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్రా వెంకటేశంను టెట్ క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు కలిశారు. దీనికి విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి సానుకూలంగా స్పందించారు. పదోన్నతులపై ఎలాంటి స్టే లేదనీ, ఎన్సిటీఈ మార్గదర్శకాలను విధిగా అమలుపరచాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందని వారు తెలిపారు. మంగళవారం సచివాలయంలో వారు ఆయన్ను కలిసి విన్నవించారు. కోర్టు మధ్యంతర ఉత్తరులను అమలు చేస్తూ సెకండరీ గ్రేడ్స్ తత్సమాన ఉపాధ్యాయుల నుంచి స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్లకు టెట్ అర్హత సాధించిన ఉపాధ్యాయులను మాత్రమే పరిగణలోకి తీసుకొని పదోన్నతులు చేపట్టాలని వారు కోరారు. టెట్ అర్హత సాధించిన ఉపాధ్యాయులు రాష్ట్రంలో 30 వేలకు పైగా ఉన్నారని వారు తెలిపారు. ప్రస్తుతం చేపట్టబోయే స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులకు జిల్లాల వారీగా ఆయా సబ్జెక్టుల వారీగా సరిపడా అభ్యర్థులు ఉన్నారని వివరించారు. డైరెక్టరేట్ స్కూల్ ఎడ్యుకేషన్ ఐఎఫ్ఎంఎస్‌లో టెట్ క్వాలిఫైడ్ టీచర్స్ సంబంధిత సమాచారం అందుబాటులో ఉందన్నారు. పదోన్నతులు చేపట్టిన తర్వాత నూతనంగా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టడానికి వీలు కలుగుతుందని వారు చెప్పారు. కొందరు సీనియర్, జూనియర్ అనే భావనను తెరపైకి తీసుకొస్తున్నారనీ, కానీ ఇక్కడ సీనియర్, జూనియర్ అనే భావన కాదనీ, ఇది అర్హత, అనర్హతకు సంబంధించిన అంశమని స్పష్టం చేశారు.

కొంతమంది ఉద్దేశపూర్వకంగా టెట్ అర్హత సాధించిన ఉపాధ్యాయులు సరిపడా లేరంటూ తప్పుడు ప్రచారం చేయడాన్ని ఖండించారు. విద్యాశాఖ వద్ద టెట్ అర్హత సాధించిన ఉపాధ్యాయుల వివరాలు ఉన్నాయని తెలిపారు. టెట్ అర్హత సాధించిన ఉపాధ్యాయుల వివరాలు మళ్లీ కావాలనుకుంటే సేకరించే అవకాశం ఉంటుందని వారు అన్నారు. వీటికి సంబంధించిన పత్రాలను వారికి అందించనున్నారు. వెంకటేశంను కలిసిన వారిలో టెట్ క్వాలిఫైడ్ టీచర్స్ కాట్రాజ్ రవి, మామిడి పరుశురాములు తదితరులున్నారు.

వేతన వ్యథలు.. అప్పుల బాధలు

(మొదటిపేజీ తరువాయి)

ఇబ్బందులతో నానా తంటాలు పడుతున్నారు. గతేడాది 80 రోజుల పాటు చేసిన సుదీర్ఘ పోరాటం ఫలితంగా ఐదు నెలల క్రితం వీఆర్ఎలకు పే స్కేలు, పదోన్నతి, వారసులకు ఉద్యోగాలు కల్పిస్తామని ప్రకటించిన గత ప్రభుత్వం జీవో నెంబర్ 81 జారీ చేసింది. డిగ్రీ, ఆపై చదువులు చదివిన వారిని జూనియర్ అసిస్టెంట్లుగా ఇంటర్ చదివిన వారిని రికార్డ్ అసిస్టెంట్లుగా, పదో తరగతి చదివిన వారిని ఆఫీసు సబార్డినేట్లుగా నియమిస్తూ రాష్ట్రంలోని 20 వేల మంది వీఆర్ఎలలో 16 వేల మందిని క్రమబద్ధీకరించారు. ఆయా శాఖల్లో చేరిన వారికి కనీస గుర్తింపు కార్డు ఇవ్వక పోగా వారికి జాబ్ చార్ట్ కూడా కేటాయించలేదు. ఫలితంగా వారు ఏ శాఖ ఉద్యోగులో తెలియని పరిస్థితి నెలకొంది.

రెవెన్యూ శాఖలో పని చేస్తున్న ఆఫీస్ సబార్డినెట్లు సర్కార్ నిర్ణయాన్ని సవాలు చేస్తూ హైకోర్టులో వేసిన కేసును బూచిగా చూపించి ప్రారంభంలో సర్కారు కాలయాపన చేసింది. అయితే ఆ కేసును కోర్టు కొట్టేసినా వివిధ శాఖల్లో సర్దుబాటు చేసిన పూర్వ వీఆర్ఏల ఉద్యోగ విధులు, బాధ్యతలను నాటి బీఆర్ఎస్ సర్కారు తేల్చలేదు. ఫలితంగా వారి జీతాలు గత ఐదు నెలలుగా నిలిచి పోయాయి. సమ్మె కాలం నుంచి నేటి వరకు ఆర్థిక ఇబ్బందుల వల్ల రాష్ట్రవ్యాప్తంగా 80 మంది వీఆర్ఏలు చనిపోయారు. ఇందులో 20 మందికి పైగా ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ సారథ్యంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో ఇకనైనా తమకు న్యాయం జరుగుతుందని వారు కొండంత ఆశతో ఎదురు చూస్తున్నారు.

ఏటూ తేలని 4 వేల మంది భవితవ్యం

రాష్ట్రంలో ఉన్న 20 వేల మంది వీఆర్ఏ లకు గాను 16 వేల మందిని గత ప్రభుత్వం క్రమబద్ధీకరించింది. మిగిలిన 4 వేల మంది వీఆర్ఏలు ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్నారు. వారసత్వ ఉద్యోగాలతో పాటు ఖాళీలు లేవనే సాకుతో వీరిని ఇతర శాఖల్లో ప్రభుత్వం సర్దుబాటు చేయలేదు. కొత్త సర్కార్ నిర్ణయం కోసం వారు ఎదురు చూస్తున్నారు.

జీతాలు వెంటనే చెల్లించాలి



- వంగూరు రాములు, తెలంగాణ గ్రామ సహాయకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

వివిధ ప్రభుత్వ శాఖల్లో సర్దుబాటు చేసిన పూర్వ వీఆర్ఏలకు వెంటనే జీతాలు చెల్లించాలి. ఆయా విభాగాల్లో చేరిన వారికి గుర్తింపు కార్డులు ఇవ్వడంతో పాటు జాబ్ చార్ట్‌ను కేటాయించాలి. మిగిలిన 4 వేల మందికి ఇతర శాఖల్లో సర్దుబాటు చేయాలి. పదోన్నతి పొందిన జూనియర్ అసిస్టెంట్లు, రికార్డ్ అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేట్లను ఆయా కేటగిరిల్లో ఎన్నికల ఉత్తర్వులు జారిచేసి విధులు చేయించుకున్న ప్రభుత్వం జీతాలు ఇవ్వక పోవడం సరికాదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఏర్పాటైన కొత్త ప్రభుత్వం వారికి న్యాయం చేయాలి.

ఆరు హత్యల కేసు ఛేదన

- ఐదుగురు నిందితుల అరెస్టు

నవతెలంగాణ-కామారెడ్డి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సంచలనం సృష్టించిన ఆరుగురు కుటుంబ సభ్యుల హత్య కేసును పోలీసులు ఛేధించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు ప్రశాంత్‌తో పాటు మరో నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల్లో ఒకరు మైనర్. కేసుకు సంబంధించిన వివరాలను కామారెడ్డి ఎస్పీ సింధుశర్మ మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 14న కామారెడ్డి జిల్లా సదాశివనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పద్మాజివాడి-గాంధారి వైపు వెళ్లే రోడ్డుకు సమీపంలోని భూంపల్లి గ్రామ శివారులో గుర్తు తెలియని యువతి శవం కాల్చివేశారని పోలీసులకు సమాచారం అందింది. దాంతో సదాశివనగర్ సీఐ, ఎస్ఐ సిబ్బందితో సహా అక్కడికి వెళ్లి పరిశీలించారు. సుమారు 20-25 సంవత్సరాలు ఉన్న యువతిని గుర్తు తెలియని వ్యక్తులు చంపి పెట్రోల్ పోసి కాల్చివేసినట్టుగా ప్రాథమికంగా గుర్తించారు. కేసు దర్యాప్తులో భాగంగా సీఐ, ఎస్ఐ, సిబ్బందితో రెండు బృందాలను ఏర్పాటుచేశారు.

మాక్లూర్ మండల కేంద్రానికి చెందిన మేడిద ప్రశాంత్.. అదే గ్రామానికి చెందిన పూనే ప్రసాద్, అతని కుటుంబ సభ్యులతో కలిసి ఉండేవాడు. 2018లో పూనే ప్రసాద్‌పై అదే గ్రామానికి చెందిన ఒక అమ్మాయి చనిపోయిన విషయంలో ఒక కేసు నమోదైంది. అయితే ప్రసాద్ అప్పటికే దుబాయ్ వెళ్లిపోగా అతనిపై కేసు పెండింగ్‌లో ఉంది. ఈ క్రమంలో ప్రసాద్ తరచూ ప్రశాంత్‌తో మాట్లాడుతూ కేసు వివరాలు, ఊర్లో పరిస్థితిని తెలుసుకునేవాడు. ప్రసాద్ 2022 అక్టోబర్‌లో స్వదేశానికి తిరిగి రాగా.. అతన్ని మాక్లూర్ పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. అంతకుముందు ప్రసాద్ దుబాయ్‌లో ఉన్నప్పుడు ప్రశాంత్‌కు దాదాపు రూ.3.50 లక్షలు అప్పుగా ఇచ్చాడు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత ప్రసాద్ కుటుంబాన్ని గ్రామస్తులు ఊళ్లో ఉండనీయకపోవడంతో ప్రసాద్ అతని భార్య, పిల్లలు, ఇద్దరు చెల్లెళ్లు, తల్లితో సహా మాచారెడ్డి పీఎస్ పరిధిలోని పాల్వంచ గ్రామానికి వచ్చి ఉంటున్నాడు. ప్రసాద్ జైలుకు వెళ్లడం, ఊళ్లో ఉండకపోవడం వల్ల ప్రసాద్‌కు అప్పులెక్కువయ్యాయి. ఇదే సమయంలో ప్రశాంత్‌కు ఇచ్చిన డబ్బులను తిరిగి ఇవ్వాలని ప్రసాద్ డిమాండ్ చేశాడు. ప్రశాంత్ వద్ద డబ్బులు లేకపోవడంతో రేపు మాపు అంటూ కాలం గడిపాడు. ప్రసాద్‌కు అప్పులు చుట్టుముట్టడంతో తన ఇల్లు, స్థలాన్ని కుదువబెట్టి డబ్బులు ఇవ్వాలని తెలిసిన వారి వద్ద ప్రయత్నం చేశాడు. కానీ ఎవరూ ముందుకు రాలేదు. దాంతో ప్రసాద్ ప్రశాంత్‌ను సంప్రదించి.. తన ఇంటికి మార్టిగేజ్ లోన్ తీసుకోవచ్చుని, ఆ ఇల్లు తన పేరు మీద రాస్తే లోన్ ఇప్పిస్తానని నమ్మించాడు. చేసేది లేక ప్రసాద్ ఆ భూమి, ఇంటితో సహా ప్రశాంత్ పేరు మీద రిజిస్ట్రేషన్ చేశాడు. కాగా, లోన్ కోసం ప్రయత్నించగా.. అదీ రాలేదు. అదే సమయంలో ప్రసాద్ ఆస్తిపై కన్నేసిన ప్రశాంత్ ఇదే అవకాశంగా భావించి.. కుట్ర పన్నాడు. ఈ విషయాన్ని తనకు పరిచయం ఉన్న దుర్గానగర్ తాండాకు చెందిన బానోతు వంశీ, గుగులోతు విష్ణుకు చెప్పాడు. వారితో రూ.60 వేలు ఇస్తానని ఒప్పందం చేసుకొని ఎలక్షన్ అయిపోయిన తర్వాత ప్రసాద్‌ను చంపాలని అనుకున్నారు. అందులో భాగంగా మొదట ప్రసాద్‌ను కారులో తీసుకువెళ్లి మదనపల్లి గ్రామ శివారులో మద్యం తాగించి రాయితో తలపై బాది హత్య చేసి అక్కడే పాతిపెట్టారు. ఆ తర్వాత పాల్వంచ గ్రామానికి ప్రశాంత్ ఒక్కడే కారులో వచ్చి ప్రసాద్ కోసం పోలీసులు తిరుగుతున్నారని చెప్పి అతని భార్య అయిన శాన్విక, చెల్లెలు శ్రావణిని తన వెంట తీసుకుని నిజామాబాద్ వెళ్లాడు. నిజామాబాద్‌లో శ్రావణిని ఒక స్థలంలో ఉంచి, శాన్వికను భర్త దగ్గరికి తీసుకువెళ్తానని నమ్మబలికి, బాసర బ్రిడ్జి వైపు వెళ్లి.. మార్గమధ్యలో శాన్విక గొంతుకి తాడుతో బిగించి చంపేసి బాసర నదిలో పడేశారు. ఆ తర్వాత శ్రావణిని గొంతు బిగించి చంపేసి.. చేగుంట మండలం వడియారం గ్రామ శివారులో ఎస్‌హెచ్ 44 పక్కన పెట్రోల్ పోసి తగులబెట్టారు.

ఆ తర్వాత ప్రసాద్ వాళ్ల అమ్మ సుశీల, అతని పిల్లలు చైత్రికా, చైత్రిక్, ఇంకో చెల్లెలు స్వప్నను నమ్మించి నిజామాబాద్ తీసుకెళ్లాడు. వారి నుంచి సుశీల తప్పించుకోగా, పిల్లలు, ప్రసాద్ మరో చెల్లెను దారుణంగా హత్య చేశాడు. మంగళవారం ఉదయం ప్రశాంత్, వంశీ, విష్ణు, బాయ్ జువలైన్, వడ్డమ్మ కారులో పాల్వంచలో సుశీల ఉండవచ్చనే కారణంతో పాల్వంచకు వస్తుండగా పోలీసులు వాళ్లను గాంధారి ఎక్స్‌రోడ్ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కోర్టు నిందితులకు యు/ఎస్,302, 364, 201, 379, ఆర్/డబ్లు,109, ఐపీసీ సెక్షన్ ప్రకారం కోర్టు శిక్ష విధించిందని ఎస్పీ సింధు శర్మ తెలిపారు.

పోలీసుశాఖలో భారీ మార్పులు

(మొదటిపేజీ తరువాయి)

ఐపీఎస్ అధికారులకు స్థానచలనంతో పాటు పోస్టింగులు ఇచ్చారు. ఆ వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

పేరు	ప్రస్తుత పోస్టు	కొత్త పోస్టు
డాక్టర్ రవిగుప్తా	డీజీపీ, ఏసీబీ డీజీ	అదనంగా డీజీపీ కో-ఆర్డినేషన్
అంజనీకుమార్	వెయిటింగ్	డీజీపీ రోడ్ సేఫ్టీ అథారిటీ
సీవీ ఆనంద్	వెయిటింగ్	ఏసీబీ డీజీ
రాజీవ్ రతన్	ఎండీ టీహెచ్‌సీ	డీజీ విఅండ్ఏ
అభిలాష బిస్త్	అదనపు డీజీ స్పోర్ట్స్	డైరెక్టర్ ఆర్‌బీవీఆర్ అకాడమీ
సౌమ్య మిశ్రా	అదనపు డీజీ పర్సనల్	డీజీ జైళ్లశాఖ
శిఖా గోయల్	అ.డీజీ ఉమెన్ సేఫ్టీ	సీఐడీ డీజీ
మహేష్ భగవత్	సీఐడీ డీజీ	అదనపు డీజీ రైల్వే
అనిల్ కుమార్	వెయిటింగ్	డీజీ ఎస్‌పీఎఫ్
స్టీఫెన్ రవీంద్ర	వెయిటింగ్	ఐజీ హోంగార్డ్స్
తరుణ్ జోషి	అ.సీపీ రాచకొండ	ఐజీ మల్టీజోన్
కమలాసన్ రెడ్డి	డైరెక్టర్ డ్రగ్స్	డైరెక్టర్ అబ్కారీ
ఏ.ఆర్.శ్రీనివాస్	అ.డైరెక్టర్ ఆర్‌బీవీఆర్	ఏసీబీ డైరెక్టర్
ఎస్‌సీ రెడ్డి	ఐజీ మల్టీజోన్	ఐజీ పర్సనల్
ఎం.రమేష్	ఐజీ పీఅండ్ఎల్	ఎండీ పీహెచ్‌సీ
రమేష్ నాయుడు	డీఐజీ సిరిసిల్ల	సీఐడీ డీఐజీ
సత్యనారాయణ	వెయిటింగ్	జేసీపీ సీఏఆర్
శ్రీనివాసులు	ఏసీపీ సీఏఆర్	డీజీపీ ఆఫీస్
బి.సుమతీ	డీఐజీ సీఐడీ	ఎస్ఐబీ డీఐజీ
ఎస్‌సీ పవార్	డి.డైరెక్టర్ ఆర్‌బీవీఆర్	డీసీపీ సెంట్రల్ జోన్

మణిపూర్‌లో మళ్లీ హింస

- చురాచాంద్‌పూర్‌లో నిషేధాజ్ఞలు

ఇంఫాల్ : మణిపూర్‌లో మళ్లీ హింసాకాండ చెలరేగింది. చురాచాంద్‌పూర్ జిల్లా లింగ్‌కంగ్‌ఫల్ గ్రామంలో కుకీ-జో గిరిజన తెగకు చెందిన ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకోవడంతో జిల్లాలో 144వ సెక్షన్ కింద నిషేధాజ్ఞలు విధించారు. చురాచాంద్‌పూర్‌లో సామూహిక అంత్యక్రియలు జరిగే ప్రదేశానికి ఏ పేరు పెట్టాలన్న విషయంపై కుకీ-జో తెగకు చెందిన రెండు వర్గాల మధ్య వివాదం చెలరేగింది. ఈ ప్రదేశంలో బుధవారం సామూహిక అంత్యక్రియలు జరగాల్సి ఉంది. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉన్నదని, ఘర్షణలో కొద్ది మందికి గాయాలయ్యాయని అధికారులు తెలిపారు.



జర్నలిస్టులకు ఇండ్లస్థలాలివ్వాలి

- సీఎం రేవంత్ సర్కారుకు ఫెడరేషన్ విజ్ఞప్తి

నవతెలంగాణ-హైదరాబాద్

రాష్ట్రంలో ఏండ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈమేరకు మంగళవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య యాదాద్రిలో జరిగిన రాష్ట్ర కార్యవర్గం తీర్మానాలను హైదరాబాద్‌లో వెల్లడించారు. తెలంగాణ స్వరాష్ట్రంలో గత పదేండ్లుగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను గత ప్రభుత్వం పరిష్కరించకుండా తీవ్ర నిర్లక్ష్యం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరిస్తుందన్న నమ్మకం ఉందనీ త్వరితగతిన సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రధానంగా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలనీ, పూర్తి స్థాయిలో హెల్త్ కార్డుల పథకాన్ని అమలుచేయాలనీ, కొత్తగా పెన్షన్ స్కీమ్ ప్రవేశపెట్టాలని విజ్ఞప్తి చేశారు

యాదాద్రి సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పులిపలుపుల ఆనందం, పిల్లి రాంచందర్, కోశాధికారి ఆర్. వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వల్లాల జగన్, బండి విజయ్‌కుమార్, కార్యదర్శులు తన్నీరు శ్రీనివాస్, చంద్రశేఖర్, గుడిగ రఘు, విజయానందరావు, వివేకానంద, దయాసాగర్, రాజశేఖర్, బిక్షపతి, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు పేరబోయిన నర్సింహ్మ కార్యదర్శి జలంధర్ తదితరులతో పాటు పలు జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు సమన్యాయం దక్కాలి

- భారం అనుకునే రోజులు పోవాలి : ప్రొఫెసర్ కోదండరామ్



నవతెలంగాణ-కంఠేశ్వర్

పెన్షన్ అనేది ఉద్యోగుల ప్రాథమిక హక్కు అని, కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో పెన్షనర్లకు సమన్యాయం దక్కాలని, భారం అనుకునే రోజులు పోవాలని తెలంగాణ జనసమితి అధ్యక్షులు, ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. జాతీయ పెన్షన్‌దారుల దినోత్సవం సందర్భంగా తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం న్యూ అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో కోదండరామ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ ప్రభుత్వ శాఖల్లో 30 నుంచి 40 ఏండ్లుగా ఒక సంస్థకు సేవ చేసిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగులు వేరే పని చేయలేని పరిస్థితి ఉంటుందన్నారు. ఖర్చులు పెరిగి పిల్లల చదువులు, ఇంటి ఖర్చులకు ప్రభుత్వం ఇచ్చే జీతం చాలీచాలనిదిగా ఉందన్నారు. భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగం చేస్తే తప్ప ఇల్లు కట్టుకునే పరిస్థితి లేదని తెలిపారు. ఉద్యోగ విరమణ అనంతరం తమపై ఆధారపడొద్దని ప్రభుత్వాలు ఆలోచిస్తున్నాయని చెప్పారు. ఉద్యోగంలో ఉన్నప్పుడు వెట్టిచాకిరీ చేసి ప్రభుత్వాలకు పేరు ప్రతిష్టలు తెస్తున్న ఉద్యోగులకు చివరకు నిరాశే మిగులుతోందన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు సామాజిక, విద్యా, వైద్యంగానీ అందడం లేదన్నారు. చేపలు పట్టడం నేర్పించడం ఎంత ముఖ్యమో చేపలు దొరకనప్పుడు సహకారం అందించడం అంతే ముఖ్యమన్నారు. ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యాలను కల్పించడంలో విఫలమైన కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ వ్యవస్థకు మాత్రం సహాయం చేస్తోందని విమర్శించారు. దేశంలో వనరులు, రుణాలను కార్పొరేట్ సంస్థలకే ఇస్తోందన్నారు. తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలకుర్తి కృష్ణమూర్తి మాట్లాడుతూ.. పెన్షన్ల పట్ల రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని, నగదు రహిత వైద్యం అని చెప్పి ఆచరణలో కార్పొరేట్, ప్రయివేట్ ఆస్పత్రుల్లో హెల్త్‌కార్డులను అనుమతించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ డీఏలను విడుదల చేయాలని, ఈ కుబేరులో పేరుకుపోయిన కోట్లాది రూపాయల పెన్షనర్ల బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ నాయకులు ఎం.జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఓల్డ్ పెన్షన్ స్కీమును వెంటనే అమలు చేయాలని లేకపోతే ప్రభుత్వాలకు బుద్ధి చెప్తామని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షులు రామ్మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో హైకోర్టు అడ్వకేట్ గోపాల్ శర్మ, ఉద్యోగుల పెన్షనర్ల నాయకులు పోతంకర్ లక్ష్మీనారాయణ, గైని గంగారం, మధుసూదన్, ప్రసాదరావు, ఈవీఎల్ నారాయణ, హనుమాన్లు, అందే సాయిలు, లావు వీరయ్య లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి పద్మావతిని ఘనంగా సన్మానించారు.

22న దేశవ్యాప్త నిరసనలు

(మొదటిపేజీ తరువాయి)

డి.రాజా, శివసేన నేత ఉద్ధవ్ ఠాక్రే, ఆర్ఎల్డీ నేత జయంత్ చౌదరి, పీడీపీ నేత మహబూబా ముఫ్తీ తదితరులు హాజరయ్యారు. బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఈ సమావేశంలో మల్లికార్జున్ ఖర్గేను ప్రధానమంత్రి అభ్యర్థిగా ప్రతిపాదన చేయగా.. మద్దతు లభించలేదు. అయితే, కోఆర్డినేటర్, ప్రధాని అభ్యర్థిగా ప్రకటించడంలో అర్థం లేదని ఖర్గే ఆమె అభిప్రాయాన్ని తిరస్కరించారు. ఎన్నికల తర్వాతే దీనిపై నిర్ణయం తీసుకుందామన్నారు. కేజ్రీవాల్ మాత్రమే ఆమె ప్రతిపాదనకు అంగీకరించారు. ఎన్నికల తర్వాతే ప్రధానిపై నిర్ణయం తీసుకోవాలని మెజారిటీ నేతలు అభిప్రాయపడ్డారు.

ఎంపీల మూకుమ్మడి సస్పెన్షన్‌ను ఖండిస్తూ సమావేశం తీర్మానం చేసింది. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు అన్ని పార్టీల నేతల భాగస్వామ్యంతో దేశవ్యాప్తంగా ఉమ్మడి సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. లోక్‌సభ ఎన్నికలకు సన్నాహాలు వేగవంతం చేయాలని కూడా నిర్ణయించారు. అలాగే ఈవీఎంలు, వీవీపాట్‌లలో 100శాతం కౌంటింగ్ నిర్వహించాలన్న తీర్మానాన్ని సమావేశం ఆమోదించింది.

సమావేశం అనంతరం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మీడియాకు సమావేశ నిర్ణయాలను వెల్లడించారు. ఎన్నికల తరువాత ఫోరంకి మెజారిటీ వస్తే ఎంపీలు ప్రజాస్వామ్యబద్ధంగా ప్రధానిని ఎన్నుకుంటారని అన్నారు. సీట్ల పంపకాలపై మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ 'స్థానిక నేతలు మొదటి రౌండ్ చర్చలు జరుపుతారు. విభేదాలు ఉంటే సీనియర్ నేతలు జోక్యం చేసుకుంటారు. ఉత్తరప్రదేశ్, తెలంగాణ సీట్ల పంపకాల సమస్యలు పరిష్కారమవుతాయి. పంజాబ్, ఢిల్లీ సమస్యలను ఎలా పరిష్కరించవచ్చో చూసేందుకు ప్రయత్నిస్తాం. మనం ముందుగా విజేతలుగా రావాలి. మాకు ఎంపీలు లేకపోతే, ప్రధానిని ప్రొజెక్ట్ చేయడం వల్ల ప్రయోజనం ఏమిటి?' అని అన్నారు.

రాష్ట్ర స్థాయిలో సీట్లు సర్దుబాటు: సీతారాం ఏచూరి

సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మాట్లాడుతూ రాష్ట్రాల్లో పొత్తులు, అవగాహనలపై చర్చించి నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించామన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందే ఇది ఖరారు అవుతుందని అన్నారు. ధరల పెరుగుదల, నిరుద్యోగం వంటి సమస్యలపై నిరసనలు, బహిరంగ సభలు నిర్వహించడంతో ప్రజలను సంఘటితం చేస్తామన్నారు. ఎంపిల సస్పెన్షన్‌కు వ్యతిరేకంగా డిసెంబర్ 22న దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని ఏచూరి తెలిపారు.

త్వరలో అన్నీ మొదలవుతాయి: ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్

ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ మాట్లాడుతూ 'సమావేశం బాగా జరిగింది. ప్రచారం, సీట్ల పంపకం, ప్రతిదీ త్వరలో ప్రారంభమవుతుంది' అని చెప్పారు.

అన్ని నిర్ణయాలను 3 వారాల్లోగా తీసుకుంటాం : ఆర్జేడీ మనోజ్ ఝా

ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా మాట్లాడుతూ 'చర్చలు స్పష్టంగా జరిగాయి. సీట్ల పంపకం, మాస్ కాంటాక్ట్ ప్రోగ్రామ్ - ఇవన్నీ 20 రోజుల్లో ప్రారంభమవుతాయి. మూడు వారాల్లో అన్ని నిర్ణయాలు తీసుకోబడతాయి' అని అన్నారు. సీట్ల పంపకాలపై తక్షణమే చర్చ ప్రారంభిస్తామని కాంగ్రెస్ నేత కెసి వేణుగోపాల్ అన్నారు. సీట్ల భాగస్వామ్యానికి ప్రాధాన్యత ఉందని అన్నారు.

14 మంది ఐఏఎస్‌లకు పదోన్నతులు

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జీవో నెంబరు 1662ని జారీచేసింది. 2024 జనవరి ఒకటి నుంచి ఈ పదోన్నతులు అమల్లోకి వస్తాయి. ఈ పదోన్నతి పొందినవారిలో పమేలా సత్పతి, అనురాగ్ జయంతి, గౌతమ్ పొత్రు, రాహుల్‌రాజ్, భావేష్ మిశ్రా, సత్యశారదాదేవి,, నారాయణరెడ్డి, ఎస్.హరీశ్, జి.రవి, కె.నిఖిల, ఆయేషా మస్రత్ ఖానమ్, సంగీత సత్యనారాయణ, యాషీన్ భాషా, వెంకట్రావ్ తదితరులు ఉన్నారు. వీరంతా ప్రస్తుతం ఎక్కడైతే పనిచేస్తున్నారో, అదే స్థానాల్లో కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

దేవసేనకు సూపర్‌టైమ్ కార్యదర్శిగా పదోన్నతి

విద్యాశాఖ డైరెక్టర్‌గా ఉన్న 2008 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి ఎ.దేవసేనకు ప్రభుత్వం సూపర్‌టైమ్ స్కేల్ వర్తింపజేస్తూ ఆదేశాలిచ్చింది. దీంతో ఆమెకు కార్యదర్శిగా పదోన్నతి లభించినట్టయింది. అలాగే ప్రస్తుత విద్యాశాఖ డైరెక్టర్ హోదా కాస్త కమిషనర్‌గా మారనున్నారు. ఈమేకు జీవో నెంబరు 1659 జారీ చేశారు.

మరో ఇద్దరికి సెలెక్షన్ గ్రేడ్

2011 బ్యాచ్ ఐఏఎస్ అధికారులు పాటిల్ ప్రశాంత్ జీవన్, కిల్లు శివకుమార్‌నాయుడుకు సెలెక్షన్ గ్రేడ్ హోదా కల్పించారు. ఈమేరకు జీవో 1661 జారీ అయింది. ఇప్పుడు విధులు నిర్వహిస్తున్న స్థానాల్లోనే వీరు కొనసాగుతారు.

ఆరు గ్యారంటీలపై వెనక్కి తగ్గం

- గత ప్రభుత్వ తప్పులను పునరావృతం కానీయం
- మాది ఇందిరమ్మ రాజ్యం.. ఫ్రెండ్లీ ప్రభుత్వం
- ఎవరిపైనా కక్షపూరిత చర్యలు ఉండవు..
- ప్రభుత్వ ఆస్తులు దోచుకుంటే చర్యలు తప్పవు
- యువతను పెడదారి పట్టించే డ్రగ్స్‌పై ఉక్కుపాదం
- జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలపై త్వరలో తీపికబురు

'ఇందిరమ్మ రాజ్యం.. ఫ్రెండ్లీ ప్రభుత్వం.. ఇదీ ప్రజల రాజ్యం' అని రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గత ప్రభుత్వంలో దొర్లిన తప్పులు పునరావృతం కానీయబోమన్నారు. గత ప్రభుత్వం ఖజానా మొత్తాన్ని ఖాళీ చేసి ఇచ్చిందనే పేరుతో ఇచ్చిన గ్యారంటీల విషయంలో వెనక్కి తగ్గేది లేదని స్పష్టంచేశారు. ప్రభుత్వ ఆస్తులను దోచుకుంటే చర్యలు తప్పవని.. గత ప్రభుత్వానికి సహకరించారనో.. మరేవో కారణాలతోనో అధికారులపై చర్యలు ఉండవని తెలిపారు. యువతను పెడదారి పట్టించే డ్రగ్స్, గంజాయిపై ఉక్కుపాదం మోపుతామన్నారు. రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో సమాచార, రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రిగా పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే.



'నవతెలంగాణ' ఖమ్మం ప్రాంతీయప్రతినిధితో రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేకంగా మాట్లాడారు.

ఇది కక్షసాధింపు ప్రభుత్వం కాదు..

ఇందిరమ్మ రాజ్యం.. ప్రజా ప్రభుత్వం మాది. కక్ష సాధింపు ప్రభుత్వం కాదు. ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతాం. గత ప్రభుత్వంలో తప్పులు చేసిన అధికారులపై మేం కక్షపూరిత సమీక్షలు చేయడం లేదు. ఈ ప్రభుత్వ ఆలోచన ఏంటి? అనేది తెలియజెప్పడం కోసమే సమీక్షలు చేపట్టాం.

ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఇండ్లనూ చేర్చుతాం. చిత్తశుద్ధితో పనిచేసే అధికారులకు కీలక బాధ్యతలు ఇస్తాం. సామాన్యులకు అందుబాటులో ఉండేలా.. అధికారం చేపట్టిన తొలిరోజే మా సీఎం ఇనుప కంచెలు తొలగించారు. సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలెవరికీ కక్ష సాధింపు లేదు. ప్రభుత్వ ఆస్తులు, సొమ్ములు, నిధుల దుర్వినియోగంపై సమీక్షిస్తున్నాం.

28న మరో రెండు గ్యారంటీల అమలు..

ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే రెండింటిని అమలు చేశాం. డిసెంబర్ 28న మరో రెండు హామీలను నెరవేరుస్తాం. జనవరిలో మరో రెండు గ్యారంటీలు అమలు చేస్తాం. ఇందిరమ్మ రాజ్యంలో మాయమాటలు చెప్పం. ధనిక రాష్ట్రం తెలంగాణ ఖజానాను గత ప్రభుత్వం ఖాళీ చేసింది. అయినప్పటికీ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నాం.

కొల్లగొట్టిన ఆస్తులను ప్రజలకు ఇప్పిస్తాం..

గత ప్రభుత్వ హయాంలో జరిగిన ప్రతి అవినీతిపై సమీక్షించి విచారణ చేయిస్తాం. గతంలో ధరణి పేరుతో ప్రభుత్వ ప్రజల ఆస్తులను కొల్లగొట్టారు. అటువంటి పోర్టల్‌ను ప్రక్షాళన చేస్తాం. దాని స్థానంలో భూమాతనుతీసుకొస్తాం. ప్రభుత్వ ప్రజల ఆస్తులను తిరిగి ఇప్పిస్తాం. రెవెన్యూ సెక్టార్‌లో గతంలో జరిగిన లోటుపాట్లను సవరిస్తాం. మాకు ఏ వ్యక్తీ టార్గెట్ కాదు. ప్రభుత్వ సొమ్మును కొల్లగొడితే మాత్రం సహించేది లేదు. వీఆర్ఏల సమస్యను ఆ సంఘాలతో చర్చించి పరిష్కరిస్తాం.

ఏ ఒక్కరికీ ఇల్లు లేదనేది ఉండొద్దు..

ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లి ఏ ఒక్కరికీ ఇల్లు లేదనే సమస్య లేకుండా విడతల వారీగా ఇండ్లు మంజూరు చేస్తాం. జర్నలిస్టుల ఇండ్ల స్థలాల విషయంలో గత ప్రభుత్వం ఊరించినట్టుగా మేము చేయం. కచ్చితంగా త్వరలోనే తీపి కబురు చెబుతాం. సీతారామ ప్రాజెక్టు నిర్మాణంలో గత ప్రభుత్వంలో చిత్తశుద్ధి లోపించింది. రూ.13వేల కోట్లతో చేపట్టిన ఈ ప్రాజెక్టు పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. మొదట ఇచ్చిన ప్యాకేజీలే పూర్తికాలేదు. పాలేరు నియోజకవర్గంలోనే నాలుగు ప్యాకేజీల పనులు కొనసాగుతున్నాయి. అలైన్‌మెంట్, టన్నెల్ విషయంలోనూ గత ప్రభుత్వానికి ఏమాత్రం స్పష్టతలేదు. వీటిని అధిగమిస్తాం.

డ్రగ్స్‌పై ఉక్కుపాదం..

యువతను పెడదారి పట్టించే డ్రగ్స్, గంజాయిపై ఉక్కుపాదం మోపుతాం. గత ప్రభుత్వం వీటి నియంత్రణకు ఓ స్పెషల్ ఆఫీసర్‌ను నియమించింది. రూ.29 కోట్లు వెచ్చిస్తే దీనిని రూపుమాపవచ్చని స్పెషల్ ఆఫీసర్ నేతృత్వంలోని టీం సూచించింది. కానీ రూ.29 కూడా ఇవ్వలేదు. తమ ప్రభుత్వం శ్రీనివాసరెడ్డి అనే ఓ ఐపీఎస్ అధికారిని డ్రగ్స్ నియంత్రణకు ఏర్పాటు చేసింది. పూర్తిస్థాయిలో నియంత్రణకు చర్యలు చేపడుతుంది.

గ్రామపంచాయతీ ఎన్నికలు వెంటనే నిర్వహించాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు



నవతెలంగాణ-భువనగిరి

గ్రామ పంచాయతీ ఎన్నికలను వెంటనే నిర్వహించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం భువనగిరిలోని సుందరయ్య భవన్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ.. జనవరి మాసంలో ప్రస్తుత సర్పంచ్‌ల పదవీకాలం అయిపోతుందని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు వాయిదా వేయకుండా నోటిఫికేషన్ జారీ చేసి గ్రామపంచాయతీ, ఎంపీటీసీ, స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని కోరారు. ప్రస్తుత సర్పంచులు సొంత డబ్బులు పెట్టి గ్రామపంచాయతీ అభివృద్ధికి కృషి చేసినా గత ప్రభుత్వం బిల్లులు ఇవ్వకపోవడంతో అప్పుల్లో కూరుకుపోయి ఇప్పటి వరకు 25 మంది సర్పంచులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ వారి బకాయిలు ఇవ్వలేదని గుర్తు చేశారు. 14వ, 15వ కేంద్ర ఆర్థిక సంఘం స్థానిక సంస్థల అభివృద్ధికి నిధులు విడుదల చేసినా గ్రామపంచాయతీలకు ఇవ్వకుండా దారి మళ్లించారని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలు జరపడానికి ముందే సర్పంచుల బకాయిలను చెల్లించాలని, జనవరిలో నోటిఫికేషన్ వేసి ఫిబ్రవరిలో ఎన్నికలు జరపాలని అన్నారు. గిరిజన గూడాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసినా అభివృద్ధికి మాత్రం నిధులు ఇవ్వలేకపోయారన్నారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్, రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, సీనియర్ నాయకులు గూడూరు అంజిరెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కల్లూరి మల్లేశం, దోనూరి నర్సిరెడ్డి, మేక అశోక్ రెడ్డి, దాసరి పాండు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూని గెలిపిస్తే మార్పు తీసుకొస్తాం

సింగరేణి కాలనీల్లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తాం

- సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా నరసింహారావు



నవతెలంగాణ-మణుగూరు

సింగరేణిలో సీఐటీయూని గెలిపిస్తే మార్పు తీసుకొస్తామని, సింగరేణి కార్మిక వాడల్లో సమస్యలతో కార్మికులు సతమతమవుతున్నారని, వారి సమస్యలు పరిష్కరిస్తామని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు కార్మికులకు హామీనిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పట్టణంలోని ఓసీ 4 కొండాపురం భూగర్భ గని, మణుగూరు ఓసీల్లో మంగళవారం జరిగిన సభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. రెగ్యులేషన్ యూనియన్లు అధికారులకు వత్తాసు పలికారే తప్ప, కార్మిక వాడలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కార్మికులు క్వార్టర్స్‌లో ఉండాలంటే భయం గుప్పెట్లో ఉంటూ వారి జీవనం కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల పక్షాన గెలిచిన యూనియన్లు వారి సొంత స్వార్థం తప్ప కార్మికుల నివాస ప్రాంతాలపై దృష్టి పెట్టలేదన్నారు. సింగరేణి కార్మికుల సొంత ఇల్లు కలగానే మిగిలిపోయిందన్నారు.

కార్మికునికి 250 గజాల స్థలం కేటాయించాలని, కోల్ ఇండియాలోలా కంపెనీ రూ.30 లక్షలు వడ్డీ లేని రుణం ఇస్తే ఆ స్థలంలో సొంతిల్లు కట్టుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సమస్యల పరిష్కారానికి కార్మికులు తమ చైతన్యవంతమైన ఓటును సింగరేణి ఎంప్లాయిస్ యూనియన్ గుర్తు ఉదయించే సూర్యునికి వేసి గెలిపించాలని కోరారు.

ప్రచారంలో యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు కె.బ్రహ్మాచారి, బ్రాంచ్ అధ్యక్షులు టీవీఎంవీ ప్రసాద్, మాజీ కార్యదర్శి పిల్లలమర్రి వెంకటేశ్వర్లు, డీవీ, సీఐటీయూ డివిజన్ కన్వీనర్ గద్దల శ్రీనివాస్, నాయకులు కొడిశాల రాములు, పట్టణ కన్వీనర్ ఉప్పుతల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



పెండింగ్ వేతనాల కోసం 113రోజులుగా దీక్ష

- తక్షణమే కొండయ్యను పర్మినెంట్ చేయాలి : కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పెండింగ్ వేతనాలు ఇవ్వాలనీ, పర్మినెంట్ చేయాలని కోరుతూ గత 113 రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న దళిత కాంట్రాక్టు సహాయ శిక్షణ అధికారి నూక తోటి పెద్ద కొండయ్య సమస్యను తక్షణమే పరిష్కరించాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ స్కైలాబ్ బాబు ప్రభుత్వాన్ని కోరారు. తద్వారా ఆయన దీక్షను విరమింపచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎన్ బాల పీరుతో కలిసి హైదరాబాద్‌లోని మాసబ్ ట్యాంక్ విజయనగర కాలనీ మల్లేపల్లి ఐటీఐ వద్ద గత 113రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న కొండయ్యను స్కైలాబ్‌బాబు కలిసి సంఘీభావం తెలిపారు. అనంతరం మాట్లాడుతూ అసిస్టెంట్ ట్రైనింగ్ అధికారిగా కాంట్రాక్టు ఉద్యోగం చేస్తున్న కొండయ్యకు రావాల్సిన రూ.25లక్షల పెండింగ్ వేతనాలు ఇవ్వకుండా ఐటీఐ డీడీ రాజా, ఆర్జేడి నగేష్, ఆర్‌డీడీ నరసయ్యలు ఒక పథకం ప్రకారంగా వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయనతో పాటు నలుగురు సహాయ శిక్షణ అధికారులుగా పని చేస్తే అందులో ఒక రిటైర్డ్ అయ్యారనీ, మరో ఇద్దరినీ పర్మినెంట్ చేశారని తెలిపారు. కొండయ్యను ఎందుకు చేయలేదో చెప్పాలని ప్రశ్నించారు. తక్షణమే అయన్ను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు.

షఫిఉల్లాను కలిసిన పీఆర్‌జీటీఏ ప్రతినిధులు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

టీఎమ్ఆర్ఈఐఎస్ కార్యదర్శి బి.షఫిఉల్లాను ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ గురుకుల టీచర్స్ అసోసియేషన్(పీఆర్‌జీటీఏ)అధ్యక్షులు వి.దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రతినిధులు మంగళవారం కలిశారు. సంఘం విధి విధానాలను, ఉద్దేశాలను వివరించారు. ఈ సందర్భంగా నూతన కమిటీకి షఫిఉల్లా శుభాకాంక్షలు తెలిపారు. గురుకుల ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పాటుపడాలని, ఇది ఒక నూతన అధ్యాయంగా నిలిచిపోవాలని సంతోషాన్ని వ్యక్తం చేశారు. అదే విధంగా సంయుక్త కార్యదర్శి యాకత్ హూస్సేన్, సహాయ కార్యదర్శి దిలావర్, అకడమిక్ హెడ్ లతీఫ్, అసిస్టెంట్ ఫైనాన్స్ ఆఫీసర్ నయీముద్దీన్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ గౌస్, అసిస్టెంట్ సెక్రటరీ ఫరీదుద్దీన్‌లను కూడా ఆ సంఘం ప్రతినిధులు కలిశారు. కార్యక్రమంలో పీఆర్‌జీటీఏ రాష్ట్ర కమిటీ బాధ్యులు ఉప్పు అశోక్, డాక్టర్ ఇ.శ్రీనివాసాచారి, డాక్టర్ ఐ.నిర్మాలానందం, కె.రామకృష్ణారెడ్డి, రాష్ట్ర కన్వీనర్ పానుగంటి విజయ్ కుమార్, కో కన్వీనర్ సి.హెచ్.లక్ష్మారెడ్డి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం అవినీతిపై సీబీఐ విచారణేది?

- పేదల ఖాతాల్లో డబ్బులెప్పుడు వేస్తారు : రఘునందన్‌రావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి విషయంలో సీఎం రేవంత్ రెడ్డి ఇప్పుడు సీబీఐ విచారణకు ఎందుకు ఆదేశించడం లేదని బీజేపీ మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు ప్రశ్నించారు. కాళేశ్వరం పేరుతో కేసీఆర్ లక్ష కోట్లు రూపాయలు దోచుకున్నాడనీ, తమ పార్టీ అధికారంలో రాగానే కాళేశ్వరంలో కేసీఆర్ తిన్న డబ్బుల్ని వసూలు చేసి పేద ప్రజల ఖాతాల్లో జమచేస్తామని రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీ ఏమైందని నిలదీశారు. మంగళవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను మేడిగడ్డకే పరిమితం చేయాలనే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఆ ప్రాజెక్టు మొత్తం మీద విచారణ జరపాలని డిమాండ్ చేశారు. తమ దగ్గర కాళేశ్వరంపై సాక్ష్యాధారాలున్నాయనీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా లేఖ రాశామని రేవంత్‌రెడ్డి అన్న విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పుడు సీఎంగా ఉన్న ఆయన తన దగ్గర ఉన్నా ఆధారాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. కాగ్ వివరాలు అడుగుతున్నా ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. బీజేపీ-బీఆర్ఎస్ ఒకటేనని తప్పుడు ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై విచారణ కథను కంచికి చేర్చాలని చూస్తోందని ఆరోపించారు. కాళేశ్వరం విషయంలో కాంగ్రెస్ వ్యవహరిస్తున్న తీరుపై తమకు అనుమానాలున్నాయన్నారు. హైకోర్ట్ జడ్జి విచారణ అనేది కేసును పక్కదారి పట్టించడానికేనని విమర్శించారు. ఈ సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఉమారాణి, రాణా ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య మంత్రితో చర్చలు సఫలం..

సమ్మె యోచన విరమించుకున్న జూడాలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సకాలంలో శిక్షణాభృతి (స్టయిఫండ్) విడుదల చేయాలన్న డిమాండ్‌తో సమ్మెకు పిలుపునిచ్చిన జూనియర్ వైద్యులతో వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ జరిపిన చర్చలు సఫలమయ్యాయి. దీంతో మంగళవారం నుంచి నిర్వహించతలపెట్టిన సమ్మె యోచనను విరమించుకున్నట్టు జూనియర్ వైద్యుల సంఘం ప్రకటించింది. మొత్తం ఆరు డిమాండ్లపై సచివాలయంలో మంత్రి రాజనర్సింహ చర్చలు జరిపారు. స్టయిఫండ్ క్రమబద్ధీకరణ కోసం గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేస్తామనీ, ప్రతి నెలా 15 కల్లా విడుదల చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. దీనికి సంబంధించిన కొత్త సాఫ్ట్‌వేర్‌ను 20 రోజుల్లో అందుబాటులోకి తీసుకురానున్నట్టు డీఎంఈ తెలిపారని జూడాలు పేర్కొన్నారు. డీఎన్‌బీ విద్యార్థులకు 8 నెలలుగా పెండింగ్‌లో ఉన్న స్టయిఫండ్ త్వరలోనే విడుదల చేసేందుకు మంత్రి అంగీకరించారని వెల్లడించారు.

ప్రయివేటు కాలేజీల్లోని పీజీ, ఇంటర్న్‌షిప్ విద్యార్థుల శిక్షణాభృతిపై సంబంధిత అధికారులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చినట్టు జూడాలు తెలిపారు. ఉస్మానియా ఆసుపత్రికి నూతన భవనాన్ని నిర్మించేందుకు మంత్రి అంగీకరించారని, రెండు నెలల్లో శంకుస్థాపన చేస్తామని చెప్పారని వెల్లడించారు. పెరిగిన వైద్య సీట్లకు అనుగుణంగా హాస్టళ్ల సదుపాయం మెరుగుపరిచేందుకు కూడా మంత్రి సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. పీజీ, ఇంటర్న్ షిప్ వైద్య విద్యార్థుల పనివేళలకు సంబంధించి విధి విధానాలు ఖరారు చేసేందుకు వీలుగా కమిటీని ఏర్పాటు చేయాలని చర్చల్లో నిర్ణయించినట్టు తెలంగాణ జూనియర్ వైద్యుల సంఘం అధ్యక్షులు కౌశిక్, ఉపాధ్యక్షులు పవన్ కల్యాణ్ తెలిపారు.

సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు న్యాయం చేయండి

- జీవో 22 ప్రకారం వేతనాలు పెంచండి : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గత రాష్ట్ర ప్రభుత్వం 25 వేల మంది సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిందనీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం జీవో నెంబర్ 22 ప్రకారమైనా, కోలిండియా ఇస్తున్నట్టుగానైనా వేతనాలివ్వాలని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం(సీఐటీయూ అనుబంధం) కోరింది. మంగళవారం హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిరావ్‌పూలే భవన్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణిలో అధికారులకు ఆ సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. మధు మీడియాతో మాట్లాడుతూ..సింగరేణి సంస్థ అభివృద్ధి పథంలో నడవటంలోనూ, లాభాలు గడించడంలోనూ కాంట్రాక్టు కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. కోలిండియాలో కాంట్రాక్టు కార్మికులకు రోజుకు రూ.1,199 చెల్లిస్తుంటే సింగరేణిలో మాత్రం కేవలం రూ.504 మాత్రమే చెల్లిస్తున్నారని చెప్పారు. దీనివల్ల సింగరేణి కాంట్రాక్టు కార్మికుడు రోజుకు రూ.695 చొప్పున రూ.18,070 నష్టపోతున్నారని వాపోయారు. జీఓ నెం.22 అమలు అనుమతి కోసం సింగరేణి యాజమాన్యం గతేడాది రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసినప్పటికీ స్పందించలేదని విమర్శించారు. 2022 సెప్టెంబర్‌లో 18 రోజుల సమ్మె సందర్భంగా జరిగిన ఒప్పందాన్ని సహితం సింగరేణి యాజమాన్యం పూర్తి స్థాయిలో అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి యాజమాన్యం కాంట్రాక్టు కార్మికుల పట్ల అడుగడుగునా వివక్ష చూపుతున్నదని వాపోయారు. ఎన్నికల సమయంలో సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు న్యాయం చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని గుర్తు చేశారు.

ప్రాణం తీసిన ప్రమాదం

- సంగారెడ్డి జిల్లాలో లారీ ఢీకొని తల్లీ కొడుకు మృతి
- గాయాలతో బయటపడిన తండ్రి



నవతెలంగాణ-కంది

స్కూటీపై వెళ్తున్న దంపతులను లారీ ఢీ కొట్టడంతో.. రెండేండ్ల కుమారుడితోపాటు తల్లీ అక్కడికక్కడే మృతి చెందింది. బైక్ నడుపుతున్న ఆమె భర్తకు గాయాలయ్యాయి. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని మామిడిపల్లి చౌరస్తా వద్ద మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన సత్యనారాయణ అరబిందో యూనిట్-1లో ఉద్యోగం చేస్తున్నాడు. మంగళవారం ఉదయం 8.30 సమయంలో సత్యనారాయణ తన భార్య మహేశ్వరి(26), కుమారుడు దేవాన్ష్(2) తో కలిసి కంది వైపు నుంచి పటాన్‌చెరుకు స్కూటీపై వెళ్తున్నాడు. ఈ నేపథ్యంలో మామిడిపల్లి చౌరస్తా వద్ద ఓ లారీ.. అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చి.. వారి స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తల్లీ కొడుకు లారీ చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందారు. స్కూటీని నడుపుతున్న సత్యనారాయణ మరోవైపునకు పడటంతో గాయాలయ్యాయి. డ్రైవర్ నిర్లక్ష్యంగా లారీ నడపడమే ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. ఈ మేరకు సంగారెడ్డి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



సమయానికి బస్సులు నడపాలని.. విద్యార్థుల రాస్తారోకో

వికారాబాద్ జిల్లా కొడంగల్ మండల పరిధిలో ఘటన...

నవతెలంగాణ-కొడంగల్

గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉన్నత చదువుల కోసం మండల కేంద్రానికి రావడానికి నిత్యం ప్రయాసపడుతున్నారు. విద్యాసంస్థల సమయానికి బస్సులు లేకపోవడంతో సమయానికి వెళ్లలేకపోతున్నామని విద్యార్థులు జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా కొడంగల్ మండల పరిధిలో జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. నీటూరు, కొడిడ్, నర్సాపూర్ మీదుగా వచ్చే బస్సు సమయానుకూలంగా రాకపోవడంతో సమయానికి పాఠశాలకు వెళ్లలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తరగతులకు హాజరు కాలేకపోతున్నామన్నారు. ఇదే విషయాన్ని అనేకమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోయారు. గతంలో బస్సులు నడిపిస్తామని చెప్పారని కానీ ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు పాఠశాల సమయానికి బస్సులు నడపాలని, లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వచ్చారు. ఆర్టీసీ అధికారులతో మాట్లాడి.. బస్సులు సకాలంలో వచ్చేలా చూస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు రాస్తారోకో విరమించారు. విద్యార్థుల రాస్తారోకోతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి.

'డబుల్' ఇల్లు ఇవ్వలేదని.. సర్పంచ్‌పై దాడి

ఫర్నిచర్‌పై పెట్రోల్ పోసి నిప్పు

కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండలంలో...





నవతెలంగాణ-భిక్కనూర్

డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఓ యువకుడు పెట్రోల్‌బాటిల్‌తో హల్‌చల్ చేశాడు. జీపీ కార్యాలయంలో సర్పంచ్‌తో వాగ్వాదానికి దిగి తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఫర్నిచర్ మీద పోసి నిప్పుపెట్టాడు. స్థానికులు, సర్పంచ్ హుటాహుటిగా కుర్చీ, టేబుల్ బయట పడేయడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటన కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండలంలోని సిద్ధ రామేశ్వరనగర్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది.

పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రంజిత్ అనే యువకుడు అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీలో ఉన్నాడు. బీఆర్ఎస్ పార్టీలో చేరితేనే డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు వస్తదని సర్పంచ్ జనగామ శ్రీనివాస్ తెలపడంతో రంజిత్ వారి కుటుంబ సభ్యులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఇల్లు వస్తదన్న ఆశతో ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ పార్టీ కోసం పనిచేశాడు. ఎన్నికలు ముగిసిన తర్వాత డబుల్ బెడ్‌రూమ్ లిస్టులో పేరు ఉన్నా ఇల్లు ఎందుకు ఇవ్వడం లేదని సర్పంచ్‌ను పలుమార్లు రంజిత్ అడిగాడు. ప్రభుత్వం మారిందని ఇప్పుడు ఇండ్ల పంపిణీ తన చేతుల్లో లేదని, ప్రభుత్వం ఎప్పుడు ఇస్తే అప్పుడు అందరితో పాటు నీకూ వస్తుందని సర్పంచ్ తెలిపారు. నెల రోజుల తర్వాత సర్పంచ్ పదవి దిగిపోతావని మళ్లీ మరో సర్పంచ్ వస్తే తన పరిస్థితి ఏందని బలవంతంగా కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్ పార్టీలో తనను చేర్పించావని రంజిత్ సర్పంచ్‌తో వాగ్వాదానికి దిగాడు.

ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ వాళ్లు నాకు ఇల్లు ఇవ్వకపోతే నా పరిస్థితి ఏందని సర్పంచ్‌ను నిలదీశాడు. పూరి గుడిసెలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, పార్టీలో చేరితే ఇల్లు ఇస్తానని చెప్పడంతో చేరానని, తనకు ఇల్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆగ్రహంతో తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను గ్రామపంచాయతీలో సర్పంచ్ కుర్చీపై పోసి నిప్పంటించాడు. దాంతో ఒక్కసారిగా కార్యాలయంలో మంటలు చెలరేగి కుర్చీ, టేబుల్, ఫైళ్లకు నిప్పు అంటుకుంది. గమనించిన స్థానికులు కుర్చీ, టేబుల్‌ను బయటకు లాగి మంటలు ఆర్పి వేశారు. తనపై హత్యాయత్నం చేసిన రంజిత్‌పై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ సాయికుమార్ తెలిపారు. కాగా ప్రభుత్వ కార్యాలయంలో విధులకు ఆటంకం కల్పించి సర్పంచ్‌పై దాడికి పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో, ఎంపీవో ఫిర్యాదు చేశారు.

సంపాదకీయం

'సచ్చే' దిన్!

ప్రధాని మోడీ, ఆయన పార్టీ బీజేపీ వల్లె వేస్తున్న 'వికసిత భారత్'లో నిరుద్యోగం భయంకర స్థాయికి చేరుకుంది. ఈ కఠోర నిజం కేంద్ర ప్రభుత్వానికి చెందిన స్టాటిస్టిక్స్ అండ్ ప్రోగ్రామ్ ఇంప్లి మెంటేషన్ మంత్రిత్వశాఖ తాజా పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పిఎల్‌ఎఫ్ఎస్)తో బహిర్గతమైంది. సదరు అధ్యయనం ప్రకారం దేశంలో 15 ఏళ్లు, అంత కంటే ఎక్కువ వయసు కలిగిన గ్రాడ్యుయేట్లలో 13.4 శాతం మంది నిరుద్యోగంలో మగ్గుతున్నారు. దేశంలోకెల్లా అత్యల్ప నిరుద్యోగిత రేటు చండీగఢ్‌లో 5.6 శాతం కాగా ఢిల్లీలో 5.7 శాతం. అండమాన్ నికోబార్ దీవుల్లో అత్యధికంగా 33 శాతం నిరుద్యోగిత ఉంది. ఈ సర్వే ఫీల్డ్ వర్క్ జూన్ 2022 నుంచి జులై 2023 మధ్య జరిగింది. పదేళ్ల మోడీ ఏలుబడిలో దేశం నిరుద్యోగ భారతాన్ని ఆవిష్కరించిందనడానికి ఇంతకంటే వేరే సాక్ష్యా ధారాలు అవసరం లేదు. ఈ కాలంలో నిరుద్యోగ సమస్య ఆందోళనకర స్థాయికి చేరుతోందని పలు అధ్యయనాలు ఘోషిస్తున్నాయి. కార్పొరేట్ దిగ్గజాల్లో ఒకరైన అజీం ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయం ఈ మధ్య విడుదల చేసిన సర్వే మేరకు దేశంలో 25 ఏళ్లలోపు గ్రాడ్యుయేట్లలో 42.3 శాతం నిరుద్యోగులేనని తేల్చింది. ఉన్నత మాధ్యమిక విద్య పూర్తి చేసిన వారిలో 21.4 శాతం నిరుద్యోగులు. ప్రపంచ ఆర్థిక మాంద్యం వచ్చిన 2008 నుంచీ చూసుకుంటే కేంద్రంలో బీజేపీ వచ్చాక నిరుద్యోగిత రేటు పెరిగిందని నేషనల్ శాంపిల్ సర్వే కుండబద్దలు కొట్టింది. 2023 అక్టోబర్‌లో నిరుద్యోగిత రేటు 10.05 శాతానికి చేరింది. ఇదీ బీజేపీ పాలనలో దేశం వెలిగిపోతున్న దృష్టాంతం.

> రాష్ట్రంలో నిరుద్యోగానికి మొదటి దోషి బీజేపీ అయితే రెండవ దోషి ఇక్కడ ఏలిన గత ప్రభుత్వం.నిరుద్యోగ సమస్య పరిష్కారం కావాలంటే ప్రభుత్వాల విధానాలు మారాలి. కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు మేనిఫేస్టోలో చెప్పిన విధంగా యువతకు జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి. నిరుద్యోగులను ఇదిగో..అదిగో అని ఊరిస్తున్న మెగా డిఎస్సీని వీలైనంత తొందరగా ప్రకటించాలి. లేదంటే నిరాశ,నిస్పృహలతో ఉన్న యువత పోరాటబాటపడితే ఆపడం ఎవరితరం కాదనే విషయాన్ని గ్రహించాలి.



ప్రధాని అభ్యర్థిగా 2014 ఎన్నికల్లో యువతకు మోడీ ఇచ్చిన ప్రధాన హామీ ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు. తొమ్మిదిన్నరేళ్లల్లో ఒక్క కొత్త ఉద్యోగం కూడా ఇవ్వలేదు. ఇచ్చి ఉంటే నిరుద్యోగిత ఎందుకు కట్టలు తెంచుకుంటుంది? స్టార్టప్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా నినాదాలు గాలిలో ఉన్నాయి. చివరికి ఎక్కడిదాకా వచ్చిందంటే, విధిలేక వీధుల వెంట పకోడీలు అమ్ముకునే పని కూడా ఉపాధి, ఉద్యోగం కిందికే వస్తుందనే స్థాయికి ప్రధాని, బీజేపీ పెద్దలు భాష్యాలు చెప్తున్నారు. ఈ చర్య నిరుద్యోగులను అపహాస్యం చేయడమే. ఇప్పటి వరకు రైతుల, వ్యవసాయ కార్మికుల ఆత్మహత్యల గురించే విన్నాం. ప్రస్తుతం నిరుద్యోగుల ఆత్మహత్యలూ సంభవిస్తున్నాయని నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో గణాంకాలు తెలుపుతున్నాయి. దేశాన్ని ముందుకు నడిపించాల్సిన యువత ఉపాధి లేక నిరాశ నిస్పృహలతో బలవన్మరణాలకు పాల్పడటం సమాజానికి చేటు. దేశ జనాభాలో 35 ఏండ్ల లోపు యువత 66 శాతం ఉంటుందని ఒక అంచనా. కోట్లాదిగా ఉన్న వీరికి ఉద్యోగ, ఉపాధి లేకపోతే బీజేపీ ప్రచారం చేసుకునే 'అచ్చేదిన్' ఎలా ?

మోడీ ఎంచుకున్న నయా ఉదారవాద విధానాలు ఉపాధి రహిత భారతాన్ని నిర్మిస్తున్నాయి. ఈ వాస్తవాన్ని బీజేపీ సర్కారు సుతరాం అంగీకరించదు. ప్రభుత్వరంగ సంస్థలను అమ్ముతోంది. లాభాల్లో ఉన్న వాటిని కూడా కార్పొరేట్లకు అప్పనంగా ధారాదత్తం చేస్తోంది. దాంతో కొత్త ఉద్యోగాలేమోకానీ, ఉన్న ఉద్యోగాలు ఊడుతున్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద రవాణా వ్యవస్థ రైల్వేలో రెండు లక్షలకుపైన ఉద్యోగాలు నియామకాల్లేక ఖాళీగా ఉన్నాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుంది. పిఎల్‌ఎఫ్ఎస్ తాజా రిపోర్టు ప్రకారం తెలంగాణలో నిరుద్యోగిత రేటు 15.1 శాతం. జాతీయ సగటు కంటే మన రాష్ట్రంలో చాలా ఎక్కువ ఉండటం ఆందోళన కలిగిస్తోంది. డిగ్రీలు, పీజీలు చేసిన యువకులు చాలామంది ఖాళీగా ఉంటున్నారు. కొంతమంది చిన్నపనులు చేసుకుంటూ పొట్ట పోసు కుంటున్నారు. పట్టాలు చేత పట్టుకుని ప్రయివేటు కంపెనీల చుట్టూ తిరిగేవారు అధికం. ఉద్యోగాలపై ఆశచావని వారు కోచింగ్‌సెంటర్లలో డబ్బులు వెచ్చించి మరీ సన్నద్ధమవుతున్నారు. రాష్ట్రంలో నిరుద్యోగానికి మొదటి దోషి బీజేపీ అయితే రెండవ దోషి ఇక్కడ ఏలిన గత ప్రభుత్వం.నిరుద్యోగ సమస్య పరిష్కారం కావాలంటే ప్రభుత్వాల విధానాలు మారాలి. కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు మేనిఫేస్టోలో చెప్పిన విధంగా యువతకు జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి. నిరుద్యోగులను ఇదిగో..అదిగో అని ఊరిస్తున్న మెగా డిఎస్సీని వీలైనంత తొందరగా ప్రకటించాలి. లేదంటే నిరాశ,నిస్పృహాలతో ఉన్న యువత పోరాటబాటపడితే ఆపడం ఎవరితరం కాదనే విషయాన్ని గ్రహించాలి.

డీవీఆర్ యాదిలో...

కామ్రేడ్ డీవీఆర్ కన్నుమూసి నేటికి నాలుగేండ్లు. ఆయన ప్రజా, ఉపాధ్యాయ ఉద్యమాలకు పెట్టింది పేరు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో డీవీఆర్ అంటే తెలియనివారు ఉండరంటే అతిశయోక్తి కాదు. వృత్తి ఉపాధ్యాయుడే అయినా ఆయన ప్రవృత్తి మాత్రం కమ్యూనిజం. సమాజం మారకుండా విద్యా వ్యవస్థ మారదని, సమాజాన్ని మార్చుటకు ఉత్పత్తికి అవసరమయ్యే ప్రకృతి, పనిముట్లు, మానవశ్రమకు తోడ్పడతాయని నమ్మి ఆచరించే మార్క్సిస్టు ఉద్యమాన్ని ఎన్నుకుని జీవితాంతం పనిచేసిన ఆదర్శమూర్తి.

ఆయన పుట్టింది నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం మార్చాల. పూర్తి పేరు దేశం వెంకట్‌రెడ్డి. కానీ ఉద్యమ సహచరులంతా డీవిఆర్‌గా పిలుచుకునే వారు. ఆయన జడ్‌పిహెచ్ఎస్ పొల్కంపల్లిలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేశారు. కుటుంబంతో సహా అదే గ్రామంలో నివాసముంటూ ప్రతిరోజూ అక్కడి హాస్టల్‌ను సందర్శించి చదువులో విద్యార్థులను ప్రోత్సహించేవారు. హాస్టల్ సమస్యల పరిష్కారానికి విద్యార్థి ఉద్యమాన్ని నిర్మించారు. ప్రధానోపాధ్యాయుడుగా ఉండి మహబూబ్‌నగర్ జిల్లాలో తాను పనిచేసిన గ్రామాల్లో ఉద్యోగ ధర్మంతో పాటు మార్క్సిజం విత్తనాలను చల్లి మొలకెత్తేటట్లు చేసిన ఘనత ఆయనదే. పొల్కంపల్లి, మాదారం, కల్వకుర్తి, నారాయణపేట, రాజోళి, తూంకుంట, రఘుపతిపేట, వంగూరు తదితర ఉన్నత పాఠశాలల్లో పనిచేసి 1989లో ఉద్యోగ స్వచ్ఛంద విరమణ చేశారు. అనంతరం పూర్తికాలం కమ్యూనిస్టు కార్యకర్తగా జిల్లా పార్టీ సభ్యుడుగా ఉండి పేదల కోసం అనేక గ్రామాల్లో భూ పోరాటాలు నిర్వహించారు. నిరుపేదలకు భూములు పంచి ప్రాంతంలో పేదప్రజలకు సన్నిహితుడయ్యాడు.



జిల్లాలో వివిధ ప్రాంతాలలో జరిగిన భూపోరాటాల ఉత్తేజంతో కల్వకుర్తి డివిజన్‌లో వివిధ గ్రామాల్లో పోరాటాలు జరిగాయి. పార్టీ రాష్ట్ర నాయకులు పి.మధు, భీంరెడ్డి నర్సింహ్మారెడ్డి, క్రిష్ణమూర్తి, జిల్లా కార్యదర్శి వనగంటి ఈశ్వర్, జిల్లా నాయకులు ఆర్.రాంరెడ్డి, కిల్లెగోపాల్, ఎ.రాములు, యం.యాదయ్య ఈ పోరాటాల్లో భాగస్వాములయ్యారు. పోతారెడ్డిపల్లి గ్రామంలో ఒక భూస్వామి ఆధీనంలో ఉన్న ప్రభుత్వ గైర్హాన్ భూమి పదహారెకరాలు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పోరాడి ముప్పై రెండు మందికి పంచారు. కిలోమీటర్ దూరంలో ఉన్న దుందుబినది నుండి ఎస్‌సి కార్పోరేషన్ ద్వారా రెండు లక్షల రూపాయల ఖర్చుతో పైప్‌లైన్ ద్వారా నీరు పంటకు అందించిన ఘనత పార్టీకి దక్కింది. ఈ ప్రభావం వంగూర్ మండలంలోని చౌదర్‌పల్లి, రంగాపూర్, కోనాపూర్, పొల్కంపల్లి, చింతపల్లి, వెంకటాపురం, సదగోడు, జాజాల గ్రామాలలో పార్టీశాఖలు ఏర్పడి భూపోరాటాలు జరగడానికి డీవిఆర్ ప్రధాన భూమిక.

రాష్ట్ర ప్రజానాట్య మండలి బృందం ఆధ్వర్యంలో సీతారామరాజు బుర్రకథ ఎనిమిది గ్రామాల్లో ప్రదర్శించి ప్రజలను ఉత్తేజపరిచింది. ఈ స్ఫూర్తితో గట్టిప్పల్లపల్లిలో రెండు నెలలపాటు పాలేరులు, కూలీల సమ్మె జరిగింది. భూస్వాములు వారి భూములు వారే సాగు చేసుకుని సమ్మెను బలహీనపర్చడానికి ప్రయత్నం చేశారు. సమ్మెకు మద్దతుగా వివిధ వృత్తులవారు భూస్వాముల పనులు చేయకుండా ఆపివేయడంతో దిగివచ్చి జీతాలు, కూలి పెంచక తప్పలేదు. డీవిఆర్ పోరాట స్ఫూర్తితో తలకొండపల్లి మండలంలో అనేక గ్రామాలతో పాటు ఇతర మండల, గ్రామాలు వెల్జాల, చౌదరపల్లి, చీపునుంతల, ఉప్పలపహాడ్, రాచూరు, మాదాపల్లి, సెట్టిపల్లి, బ్రహ్మణ పల్లి, నాగిళ్ళ, వెంకట్‌రావుపేట, మార్చాల, రాచాలపల్లి, రాచూర్‌లో భూపోరాటాలు జరిగాయి. ఈ పోరాటాల ఫలితంగా 30 గ్రామాల్లో సుమారు పన్నెండు వందల ఎకరాల భూమి పేదలకు దక్కింది.

డీవిఆర్ జీవితం ప్రధానంగా రెండు పార్శ్వాలుగా కనిపిస్తాయి. ఒకటి ఉపాధ్యాయుడుగా, సంఘ నాయకుడిగా విద్యావ్యవస్థ మార్పుకోసం పోరాటం. రెండు కమ్యూనిస్టుగా సమాజ మార్పు కోసం, ఆచరణ-పోరాటాలు కనిపిస్తాయి. ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు ఆర్ రాంరెడ్డి ద్వారా ఎన్నో ఉద్యమాలు నిర్వహించి చివరివరకూ అంకితభావంతోనే పనిచేశారు. "విప్లవ కార్యాచరణ లేకుండా విప్లవ కారుడిగా జీవించలేవు" అన్నట్టు ప్రజాసంఘం లేదా పార్టీ నిర్మాణం కోసం మనం ఎంతో పని చేస్తున్నాం అనేది సొంతంగా విప్లవకారుడు పరిశీలించుకోవడానికి డీవిఆర్ చక్కటి ఉదాహరణ. తాను మరణించేవరకు ఎర్రజెండా వదులుకోలేదు. తనతో పాటు భార్య విజయలక్ష్మీ కుటుంబ సభ్యులను కూడా పార్టీ, ప్రజాసంఘాలలో పని చేయించారు.

నేడు భారత రాజ్యాంగ విలువలైన, లౌకిక ప్రజాస్వామ్యం, మతసామరస్యం, ఆర్థిక సార్వ భౌమాధికారం, సామాజిక న్యాయం, ఫెడరలిజాన్ని నాశనం చేయుటకు కేంద్రంలోని బీజేపీ పూనుకుంది. మతం సెంటిమెంట్‌తో, భావోద్వేగాలను రెచ్చగొట్టి, హిందూ, ఇతర మైనార్టీల మధ్య తగాదా సృష్టిస్తోంది. సనాతన ధర్మం పేరు మీద చాతుర్వర్ణ వ్యవస్థతో కూడిన హిందూత్వ రాజ్యాన్ని స్థాపించుటకు ప్రయత్నం చేస్తోంది. ప్రశ్నించే శక్తులను అణిచివేస్తోంది. బీజేపీ ప్రేరేపిస్తున్న ఈ మతోన్మాదాన్ని తిప్పికొట్టి, లౌకిక శక్తులు ఐక్యమత్యంతో పోరాడి భారతదేశ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించడమే డీవిఆర్ లాంటి నాయకులకు అందించే నిజమైన నివాళి.

(నేడు డీవీఆర్ నాలుగో వర్ధంతి)

- ఎ పి మల్లయ్య, 9440595421

ఆర్టికల్ 370పై కాంగ్రెస్ కప్పదాటు వైఖరి

ఆర్టికల్ 370పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు వివాదాస్పదంగా మారింది. న్యాయకోవిదులు, మేధావులు సుప్రీం తీర్పు వల్ల కేంద్ర, రాష్ట్ర సంబంధాల్లో ముందు అవాంఛనీయ పరిణామాలు జరగొచ్చని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాజ్యాంగంపై పట్టు కలిగిన న్యాయవాదిగా పేరున్న ఫాలినారిమన్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి మదన్ లోకుర్ వంటి వారు 370 ఆర్టికల్ రద్దు చెల్లదన్నారు. కాని చిత్రం ఏమిటంటే ఆర్టికల్ 370 రద్దు చేయరాదని డిమాండ్ చేస్తూ వచ్చిన ఆ కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు కప్పదాటు వేస్తోంది. ఆర్టికల్ 370 రద్దుతో కాంగ్రెస్ ఏకీభవిస్తూనే, దాన్ని అమలు చేసిన పద్ధతి బాగాలేదని గోడమీది పిల్లి వాటంగా చెప్పింది.



ఎస్. వినయ కుమార్

ఆర్టికల్ 370ని రద్దు చేయాలని మొదటి నుండి బీజేపీ డిమాండ్ చేస్తోంది. దాని లక్ష్యం కశ్మీరీల ప్రయోజనం కాదు. మత విద్వేషాలను రెచ్చగొట్టే ప్రక్రియలో భాగంగా 370ఆర్టికల్‌ను రద్దు చేయడంతో పాటు జమ్ముకశ్మీర్‌లోని లద్దాఖ్ ప్రాంతాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా మోదీ ప్రభుత్వం ప్రకటించింది. దేశవ్యాప్తంగా ముస్లిం విద్వేషం సృష్టించి మెజారిటీ హిందూ ఓట్లు పొందడం బీజేపీకి ప్రధానం. కాంగ్రెస్ కూడా ఈ విషయంలో బీజేపీ చెప్పుల్లో తన కాళ్లు దూర్చి హిందువుల ఓట్లు రాబట్టుకోవాలని తహతహలాడుతోంది.

> ఐక్య రాజ్యసమితి తీర్మానం ప్రకారం రెండు దేశాలు తమ సైన్యాలు అక్కడ నుంచి ఉపసంహరించుకున్నాక ప్రజాభిప్రాయ సేకరణ (ప్లెబిసైట్) జరపాలి. కాని అది ఇప్పటిదాక జరగలేదు. తన ఆధీనంలో ఉన్న కశ్మీరును ఆజాద్ కశ్మీరుగా పాకిస్తాన్ ప్రకటించింది. మిగతా భాగం భారతదేశంలోకి క్రమంగా భారత్ కశ్మీర్ స్వయం ప్రతిపత్తిని దిగజార్చింది. 17ఏండ్ల పాటు షేక్ అబ్దుల్లాను జైల్లో ఉంచింది ఈ మధ్య కాలంలో ప్రధాన మంత్రి హోదాను ముఖ్యమంత్రి హోదాగా, సదర్-ఏ-రియాసత్ హోదాను గవర్నరుగా మార్చారు. క్రమంగా భారత రాజ్యాంగాన్ని కశ్మీరుకు వర్తింపచేశారు. ప్రజాతంత్ర ప్రక్రియ అక్కడ క్రమంగా బలహీన పడింది.

బీజేపీ మతతత్వ విధానాలు మన రాజ్యాంగ విలువలకు, స్వాతంత్ర్యోద్యమ విలువలకు విరుద్ధమైనవి. ఈ విషయం ప్రజల ముందు వివరించి బీజేపీ రాజకీయాలను ఎండగట్టాల్సిన ప్రధాన ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ దానికి విరుద్ధంగా మతతత్వ ఎజెండాలో బీజేపీతో పోటీ పడాలని భావిస్తోంది. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్య ప్రదేశ్ ఎన్నికల తర్వాతయినా కాంగ్రెస్ సోయిలోకి రాలేదు.

సుప్రీం తీర్పుపై సీపీఐ(ఎం) ఘాటుగా స్పందించింది. "ఈ తీర్పుతో సుప్రీం కోర్టు తేనెటీగల తెట్టెను కదిపింది. రాష్ట్ర శాసన సభ అభిప్రాయానికి బదులు గవర్నర్ అభిప్రాయాన్ని తీసుకొంటే చాలని తద్వారా రాష్ట్రాల సరిహద్దులు కూడా మార్చుతూ రాష్ట్ర విభజన చేయవచ్చని సుప్రీం చెప్పినట్లుయింది. సమైక్యత పేరుతో కేంద్రప్రభుత్వానికి ఎక్కువ అధికారాలు ఇవ్వడానికే తీర్పు దోహదపడ్తోంది". అని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి హెచ్చరించారు. దీనివల్ల రాజ్యాంగంలోని సమాఖ్యతత్వానికి విఘాతం కలుగుతుంది. అని సీపీఐ(ఎం) హెచ్చరించింది.

సీపీఐ కూడా ఇదే తరహా స్పందనను వ్యక్తం చేసింది. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి డి. రాజా ఒక ప్రకటన చేస్తూ సుప్రీం తీర్పును ప్రశ్నించారు. "బీజేపీ ప్రభుత్వం చాలా హడావిడిగా జమ్ముకశ్మీర్ ప్రజలను సంప్రదించకుండా ఆ రాష్ట్రంపై నిర్ణయం చేసింది. బీజేపీ చూపిన మొండితనం దాని నియంతృత్వ ధోరణికి గుర్తు అని ఆయన విమర్శించారు. ఆర్టికల్ 370 రద్దులోని చట్టబద్ధతపై చెప్పిన తీర్పులో సుప్రీం అనేక ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా దాటేసిందని రాజా సుప్రీం తీర్పు సమాఖ్య వ్యవస్థకు పెద్ద విఘాతమని డిఎంకె విమర్శించింది. శివసేన సుప్రీం తీర్పును ఆహ్వానించింది. పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌ను కూడా విలీనం చేసి గ్రేటర్ కశ్మీర్ కు ఎన్నికలు జరపాలని ఉద్ధవ్‌థాక్రే చెప్పారు. విలీనం తర్వాత ఎన్నికలు జరడమంటే ఇక ఇప్పట్లో కశ్మీర్ ఎన్నికలు లేనట్లే.

మాజీ హోం మంత్రి కాంగ్రెస్ నాయకుడు పి.చిదంబరం అభిషేక్ సింఘ్వీతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ ఆర్టికల్ 370 రద్దును వెనకేసుకొచ్చారు. రద్దు చేసిన విధానంపైన మాత్రమే తాము సుప్రీంకోర్టుతో విబేధిస్తున్నామని చెప్పారు. భారత్ జోడో యాత్ర సందర్భంగా రాహుల్ గాంధీ ఆర్టికల్ 370 రద్దుపై మౌనం వహించడం గమనార్హం.

'ఇండియా' కూటమిలో భాగస్వాములైన నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి) పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పిడిపి) సుప్రీం తీర్పుతో గట్టిగా విబేధించాయి. పిడిపి అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ సుప్రీం తీర్పును 'మరణ శాసనం'గా అభివర్ణించారు. జమ్ము కశ్మీర్‌కు మాత్రమే కాదు భారతదేశం అన్న అవగాహనకు కూడా తీర్పు వల్ల విఘాతం కలిగిందన్నారు. కాగా నేషనల్ కాన్ఫరెన్సు నాయకుడు ఉమర్ అబ్దుల్లా సుప్రీంకోర్టును ఒప్పించడంలో తాము విఫలమైనందుకు జమ్ముకశ్మీర్ ప్రజలు తమను క్షమించాలి అని 2019 ఆగస్టు 5న 370ని రద్దు చేస్తూ మన నుండి లాక్కొన్న గుర్తింపు, గౌరవాలు మళ్లీ మనకు ఏదో ఒకరోజు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ మాత్రం 2019లో లోకసభలో ఈ అంశంపై అన్ని పార్టీలు తమ అభిప్రాయాలు తెలిపాయి. ప్రభుత్వం అనేక ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా దాటేసింది. మేము సుప్రీంకోర్టుకు వెళ్లాం. ఇప్పుడు సుప్రీంకోర్టు తన నిర్ణయం తెల్పింది. ఇక ఇప్పుడు చెప్పగలిగిందేమీ లేదు. ప్రతిఒక్కరూ సుప్రీంకోర్టు నిర్ణయంతో ఏకీభవిస్తారని అన్నారు. ఆమ్‌ఆద్మీపార్టీ 2019లోనే ఆర్టికల్ 370 రద్దును సమర్థించింది.

ఆర్టికల్ 370ఎ కేంద్రం రద్దు చేయడానికి ఒక రోజు ముందు 2019 ఆగస్టు 4న శ్రీనగర్‌లోని గుప్కర్ రోడ్డులోని నేషనల్ కాన్ఫరెన్సు అధ్యక్షుడు ఫరూఖ్ అబ్దుల్లా నివాసంలో కాంగ్రెస్ సహా పిడిపి, ఎన్‌సి పార్టీలు సమావేశమై ఆర్టికల్ 370ని సమర్థిస్తూ ఉమ్మడి ప్రకటన చేశాయి. 2020 నవంబర్ తర్వాత పిఏజిడి నుండి కాంగ్రెస్ తప్పుకొంది. అది తప్పుకోవడానికి ఒకరోజు ముందు కేంద్ర మంత్రి అమిత్‌షా పిఏజిడిని గుప్కర్ గ్యాంగ్‌గా అపవిత్ర గ్లోబల్ ఘట్బంధన్‌గా అభివర్ణించారు. అంతకు ముందు జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదా తొలగించాక అక్కడి ప్రజలు ఉపాధి కుంభకోణాలతో, భూమి మాఫియా, వైన్‌షాపులు, స్మార్ట్ మీటర్లు వగైరా రూపంలో దారుణమైన బాధలు పడాల్సి వచ్చిందని కశ్మీర్ ప్రదేశ్ కాంగ్రెస్ చెప్పింది.

ఆర్టికల్ 370 నేపథ్యం

దేశ విభజన సందర్భంగా కశ్మీర్ రాజు హరిసింగ్ తాను స్వతంత్ర రాజుగానే కొనసాగుతానని చెప్పారు. ఒక తుది నిర్ణయానికి రాక ముందే స్థానిక ఆదివాసీల ముసుగులో పాకిస్తాన్ సైన్యాలు కశ్మీరుపై దాడి చేశాయి. మహారాజ హరిసింగ్ లోయను వదలి సురక్షితంగా వేరే ప్రాంతానికి వెళ్లారు. ఆ దశలో ఆనాటి నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్లా (ఫరూక్ అబ్దుల్లా తండ్రి) ప్రధాన పాత్ర పోషించి భారత సైన్యాలు అక్కడ జోక్యం చేసుకొనేట్లు చూశారు. కశ్మీర్‌లో 80శాతం జనాభా ముస్లింలున్నా వారు పాకిస్తాన్‌తో విలీనం కావాలనుకోలేదు.

అయితే ఏదో ఒక ఒప్పందం లేకుండా, భారతదేశం తన సైన్యాలను అక్కడికి ఎలా పంపగలదని నెహ్రూ ప్రశ్నించారు. నెహ్రూ వ్యక్తం చేసిన అభిప్రాయాన్ని గమనంలో ఉంచుకొని ఆ రాష్ట్ర ప్రజల రక్షణ కోసం భారత రాజ్యాంగంలో 370 ఆర్టికల్‌ని చేర్చుతూ హరిసింగ్‌తో ఒక ఒప్పందానికి వచ్చారు. ఆ ఒప్పందంలోని ప్రధాన అంశం "ఇద్దరు ప్రధానులు రెండు రాజ్యాంగాలు" (దోప్రధాన్, దో విధాన్). భారత ప్రభుత్వం ఆ రాష్ట్ర రక్షణతో పాటు విదేశీ వ్యవహారాలు, కమ్యూనికేషన్లు, కరెన్సీలను చూసుకోవాలి. ఇతర అంశాలను కశ్మీరు రాష్ట్ర అసెంబ్లీ నిర్ణయిస్తుంది. కశ్మీరు తన స్వంత రాజ్యాంగాన్ని రూపొందించుకోవాలి. ఆ షరతుల ప్రకారం భారత ప్రభుత్వం తన సైన్యాలను అక్కడికి పంపింది. ఆలోగా పాకిస్తాన్ కాశ్మీరులోని మూడవ వంతు భాగాన్ని ఆక్రమించుకొంది. ఐక్య రాజ్యసమితి తీర్మానం ప్రకారం రెండు దేశాలు తమ సైన్యాలు అక్కడ నుంచి ఉపసంహరించుకున్నాక ప్రజాభిప్రాయ సేకరణ (ప్లెబిసైట్) జరపాలి. కాని అది ఇప్పటిదాక జరగలేదు. తన ఆధీనంలో ఉన్న కశ్మీరును ఆజాద్ కశ్మీరుగా పాకిస్తాన్ ప్రకటించింది. మిగతా భాగం భారతదేశంలోకి క్రమంగా భారత్ కశ్మీర్ స్వయం ప్రతిపత్తిని దిగజార్చింది. 17ఏండ్ల పాటు షేక్ అబ్దుల్లాను జైల్లో ఉంచింది ఈ మధ్య కాలంలో ప్రధాన మంత్రి హోదాను ముఖ్యమంత్రి హోదాగా, సదర్-ఏ-రియాసత్ హోదాను గవర్నరుగా మార్చారు. క్రమంగా భారత రాజ్యాంగాన్ని కశ్మీరుకు వర్తింపచేశారు. ప్రజాతంత్రప్రక్రియ అక్కడ క్రమంగా బలహీన పడింది.

> భారత ప్రభుత్వం అక్కడి ప్రజల జాతి ఆకాంక్షలను అణిచి వేసింది. ఎన్నికైన ప్రభుత్వాలను పదే పదే తొలగించింది. తమకు స్వయం ప్రతిపత్తి ఇవ్వాలన్న డిమాండును పట్టించుకోలేదు. అవుట్‌లుక్ పత్రిక (అక్టోబరు 16,2000) జరిపిన అభిప్రాయ సేకరణలో 74 శాతం మంది కశ్మీరీలు తమకు ప్రత్యేక గుర్తింపు కావాలని కోరారు. 16 శాతం మంది కశ్మీరుకు స్వయం ప్రతిపత్తి కావాలన్నారు. కేవలం రెండు శాతం మాత్రమే పాకిస్తాన్‌తో విలీనం కావాలని కోరారు. 39 శాతం మంది ప్రజలు తమకు భారత రాజ్యాంగం పరిధిలోనే పరిష్కారం దొరుకుతుందని అభిప్రాయపడ్డారు. మిలిటెంట్ల ప్రధాన కార్యకలాపాలు 1990 నుండి ప్రారంభమయ్యాయి. అంటే 1987లో రిగ్గింగ్ ద్వారా జరిగిన ఎన్నికల తర్వాత అన్నమాట.

ఫరూఖ్ అబ్దుల్లా ప్రభుత్వాన్ని 1984లో రద్దు చేశారు. ఆ తర్వాత 1987లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ రిగ్గింగ్ చేసి గెలిచిందని ఆయన ఆరోపించారు. అక్కడి ప్రజల్లో పూర్తిగా భ్రమలు తొలగి, యువకులు హింసా రాజకీయాల్లోకి వెళ్లారు. మిలిటెన్సీ పెరిగిపోయింది. దీన్ని అవకాశంగా తీసుకొని పాకిస్తాన్ తన మిలిటెంట్లను అక్కడికి పంపనారంభించింది. పరిస్థితి రోజురోజుకూ దిగజారింది. ఆ సమయంలో ఫరూక్ అబ్దుల్లాను ఏడేళ్ల సుదీర్ఘ కాలం జైలుకు పంపారు. ఆ స్థితిలో సోవియట్ సైన్యానికి వ్యతిరేకంగా పోరాడేందుకు అమెరికా సృష్టించిన అల్‌ఖైదా తన లక్ష్యం సాధించాక కశ్మీరు లోయలోకి అడుగు పెట్టింది.



టెర్రరిజమ్ కశ్మీరు పరిస్థితిని మరింత క్షీణింప చేసింది. స్థానిక ముస్లిం జనాభాకు, కశ్మీరు పండిట్లకు మధ్య ఉన్న సామరస్యం స్థానంలో మతతత్వ కోణం జోడించారు. ఈ వక్రీకరణ టెర్రరిస్టులకు ఉపయోగపడింది. టెర్రరిస్టులలోని ఒక సెక్షన్ హిందువులను లక్ష్యంగా చేసుకుంది. కశ్మీరులోని ముస్లింలందరూ టెర్రరిస్టులనే భావనతో అప్పటి గవర్నరు జగ్మోహన్ ప్రవర్తించారు. పండిట్లు కశ్మీరు లోయను వదిలి వెళ్తే! తాను మిలిటెంట్లను ఏరేయగలనని గవర్నర్ భావించారు. గవర్నరు ప్రోత్సాహంతో పండిట్లు లోయను వదిలి కాందిశీకుల శిబిరాల్లో తలదాచుకొన్నారు. టెర్రరిస్టుల వల్ల ముస్లిం జనాభా సైతం చాలా బాధలను అనుభవించింది. వారిని కూడా టెర్రరిస్టులు చంపారు. కొందరు ముస్లింలు కూడా లోయను వదిలేసి వచ్చారు. రెండు పొరుగు దేశాల మధ్య ఏర్పడిన సమస్యకు మతం రంగు అద్దారు.

భారత ప్రభుత్వం అక్కడి ప్రజల జాతి ఆకాంక్షలను అణిచి వేసింది. ఎన్నికైన ప్రభుత్వాలను పదే పదే తొలగించింది. తమకు స్వయం ప్రతిపత్తి ఇవ్వాలన్న డిమాండును పట్టించుకోలేదు. అవుట్‌లుక్ పత్రిక (అక్టోబరు 16, 2000) జరిపిన అభిప్రాయ సేకరణలో 74 శాతం మంది కశ్మీరీలు తమకు ప్రత్యేక గుర్తింపు కావాలని కోరారు. 16శాతం మంది కశ్మీరుకు స్వయం ప్రతిపత్తి కావాలన్నారు. కేవలం రెండు శాతం మాత్రమే పాకిస్తాన్‌తో విలీనం కావాలని కోరారు. 39 శాతం మంది ప్రజలు తమకు భారత రాజ్యాంగం పరిధిలోనే పరిష్కారం దొరుకుతుందని అభిప్రాయపడ్డారు. మిలిటెంట్ల ప్రధాన కార్యకలాపాలు 1990 నుండి ప్రారంభమయ్యాయి. అంటే 1987లో రిగ్గింగ్ ద్వారా జరిగిన ఎన్నికల తర్వాత అన్నమాట. కేంద్ర ప్రభుత్వంతో పాటు కశ్మీరీలు ఎన్నుకొన్న ప్రభుత్వాలు కూడా అక్కడి సాధారణ ప్రజల అభ్యున్నతికి కృషి చేయనందున కశ్మీర్ సమస్య మానని పుండులా మారింది.

> సుప్రీం తీర్పుపై సీపీఐ(ఎం) ఘాటుగా స్పందించింది. "ఈ తీర్పుతో సుప్రీం కోర్టు తేనెటీగల తెట్టెను కదిపింది. రాష్ట్ర శాసనసభ అభిప్రాయానికి బదులు గవర్నర్ అభిప్రాయాన్ని తీసుకొంటే చాలని తద్వారా రాష్ట్రాల సరిహద్దులు కూడా మార్చుతూ రాష్ట్ర విభజన చేయవచ్చని సుప్రీం చెప్పినట్లుయింది. సమైక్యత పేరుతో కేంద్రప్రభుత్వానికి ఎక్కువ అధికారాలు ఇవ్వడానికే తీర్పు దోహదపడ్తోంది". అని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి హెచ్చరించారు. దీని వల్ల రాజ్యాంగంలోని సమాఖ్యతత్వానికి విఘాతం కలుగుతుంది. అని సీపీఐ(ఎం) హెచ్చరించింది.

సెల్ : 9989718311

గవర్నర్ల ద్వారా ప్రభుత్వాలను అస్థిరపరిచే కుట్ర!

మానవ వనరుల అభివృద్ధిలో కేరళ మొదటి స్థానంలో, తమిళనాడు రెండో స్థానంలో ఉన్నాయి. ఈ రెండు రాష్ట్రాల్లో బీజేపీ ఒంటరిగా శాసనసభకు లేదా పార్లమెంటుకు పోటీ చేస్తే ఒక్క సీటు కూడా గెలవదని వారికి, ప్రజలకు బాగా తెలుసు. చాలా ఏళ్లుగా బీజేపీ పరిస్థితి ఇదే. ఇది బీజేపీ నాయకత్వాన్ని కలవరపెడుతోంది. కేరళ, తమిళనాడు లోని రెండు ప్రభుత్వాలను అస్థిరపరిచేందుకు బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం నిరంతరం ప్రయత్నిస్తోంది. అందుకోసం ఎన్ఐఎ, సిబిఐ, ఇ.డి తదితర కేంద్ర ఏజెన్సీలను ఇరు రాష్ట్రాల్లోనూ రప్పించి తమకు ఏమైనా ప్రయోజనం చేకూరుతుందా అని చూస్తున్నారు. అక్కడి నాయకులను అవినీతిపరులుగా ముద్ర వేసే ప్రయత్నం చేస్తున్నారు.


కేరళలో బంగారం స్మగ్లింగ్ కేసును కేంద్ర ఏజెన్సీలు నెలల తరబడి దర్యాప్తు చేస్తున్నాయి. దర్యాప్తులో ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను ఈ కేసులో ఇరికించలేకపోయారు. చార్జిషీటు దాఖలైన తర్వాత కూడా ముఖ్యమంత్రిని ఎలాగైనా ఇరికించాలనే చూస్తున్నది. తమిళనాడు లోని మంత్రుల ఇళ్లు, కార్యాలయాల్లో తనిఖీలు చేసి కేసు నమోదు చేయవచ్చా లేదా అనేదానిపైనే ఇ.డి దృష్టి వుంది. తమిళనాడు, కేరళతో పాటు ఢిల్లీ, పంజాబ్ సహా బీజేపీయేతర రాష్ట్రాల్లోని ప్రతిపక్షాలను నాశనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ ఏజెన్సీలను ఉపయోగించు కుంటోంది.

మహారాష్ట్రలో వివిధ కేసులు నమోదు చేయడం ద్వారా బీజేపీ 3/4అజిత్ పవార్‌ను తమ కాషాయ గూటికి చేర్చింది. కానీ కేరళ, తమిళనాడులో అది కుదరలేదు. అందుకే తమిళనాడు, కేరళలో గవర్నర్ల ద్వారా పాలనాపరమైన సంక్షోభాన్ని సృష్టించే పనిలో పడింది. రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లులను కేంద్రం నియ మించిన గవర్నర్ అడ్డుకుంటున్నారు. రాష్ట్రాల సామాజిక-ఆర్థిక వృద్ధికి ఆటంకం కలిగించే విధంగా గవర్నర్లు వ్యవహరిస్తున్నారు. ఇది ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో రాష్ట్ర ప్రగతికి ఆటంకం కలిగిస్తుంది. కేరళలో మూడేళ్లకు పైగా రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లులను గవర్నర్ ఆమోదించలేదు. తమిళనాడు అసెంబ్లీ ఆమోదించిన 12 బిల్లులను గవర్నర్ ఆర్.ఎన్.రవి ఆమోదించలేదు. గవర్నర్ల నియంతృత్వ చర్యలకు వ్యతిరేకంగా కేరళ, తమిళనాడు, పంజాబ్ రాష్ట్రాలు సుప్రీం కోర్టును ఆశ్రయించాయి.



> నవంబర్ 26న తమిళనాడు అంబేద్కర్ న్యాయ విశ్వ విద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రవి మాట్లాడారు. 'స్వాతంత్ర్యం కోసం పోరాడినప్పుడు, అందరూ కలిసి ఒకటిగా నిలిచారు. ఆ తర్వాత భాషా ప్రాతిపదికన రాష్ట్రాలుగా విడిపోయారు. నిపుణుల కమిటీల లోతైన అధ్యయనాల తర్వాత మన రాజ్యాంగం ఆమోదించబడింది. అయినా, ఇది ఇంకా అసంపూర్ణంగానే ఉంది.' అన్నారు. భాషా ప్రయుక్త రాష్ట్రాలను, సంకీర్ణ పాలనను ఆర్ఎస్ఎస్ సభ్యుడు ఆర్.ఎన్.రవి అంగీకరించరని పైన పేర్కొన్న ప్రసంగాన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు.

శాసనసభ ఆమోదించిన బిల్లులు, చట్టాలపై సంతకం చేయకుండా ఆపరాదని, బిల్లులపై సంతకం చేయకపోవడానికి కారణం ఉంటే దానిపై నోట్ రాసి బిల్లులను వెనక్కి పంపాలని పంజాబ్ గవర్నర్ బన్వరీలాల్ పురో హిత్‌కు సుప్రీంకోర్టు సూచించింది. అదే బిల్లును మళ్లీ అసెంబ్లీ ఆమోదించినట్లయితే, ఆ బిల్లులపై గవర్నర్ సంతకం చేయాల్సి ఉంటుందని కూడా సుప్రీం కోర్టు చెప్పింది. కేంద్ర ప్రభుత్వం నామినేట్ చేసే గవర్నర్లకు ప్రజలచే ఎన్నుకోబడిన శాసనసభ కంటే ఎక్కువ అధికారం లేదని కూడా సుప్రీం కోర్టు పేర్కొంది. అంతేకాదు, గత మూడేళ్లలో తమిళనాడు గవర్నర్ ఏం చేస్తున్నారని కూడా కోర్టు ప్రశ్నించింది. బిల్లులను ఆమోదించి సంతకాలు ఎందుకు చేయలేదని కోర్టు ప్రశ్నించింది. ఈలోగా ఎలాంటి నోట్లు రాయకుండానే గవర్నర్ బిల్లులను శాసనసభకు తిప్పి పంపారు.



జి. రామకృష్ణన్

ఆ తర్వాత 2023 నవంబర్ 18న ముఖ్యమంత్రి ఎం.కె స్టాలిన్ ప్రత్యేక అసెంబ్లీ సమావేశాన్ని ఏర్పాటు చేసి గవర్నర్ వెన క్కి పంపిన బిల్లులను మళ్లీ ఆమోదించి గవర్నర్‌కు పంపారు. ఆ సమావేశంలో ముఖ్యమంత్రి స్టాలిన్ మాట్లాడుతూ... "జ్వరం, జలుబు కారణంగా కొన్ని రోజులు సెలవులో ఉన్నాను. కానీ నా ఆరోగ్యం కంటే నా రాష్ట్ర ప్రజల మేలు గొప్పది. శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ శాసనసభ మేలు కంటే మన మాతభూమి అయిన తమిళనాడు సంక్షేమమే గొప్పది కాబట్టి నేను మీ ముందు నిలబడతాను"."కోట్ల మంది ప్రజలు మనకు ఇచ్చిన అధికార కేంద్రంగా శాసనాలు చేసే ఈ సభను అడ్డుకునేందుకు ఏ శక్తి ప్రయత్నించినా అది భారత ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అవుతుంది. అందుకే నేను మీ ముందు నిల్చొని ఉన్నాను. శాసనసభ ఆమోదించిన బిల్లులకు గవర్నర్ ఆమోదం తెల పకపోవడమంటే ఆ చట్టసభను అవమానించడమే." అన్నారు.

నవంబర్ 10వ తేదీన ఆర్.ఎన్.రవికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టు ప్రశ్నలు లేవనెత్తింది. ఆయన నవంబర్ 13న అన్ని బిల్లులను తిరిగి పంపారు. 18వ తేదీన మరోసారి బిల్లులను శాసనసభ ఆమోదించి గవర్నర్ సమ్మతికి పంపింది. 20న సుప్రీంకోర్టులో ఈ కేసు విచారణకు వచ్చినప్పుడు...తిరిగి వచ్చిన బిల్లులను అసెంబ్లీ మళ్లీ ఆమోదించి పంపితే గవర్నర్ సంతకం చేయక తప్పదని కోర్టు పేర్కొంది. కానీ ఆర్.ఎన్.రవి సుప్రీంకోర్టు తీర్పును పట్టించుకోకుండా ఒక్కటి తప్ప మిగతా బిల్లులన్నిటినీ రాష్ట్రపతికి పంపారు.

అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను గవర్నర్ రాష్ట్రపతికి పంపినట్లు తమిళనాడు ప్రభుత్వం డిసెంబర్ 1న సుప్రీంకోర్టుకు తెలియజేసింది. నిబంధన 200 ప్రకారం గవర్నర్ చర్య తప్పని, అలా చేసే అధికారం గవర్నర్‌కు లేదని కోర్టు బదులిచ్చింది. గవర్నర్ కూడా ముఖ్యమంత్రిని పిలిచి సమస్యను పరిష్కరించాలని ప్రతిపాదించారు. అయితే గవర్నర్‌కు ముఖ్యమంత్రితో ఫోన్ చేసి మాట్లాడేంత సంబంధాలు లేవని గవర్నర్ తరపు న్యాయవాది కోర్టుకు చెప్పారు. బీజేపీయేతర రాష్ట్రాల్లో కేంద్ర ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ కార్యకర్తలను, బీజేపీ మద్దతుదారులను గవర్నర్లుగా నియమిస్తోంది. రాష్ట్ర పరిపాలనను అనిశ్చితిలో పడవేయడమే గవర్నర్ల కర్తవ్యమని బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు భావిస్తున్నాయి. దీని ప్రకారమే తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి రాజ్యాంగ సూత్రాలను గాలికొదిలేసి ఆర్ఎస్ఎస్ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నారు.

నవంబర్ 26న తమిళనాడు అంబేద్కర్ న్యాయ విశ్వ విద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రవి మాట్లాడారు. 'స్వాతంత్ర్యం కోసం పోరాడినప్పుడు, అందరూ కలిసి ఒకటిగా నిలిచారు. ఆ తర్వాత భాషా ప్రాతిపదికన రాష్ట్రాలుగా విడిపోయారు. నిపుణుల కమిటీల లోతైన అధ్యయనాల తర్వాత మన రాజ్యాంగం ఆమోదించబడింది. అయినా, ఇది ఇంకా అసంపూర్ణంగానే ఉంది.' అన్నారు. భాషా ప్రయుక్త రాష్ట్రాలను, సంకీర్ణ పాలనను ఆర్ఎస్ఎస్ సభ్యుడు ఆర్.ఎన్.రవి అంగీకరించరని పైన పేర్కొన్న ప్రసంగాన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. బీజేపీయేతర రాష్ట్రాల్లో గవర్నర్లు మోడీ, అమిత్ షాల నియంత్రణలో ఉన్నారు. సంకీర్ణ పాలన, లౌకికవాదానికి వ్యతిరేకంగా చోటు చేసుకొంటున్న నియంతృత్వ పోకడలపై పోరాటాన్ని బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ఆర్ఎస్ఎస్ గవర్నర్ల చర్యలు మనకు గుర్తు చేస్తున్నాయి.

లారీలో నుంచి జారిపడ్డ గ్రానైట్ రాయి

తృటిలో తప్పిన పెనుప్రమాదం

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

గ్రానైట్ రాళ్ల లోడుతో వెళ్తున్న లారీ లోంచి పెద్ద గ్రానైట్ రాయి కింద పడి తృటిలో పెనుప్రమాదం తప్పింది. ఈ ఘటన మండల పరిధిలోని కోదాడ క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని పొన్నెకల్ వైపు నుంచి గ్రానైట్ రాళ్ల లోడుతో ఓ లారీ గుర్రాలపాడు వద్ద గల గ్రానైట్ ఫ్యాక్టరీల వైపు వెళ్తుంది. కోదాడ క్రాస్ రోడ్డుకు సమీపంలో లారీలోంచి పెద్దరాయి ఆకస్మాతుగా రోడ్డుపై పడింది. ఆ సమయంలో లారీ వెనుక కొంచెం దూరంలో వాహనాలు ఉన్నాయి. లారీకి దగ్గరగా ఎవరూ లేకపోవడంతో ఎటువంటి



ప్రమాదం జరగలేదు. పోలీసులు గ్రానైట్ రాయిని తొలగించి రహదారిపై రాకపోకలు సాగించారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా పూర్తిచేయాలి

కలెక్టర్ విపి.గౌతమ్

నవతెలంగాణ- ఖమ్మం



జిల్లాలో ధాన్యం కొనుగోలును వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్ తెలిపారు. మంగళవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో అధికారులతో, ధాన్య కొనుగోలుపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ధాన్య కొనుగోలుకు 231 కేంద్రాలు ప్రతిపాదించి, మంగళవారం నాటికి 226 కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. 93 కేంద్రాల్లో కొనుగోళ్ళ జరిపినట్లు, ఇప్పటికి 18505.160 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు ఆయన అన్నారు. రైస్ మిల్లుల తనిఖీలు చేపట్టి, సిఎంఆర్ ఎంత, ఇతరాలు ఎంతమేర ఉన్నవి చూడాలన్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి, ధాన్య కొనుగోళ్ళను పరిశీలించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఏ దశలోనూ ఆలస్యం చేయకూడదని, కొన్న ధాన్యాన్ని నమోదులు పూర్తి చేసి, వెంట వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని ఆయన తెలిపారు. ఓపిఎంఎస్ నమోదులు త్వరితగతిన పూర్తిచేసి, రైతులకు ధాన్యం డబ్బులు అందేలా చర్యలు వేగవంతం చేయాలన్నారు. గత సంవత్సరంలో ఇదే సమయంలో ఎంతమేర సేకరించింది, ఇప్పుడు ఎంత సేకరించింది పరిశీలన చేసి, తగు చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ఈ సమీక్షలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల, జిల్లా సహకార అధికారి విజయకుమారి, జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీలత, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.ఏ. అలీమ్, అదనపు డిఆర్డీవో జయశ్రీ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రబీ పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి

రబీ పంట సాగు మెలకువలపై రైతులకు పూర్తి అవగాహన కల్పించి, మెరుగైన ఫలితాలు సాధించేలా వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్ తెలిపారు. మంగళవారం నూతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్, వ్యవసాయ శాఖ అధికారులతో రబీ 2023-24 పంట పెట్టుబడి ఆర్థిక సహాయం, రైతుబీమా, మట్టి నమూనాల సేకరణ, భూసార పరీక్ష ఫలితాల కార్డుల అందజేత, పంటల నమోదు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయి మొదలు, డివిజన్, మండల, క్లస్టర్ స్థాయిలో అధికారులు పూర్తి సమన్వయంతో రైతులకు పంట సాగు విధానంపై ఎప్పటికప్పుడు వాతావరణ పరిస్థితుల కనుగుణంగా విధి విధానాలు తెలియజేయాలన్నారు. పామాయిల్ సాగు లాభసాటిదని, పామాయిల్ సాగు విస్తరణ లక్ష్యాల కనుగుణంగా రైతులకు అవగాహన కల్పించి, ఎక్కువ విస్తీర్ణంలో పామాయిల్ సాగుకు ప్రోత్సహించాలన్నారు. రైతు వేదికల్లో నిరంతరం శిక్షణా



కార్యక్రమాలు నిర్వహిస్తూ, పంటసాగు మెలకువలు, క్రమపద్ధతిలో క్రిమిసంహారక ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించి, ప్రతి క్లస్టర్ పరిధిలోని విస్తరణ అధికారులు అందుబాటులో ఉంటూ సలహాలు, సూచనలు అందించి తమ క్లస్టర్ పరిధిలో రైతులను చైతన్యవంతులను చేయాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి విజయనిర్మల, వ్యవసాయ సాంకేతిక విభాగం సహాయ సంచాలకులు సరిత, శ్రీనివాస్‌రెడ్డి, ఉద్యానవన శాఖ ఏడి అనిత, ఏడిఏలు, ఏఓలు, ఏఈఓలు, తదితరులు పాల్గొన్నారు.

నిత్యం ప్రజల మధ్యన ఎగిరేది 'ఎర్రజెండా'

- ఎన్నికలప్పుడు ఎగిరే జెండా కాదిది...
- ఈ ఆర్నెల్లు ఆరు గ్యారంటీలపై కార్యక్రమాలు
- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి

నవతెలంగాణ-సత్తుపల్లి



బూర్జువా పార్టీలకు చెందిన జెండాలు కేవలం ఎన్నికల సమయంలోనే కనపడతాయని, గెలిచినా, ఓడినా నిత్యం ప్రజల మధ్యనే ఎర్రజెండా ఎగురుతూనే ఉంటుందని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి అన్నారు. మంగళవారం సత్తుపల్లిలోని ప్రజా సంఘాల కార్యాలయంలో జరిగిన పార్టీ పట్టణ కమిటీ సమావేశంలో భారతి పాల్గొని ప్రసంగించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో సీపీఐ(ఎం) శ్రేణులు పార్టీ తరపున పోటీచేసిన అభ్యర్థి విజయం కోసం కృషిచేసిన నాయకులు, కార్యకర్తలకు ఈ సందర్భంగా భారతి ధన్యవాదాలు తెలిపారు. ఈ ఎన్నికల్లో డబ్బు, మద్యం ఏరులై పారి సంప్రదాయ ఓటింగ్‌కు భారీగా నష్టం జరిగిందన్నారు. ఈనెలాఖరులో జరిగే రాష్ట్ర ప్లీనరీలో పార్టీ ఉద్యమ కార్యాచరణ, విధి విధానాలను రాష్ట్ర నాయకత్వం ప్రకటిస్తుందని ఆమె అన్నారు. ఎన్నికల్లో ఓటింగ్ శాతం తగ్గిపోవడానికి గల కారణాలు, ప్రజల పక్షాన ఉద్యమ కార్యక్రమాలపై పున:సమీక్ష జరుపుకొని పార్టీ అభివృద్ధికి సీపీఐ(ఎం) శ్రేణులు పనిచేయాలని భారతి కోరారు. ఈ ఆర్నెల్లు కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలు కోరుతూ కార్యక్రమాలు ఉంటాయని భారతి తెలిపారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి భారతి సీపీఐ(ఎం) పక్షాన అభినందనలు తెలిపారు. పార్టీ పట్టణ కార్యదర్శి రావుల రాజబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి పాండురంగారావు, నాయకులు కొలికపోగు సర్వేశ్వరరావు, చావా రమేశ్, వలీ, ఐద్వా నాయకురాళ్లు పాకలపాటి ఝాన్సీ, చెరుకు కుమారి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండి రమేష్ అన్నారు. మండలంలోని వరంగల్ క్రాస్ రోడ్ వద్ద గల తమ్మినేని సుబ్బయ్య భవన్‌లో పార్టీ ఖమ్మంరూరల్ మండల కమిటీ సమావేశం ఏటుకూరి ప్రసాదరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో బండి రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను త్వరితగతిన అమలు చేయాలన్నారు. ఆరు గ్యారెంటీలను తప్పనిసరిగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలనే ఆలోచనను వెంటనే విరమించుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వామపక్షాల పోరాటాల ఫలితంగా 2004లోని యూపీఏ ప్రభుత్వం ఉపాధి హామీ పథకం తీసుకరావడం జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్ర చేయవద్దన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి నండ్ర ప్రసాద్, మండల ఇంచార్జ్ ఉరడీ సుదర్శన్ రెడ్డి, మండల కార్యదర్శి వర్గ సభ్యులు పొన్నెకంటి సంగయ్య, నందిగామ కృష్ణ, తోట పెద్ద వెంకటరెడ్డి, పెండ్యాల సుమతి, పి.మోహన్‌రావు, మండల కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, దుండిగల వెంకటేశ్వర్లు, ప్రతాపనేని వెంకటేశ్వర్లు, కారుమంచి గురవయ్య, ధనియకుల రామయ్య, యర్రా నరసింహారావు, భూక్య నాగేశ్వరరావు, భూక్య కృష్ణ, గాయత్రి, మంగ, తాటి వెంకటేశ్వర్లు, మేడికొండ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యాసంగి పంటలకు ఆరుతడిగా సాగునీరు అందించాలి

నేలకొండపల్లి: ప్రస్తుత వేసంగిలో రైతులు సాగు చేసే పంటలకు ఆరుతడులుగా సాగునీరు అందించాలని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సిపిఐ(ఎం) కార్యాలయం రావెళ్ల సత్యనారాయణ భవనంలో పార్టీ మండల కమిటీ సమావేశం రచ్చ నరసింహారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వాహనం కాలం సీజన్లో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రాజెక్టులలోకి సరిపడా నీరు లేక రైతులు బోర్లు బావుల కింద సాగరు ఆయకట్టు క్రింద కొంత భాగం అరకొరగా పంటలు సాగు చేశారన్నారు. రైతులు సాగుచేసిన పంటలు చేతికందేలా కనీసం ఆరు తడులుగానైనా సాగు నీరు అందించి పంటలను కాపాడాలని, పంటల పెట్టుబడులు పెరిగిన నేపథ్యంలో సరైన గిట్టుబాటు ధరలను అందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సాగునీరు సరఫరా చేయకపోతే రైతులు సాగు చేసిన పంటలు పండక తీవ్ర ఆహార కొరత ఏర్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తద్వారా నిత్యావసర ధరలు పెరిగి పేదలు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. ఆహార కొరతను నివారించేందుకుగాను వేసంగిలో ఆరుతడిగా సాగర్ జలాలను అందించాలన్నారు. కమ్యూనిస్టులకు ఓట్లు సీట్లు ముఖ్యం కాదని ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా రానున్న కాలంలో ప్రజలను సమీకరించి ఉద్యమించనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కె.వి.రామిరెడ్డి, నాయకులు ఏటుకూరి రామారావు, పగిడికత్తుల నాగేశ్వరరావు, దుగ్గి వెంకటేశ్వర్లు, కట్టెకోల వెంకన్న, బెల్లం లక్ష్మి, డేగల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



పారదర్శకతతో పథకాలు అమలు చేయాలి

హామీల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి

గిరిజనేతరులకు అటవీ హక్కులు కల్పించాలి : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-కారేపల్లి

రాష్ట్రంలో నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలను పారదర్శకతతో అమలు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. మంగళవారం కారేపల్లిలో మండల కమిటీ సమావేశం రేగళ్ల మంగయ్య అధ్యక్షతన జరిగింది ఈసందర్భంగా ఈసమావేశంలో భూక్యా వీరభద్రం మాట్లాడుతూ గత ప్రభుత్వం పథకాల అమలులో చేసిన తప్పిదాల మూలంగా తగిన మూల్యం చెల్లించుకుందన్నారు. పాత ప్రభుత్వం పథకాలను అర్హులకు కాకుండా పైరవీకారులు, డబ్బులిచ్చిన వారికి ఇవ్వటంతో ప్రజలలో వ్యతిరేకత వచ్చిందన్నారు. పథకాల అమలులో పారదర్శతకు గ్రామసభల ద్వారా లబ్ధిదారుల ఎంపిక జరగాలన్నారు. గత ప్రభుత్వం అందరికీ అటవీ హక్కులు కల్పిస్తామని పోడు సర్వే చేశారని, అమలులు గిరిజనేతరులకు సెంటు భూమి ఇవ్వలేదన్నారు. గిరిజనులకు సైతం సాగు చేసినంత పోడు భూమికి హక్కులు కల్పించబడలేదన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కే.నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికలలో ఆరు హామీలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. హామీలు విస్మరిస్తే పోరాటాల ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకవస్తామన్నారు. ప్రజాసమస్యల పరిష్కారంకు ప్రజా పోరాటాలే ప్రత్యామ్నాయమన్నారు. ఈ దిశగా సీపీఎం ప్రయనిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉసిరికాయలపల్లి సర్పంచ్ బానోత్ బన్సీలాల్, సీపీఎం మండల కార్యదర్శి కే.నరేంద్ర, నాయకులు వజ్జా రామారావు, దారావత్ సైదులు, ముండ్ల ఏకాంబరం, పాసిన్ని నాగేశ్వరరావు, కుర్సం శ్రీను, మాలోత్ రాంకోటి, వల్లభినేని మురళి తదితరులు పాల్గొన్నారు.



పేద మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

ఎస్సై చొరవతో ఎన్‌ఆర్ఐ సాయం

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి పోలీసుల చొరవతో ఎన్ఆర్ఐ దుర్గారాజ్‌కుమార్ కారేపల్లి మండలం పేరుపల్లిలోని పేద మహిళలకు మంగళవారం కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ అజ్మీర నాగేశ్వరరావు అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో ఆరుగురు పేద మహిళలకు కుట్టు మిషన్లను సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి, ఎస్సై పుష్పాల రామారావులు అందజేశారు. పేద మహిళలు ఆర్థికంగా వెసులుబాటు కల్పించే లక్ష్యంతో కారేపల్లి ఎస్సై పుష్పాల రామారావు పేరుపల్లిలోని ఆరుగురు మహిళలకు కుట్టు మిషన్లు అందజేయాలని సంకల్పించారు. దానిలో భాగంగా ప్రవాస భారతీయుడు దుర్గారాజ్ కుమార్ సంప్రదించగా దానికి అంగీకరించి ఆర్థికసాయం చేశారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్సైలు మాట్లాడుతూ దాతలు చేసిన సాయంతో మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలని ఆకాంక్షించారు. స్వచ్ఛంధ సంస్థల సహాయంతో మరికొందరు పేద మహిళలకు సాయం చేయనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, గ్రామపెద్దలు మల్లెల నాగేశ్వరరావు, పెద్దబోయిన సురేష్ తదితరులు పాల్గొన్నారు.



మంథన్ పరీక్షలో 'హార్వెస్ట్' విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ- ఖమ్మం

కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ వారి ఆధ్వర్యంలో ఎస్.సి.ఈ.ఆర్.టి వారు నిర్వహించే సైన్స్ ఆధారిత పరీక్షలో తమ విద్యార్థులు, ఉత్తమ ప్రతిభ చూపారని 'హార్వెస్ట్' గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపల్ ఆర్.పార్వతీరెడ్డి తెలిపారు. 2023-24 విద్యాసంవత్సరానికిగానూ, ఎస్.సి.ఈ.ఆర్.టి వారు 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదివే విద్యార్థినీ, విద్యార్థుల్లో భౌతిక, సామాన్య శాస్త్ర పరిజ్ఞానం వెలికితీసేందుకు సంబంధిత పరీక్ష ప్రతీయేటా నిర్వహించడం జరుగుతుందని వివరించారు. ఈ యేడాది అక్టోబర్ 3వ తేదీన నిర్వహించిన పరీక్షా ఫలితాలు ఇటీవల విడుదలవగా, రాష్ట్రస్థాయి క్యాంపుకు హార్వెస్ట్ పాఠశాల విద్యార్థులు 9మంది ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఈనెల 24వ తేదీన జరుగబోవు రాష్ట్రస్థాయి పరీక్షకు తెలంగాణా రాష్ట్రం నుండి ప్రతీ తరగతి నుండి 20మందిని ఎంపిక చేయగా తమ విద్యార్థులు 9 మంది ఎంపిక కావడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. తమ విద్యార్థినీ, విద్యార్థులు 6వ తరగతి నుండి శ్రేష్ఠ, జూహితా. చౌదరి, శ్రావణి, 7వ తరగతి నుండి ఈషాసింగ్, 8వ తరగతి నుండి జోష్ షద్రక్, రీత్యా, 10వ తరగతి నుండి సాయి సంథామిని, క్రిష్ణమనోజ్ఞ, క్రిష్ణ మాధుర్ ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థినీ, విద్యార్థులను అభినందించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని అభిలషించారు. కార్యక్రమంలో ఐఐటి బ్రాంచ్ ఇంచార్జ్ జి. ఉమా మహేశ్వర రావు, కె.నాగరాజు పాల్గొన్నారు.

పెద్దమండవ మున్నేరు వద్ద కందకం ఏర్పాటు

నవతెలంగాణ-ముదిగొండ

మండలపరిధిలో పెద్దమండవ మున్నేరులోకి ఇసుక ట్రాక్టర్లు పోకుండా మంగళవారం జెసిబీతో కందకం తవ్వించారు. మండలంలోని గంధసిరి, పెద్దమండవ మున్నేరు నుండి అక్రమ రవాణా చేస్తున్న 10 ట్రాక్టర్లను పట్టుకొని అధికారులు సీజ్ చేశారు. అక్రమ ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసినంత మాత్రాన ఇసుక అక్రమ రవాణా నడుస్తూనే ఉంటుంది. మండలంలో ప్రధానంగా ఇసుకను మూడు ట్రిప్పులు 33 ట్రాక్టర్లుగా అక్రమ రవాణాదారులు నిత్య కళ్యాణం పచ్చనితోరణంగా కొనసాగిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు పెద్దమండవ గ్రామాన్ని సందర్శించి జెసిబితో కందకాన్ని తవ్వించారు. గతంలో కూడా మున్నేరు వద్ద ఇలాంటి కందకాలు తవ్వించారు. అయినా ఇసుక అక్రమ రవాణా ఆగటం లేదు. అధికారులు నామమాత్రంగా దాడులు చేసి తూతుమంత్రంగా చేతులు దులుపుకుంటున్నారని ఆరోపణలున్నాయి. ఇసుక అక్రమ రవాణాదారులు ప్రధానంగా రాత్రి వేళలో భారీ సంఖ్యలో ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కేసులు నమోదు చేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని మైనింగ్, పోలీస్ శాఖ అధికారులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ శాఖ ఏజి సిద్ధం గంగాధర్, ఆర్ఐ రాజారెడ్డి, తాసిల్దార్ ఎర్రపాటి రామారావు, ఎస్సై జి.నరేష్ పాల్గొన్నారు.



రావూరి ఆటో కన్సల్టెన్సీని ప్రారంభించిన రాంరెడ్డి చరణ్‌రెడ్డి

నవతెలంగాణ- ఖమ్మం

నగరంలోని గట్టయ్య సెంటర్లో బోడేపూడి స్తూపం వద్ద రావూరి ఆటో కన్సల్టెన్సీని జిల్లా కాంగ్రెస్ నాయకులు రాంరెడ్డి చరణ్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చరణ్‌రెడ్డి మాట్లాడుతూ ఈ కన్సల్టెన్సీని జిల్లా ప్రజలందరూ ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కన్సల్టెన్సీ మేనేజింగ్ డైరెక్టర్ రావూరి శ్రీకాంత్, శెట్టి రంగారావు, సముద్రాల శ్రీను, జానకిరాములు, రమేష్, నాగరాజు, భూక్యా సురేష్‌నాయక్, చారి, శేషిరెడ్డి, భుజంగరావు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడి

నవతెలంగాణ-కల్లూరు

మండల పరిధిలోని హనుమ తండా గ్రామపంచాయతీలో హనుమతండా శివారు గన్యా తండా గ్రామాల్లో మంగళవారం సత్తుపల్లి ఎక్సైజ్ శాఖ ఎస్సై అల్లూరి సీతారామరాజు ఆధ్వర్యంలో గుడుంబా స్థావరాలపై దాడి చేసి బెల్లం పానకం సారాను ధ్వంసం చేశారు. గుడుంబా స్థావరాలు వద్ద దొరికిన వి.కృష్ణవేణి, బాబ్జి, శ్రీదేవి, బద్రులను తాహసిల్దార్ పులి సాంబశివుడు ఎదుట హాజరు పరిచి నలుగురుపై బైండోవర్ కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రీడల్లో సత్తాచాటిన ఏజీహెచ్ఎస్ మేకలతండా

నవతెలంగాణ-కారేపల్లి

గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీలలో కారేపల్లి మండలం మేకలతండా ఆశ్రమ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఈనెల 15,16 తేదిలలో కిన్నెరసాని ఆశ్రమ పాఠశాలలో జరిగిన అండర్-14 విభాగంలో డిస్కస్ త్రో, క్యారమ్ అంశాలలో మొదటి స్థానం, కబడ్డీ, టెన్నీకాయిట్, లాంగ్ జంప్, చెస్, 100 మీటర్లు, ద్వితీయ స్థానం, ఖోఖో, వాలీబాల్, రిలే పరుగు పోటీలలో తృతీయ స్థానాలు పొందినట్లు వడిత్యా నారాయణ తెలిపారు. అండర్-17 విభాగం లో టెన్నీకాయిట్‌లో ప్రథమ, ఖోఖో, చెస్ పోటీలలో తృతీయ స్థానాలు పొందినట్లు హెచ్ఎం తెలిపారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

నవతెలంగాణ -ఎర్రుపాలెం

మండల కేంద్రమైన ఎర్రుపాలెం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల హెచ్ఓ సరిత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందరి పట్ల ప్రేమ కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు, ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృత కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ ఉపేంద్ర, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసిన 'పాటిబండ్ల'

నవతెలంగాణ-మధిర

హైదరాబాదులోని ప్రగతి భవన్‌లో తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కని మంగళవారం మధిర నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాటిబండ్ల సత్యంబాబు, నిడమానూరు వంశీ మర్యాదపూర్వకంగా కలిశారు. వారి వెంట చిలుకూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ యూత్ నాయకులు తదితరులు ఉన్నారు.

పీట్ల గోపికి అభినందనలు

నవతెలంగాణ-మధిర

మధిరలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫస్ట్ ఇయర్ ఎంపీసీ విద్యార్థి పీట్ల గోపి పాల్వంచలో జరిగిన కబడ్డీ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరచి అండర్-17 రాష్ట్ర స్థాయి జట్టుకి ఎంపికవడమే కాకుండా ఖమ్మం జిల్లా కబడ్డీ జట్టుకి కెప్టెన్‌గా ఎంపికయిన సందర్భంగా అధ్యాపకులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ జై దాస్ మాట్లాడుతూ బాల్యం నుండే క్రీడల పట్ల ఉన్న మక్కువతో ప్రత్యేకంగా కబడ్డీ ఆటగాడిగా అల్ రౌండర్ గా రాణిస్తూ, పట్టుదల,శ్రమతో ఖమ్మం జిల్లా అండర్ -17 జట్టుకి ఎంపిక అయిన పీట్ల గోపి భవిష్యత్లో మరెన్నో అవార్డులు గెలిచి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

మహిళలకు టైలరింగ్ శిక్షణ ప్రారంభం

నవతెలంగాణ-సత్తుపల్లి

సింగరేణి సేవాసమితి ఆధ్వర్యంలో కిష్టారంలోని మదర్ థెరెసా కాలనీలో మంగళవారం ఆ సేవాసమితి అధ్యక్షురాలు ఎం మధురవాణి షాలెంరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మధురవాణి మాట్లాడుతూ సింగరేణి అందిస్తున్న సేవలను కొనియాడారు. ఈ ఉచిత టైలరింగ్ శిక్షణ ద్వారా ఆర్థిక స్వావలంబన సాగించి కుటుంబాలకు ఆర్థిక చేయూతను అందించాలన్నారు. కార్యక్రమంలో సేవాసమితి బాధ్యులు చాముండేశ్వరి నరసింహారావు, కిష్టారం గ్రామ సర్పంచ్ చెట్టుమాల రేణుకాఈశ్వర్, పద్మజారెడ్డి, సీనియర్ పీవో విజయ సందీప్, సమితి కో-ఆర్డినేటర్ సాగర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను విజయపథంలో నిలిపిన నాయకులకు సన్మానం

నవతెలంగాణ-కారేపల్లి

కాంగ్రెస్ పార్టీని విజయపథంలో నిల్పటానికి విశేష కృషి చేసిన ఆ పార్టీ మండల అధ్యక్షులను మంగళవారం డీసీసీ సన్మానించింది. కారేపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు తలారి చంద్రప్రకాశ్ మండలంలోని పార్టీ నాయకులను, కార్యకర్తలను సమన్వయం చేయటానికి చేసిన కృషిని ప్రశంసిస్తూ ఆయనను ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గా ప్రసాదరావు శాలవ కప్పి సన్మానించారు. మండలంలో పార్టీకి అత్యధిక మెజార్టీని తీసుకవచ్చేలా తలారి చంద్రపకాశ్ చేసిన కృషిని ఆయన కొనియాడారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు రాయల నాగేశ్వరరావు, జావేద్ తదితరులు పాల్గొన్నారు.

చర్చి నిర్మాణానికి నగదు సాయం

నవతెలంగాణ- తల్లాడ

మండల పరిధిలోని రామచంద్రపురం గ్రామంలో చర్చి నిర్మాణ పనులకు సుధా అనంతరామయ్య విజయలక్ష్మి దంపతులు 5వేల రూపాయల విరాళంను మంగళవారం పాస్టర్ వెంకన్నకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సుంకర నాగేశ్వరరావు, సత్తెనపల్లి నరేష్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నిమోనియా వ్యాధిపై అవగాహన

నవతెలంగాణ- తల్లాడ

తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రత్న మనోహర్ ఆధ్వర్యంలో నిమోనియా వ్యాధిపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్లు భాస్కర్, పెద్ద పుల్లయ్య మేరమ్మ, భద్రమ్మ, వసంతకుమారి, పల్లెదవ ఖానా వైద్యులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

20నుంచి గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-కారేపల్లి

సాంఘీక సంక్షేమ గురుకులాలలో 2024-25 విద్యాసంవత్సరంలో 5వ తరగతిలో ప్రవేశాలకు ఈనెల 20వ తేది నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరణ జరుగుతుందని కారేపల్లిలోని సాంఘీక సంక్షేమ గురుకుల ప్రిన్సిపాల్ డాక్టర్ కందాల లిల్లీ ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 6వ తేది వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవచ్చాన్నారు.దరఖాస్తు చేసుకున్న వారికి ప్రవేశ పరీక్ష నిర్వహించి ప్రవేశాలను కల్పించటం జరుగుతుందన్నారు.

అధ్యాపకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ- ఖమ్మం

2023-24 విద్యా సంవత్సరానికి నగరంలోని ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ స్వయం ప్రతిపత్తి కళాశాలలో హిస్టరీ (చరిత్ర) సబ్జెక్ట్ బోధించడానికి అతిథి అధ్యాపక నియామకం కోసం దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మొహమ్మద్ జాకిరుల్లా ఒక ప్రకటనలో తెలిపారు. హిస్టరీ (చరిత్ర) ఒకటి, నేచర్ ఆఫ్ అప్పాయింట్మెంట్: గెస్ట్ ఫాకల్టీ దరఖాస్తుల స్వీకరణ ఈనెల 20వ తేదీ నుండి దరఖాస్తుల స్వీకరిస్తారని, అదే రోజు సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని, ఇంటర్వ్యూ 21న కళాశాల ప్రాంగణంలో జరుగుతాయని తెలిపారు. ఇంటర్వ్యూలు ఉదయం 10:30 నుంచి జరుగుతాయన్నారు. అర్హతలు సంబంధిత పి.జి సబ్జెక్ట్ లో జనరల్ అభ్యర్థులు కనీసం 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు కనీసం 50 శాతం మార్కులు కలిగి ఉండాలని , సంబంధిత సబ్జెక్ట్ లో నీట్, ఎస్ఎల్ఈటి,సెట్, పీహెచ్డీ ప్రమాణ పత్రం కలిగిన వారికి ఎంపిక ప్రక్రియలో ప్రాధాన్యత ఇవ్వబడుతుందని, ఇంతకు పూర్వం డిగ్రీ కళాశాలలో బోధనానుభావం ఉన్నవారికి వెయిటేజీ ఇవ్వబడుతుందని, బోధనానుభావం, సర్వీస్ సర్టిఫికేట్ జత చేసిన అభ్యర్థికి మాత్రమే వెయిటేజీ మార్కులు కల్పబడతాయని, అర్హతలు , ఆశక్తి ఉన్న అభ్యర్థులు పాస్ పోర్ట్ సైజు ఫోటో అతికించిన బయో-డేటా కి సంబంధిత జిరాక్స్ కాపీలు జత చేసి కళాశాల కార్యాలయంలో ఈనెల 20 సాయంత్రం ఐదు గంటల లోపు అభ్యర్థి స్వయంగా వచ్చి దరఖాస్తు సమర్పించి తిరిగి రశీదు పొందాలని సూచించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు అమ్మపాలెం మైనారిటీ గురుకుల విద్యార్థులు ఎంపిక



నవతెలంగాణ-కొణిజర్ల

చదరంగం, బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు మండల పరిధిలోని అమ్మపాలెంలో ఉన్న గిరిజన గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.సైదులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల క్రీడలు అండర్ 14, 17 విభాగంలో 17వ తేదీన మంచిర్యాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు షేక్ మొహమ్మద్ (9వ తరగతి) జీ.నిషి రాజ్ (ఫస్ట్ ఎంపీసీ) ఎంపికైయ్యారు. అదే విధంగా 18న జరిగిన బాల్ బ్యాడ్మింటన్ జిల్లా స్థాయి పోటీలలో షేక్ అదిల్ సోహెబ్ (సెకండ్ ఎంపిసి) షేక్ అఫ్రోజ్(సెకండ్ ఎంపిసి) పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో ఈ నెల హైదరాబాద్ లో 23, 24 తేదీలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైయ్యారు. ఈ విద్యార్థుల ఎంపిక పట్ల పాఠశాల కళాశాల ఆర్ఎల్సి (ఖమ్మం) ఎంజె అరుణ కుమారి విజిలెన్స్ అధికారులు కే.సీతారాములు, జమీల్ పాషా, వ్యాయామ ఉపాధ్యాయుడు వి.హరీష్ పాల్గొన్నారు.

పాఠశాల విద్య పటిష్టపరచాలి

- నాణ్యమైన విద్య బోధించాలి
- ప్రధానోపాధ్యాయుల సమావేశంలో

జిల్లా విద్యా కోఆర్డినేటర్ ఎ.నాగరాజశేఖర్

నవతెలంగాణ-ఇల్లందు

బోధన నైపుణ్యాలను మెరుగుపరుస్తూ పాఠశాల విద్యా పటిష్ట పరచాలని జిల్లా విద్యా కోఆర్డినేటర్ ఎ.నాగరాజశేఖర్ అన్నారు. సుభాష్ నగర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రధానోపాధ్యాయుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా విద్యా కోఆర్డినేటర్ ఎ. నాగరాజశేఖర్ మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో తొలిమెట్టు ఉన్నతి కార్యక్రమాల అమలు జరగాలని ప్రతి ఉపాధ్యాయులు డైరీ తప్పక రాయాలని కోరారు. పాఠశాల గ్రంథాలయాన్ని వినియోగించాలన్నారు. ప్రతీ నెల పర్యవేక్షణ ఉంటుందని అన్నారు. పర్యవేక్షణ అంశాలను యాప్‌లో పొందుపర్చాలని అన్నారు. పాఠశాలలో ఉన్న ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం, నేర్పించాలని కోరారు. పదవ తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించాలని కోరారు. ప్రతీ నెల మండల జిల్లా స్థాయిలో సమీక్ష చేయబడుతుందని అన్నారు. ఈ సమావేశంలో యంఈఓ పి శ్రీనివాసరావు, నోడల్ ఆఫీసర్ టివిఆర్ యన్ స్వామి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాంబాబు, యాదమ్మ సుధాకర్, శర్మ, ఉమాశంకర్ రిసోర్స్ పర్సన్లు మండల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ కు సహకరించండి

నవతెలంగాణ-ఖమ్మం లీగల్

డిసెంబర్ 30న జిల్లా వ్యాప్తంగా జరగనున్న జాతీయ లోక్ అదాలత్ కు సహకరించాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ జావేద్ పాషా పిలుపునిచ్చారు. జాతీయ లోక్ అదాలత్ సన్నాహక సమావేశాల్లో భాగంగా న్యాయమూర్తి మంగళవారం పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన రాజీ పడదగిన క్రిమినల్ కేసులను లోక్ అదాలత్ లో పరిష్కరించే ప్రక్రియను వారితో చర్చించారు. ఏదేని క్రిమినల్ కేసులో ప్రధానమైన నేరము రాజీ పడదగినది అయినట్లయితే దానితో పాటు ఉన్న చిన్న నేరాలు రాజీ పడదగినవి కాకపోయినా హైకోర్టు తీర్పు ప్రకారం వాటిని కూడా లోక్ అదాలత్‌లో తీసివేయవచ్చన్న విషయాన్ని పునరుద్ఘాటించారు. లోక్ అదాలత్ లో కేసుల రాజీకి సంబంధించి ఉన్నతాధికారుల దగ్గర నుండి ఏవైనా అనుమతులు తీసుకోవాల్సి ఉన్నట్లయితే వాటిని వెంటనే చేపట్టాల్సిందిగా ఆయన సూచించారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులను పరిష్కరించి ఖమ్మం ను రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలపాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ కృష్ణమోహన్, ఇతర పబ్లిక్ ప్రాసిక్యూటర్లు నరసయ్య, అనిల్, గంగా మోహన్ తదితరులు పాల్గొన్నారు.



పర్యావరణంపై మక్కువ పెంచుకోవాలి

పద్మశ్రీ వనజీవి రామయ్య

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

అటవీశాఖ అధికారులు, ప్రజలు, ప్రతి ఒక్కరూ పర్యావరణంపై మక్కువ పెంచుకోవాలని, పర్యావరణాన్ని మనం కాపాడితే అది మనల్ని కాపాడుతుందని పద్మశ్రీ వనజీవి రామయ్య అన్నారు. దూలపల్లి అటవీ కళాశాలకు చెందిన 49 మంది శిక్షణ బీట్ అధికారులు మండల పరిధిలో రెడ్డిపల్లిలోని వనజీవి రామయ్య ఇంటిని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వనజీవి రామయ్య మాట్లాడారు. తాను పర్యావరణానికి చేసిన కృషిని వివరించారు. అటవీశాఖ అధికారులు పర్యావరణానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. సమాజంలో ప్రతి ప్రాణికి జీవించే అవకాశం కల్పించాలని, పర్యావరణంలో మొక్కలతో పాటుగా అటవీ జంతులను కూడా సంరక్షించాలన్నారు. అనంతరం శిక్షణ అధికారులు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఫారెస్ట్ అకాడమీ కోర్సు డైరెక్టర్ ఉమ, ఎస్ఆర్ శ్రీనివాసరావు, డిప్యూటీ రేంజ్ అధికారి సురేశ్ కుమార్, బీట్ అధికారులు హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



5 నుంచి ఏపీలో ప్రపంచ తెలుగు మహాసభలు

నవతెలంగాణ - ఖమ్మం కార్పొరేషన్

ప్రపంచ తెలుగు మహాసభలు ఆంధ్రప్రదేశ్ లోని రాజమహేంద్ర వరంలో ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యా సంస్థల ఆధ్వర్యంలో 2024 జనవరి 5,6,7 తేదీలలో నిర్వహించే ప్రపంచ మహాసభలను విజయవంతం చేయాల్సిందిగా కోరారు. వివిధ కార్యక్రమాలలో సాహితీ వేత్తలు, రాజకీయ ప్రముఖులు, మేధావులు, విద్యార్థులు అనేక సాంస్కృతిక కార్యక్రమాలు, సదస్సులు జరుతాయని తెలంగాణ ప్రచార కార్యదర్శి లెనిన్ శ్రీనివాస్ తెలిపారు. సభల సందర్భంగా గోడ పత్రికలను ఖమ్మం జిల్లా పరిశ్రమల శాఖ జిల్లా మేనజర్ కే.అజయ్ కుమార్ చేతులమీదుగా ఖమ్మం జిల్లా కలెక్టర్ ప్రాంగణంలోని కార్యాలయంలో ఈరోజు 19.12.2023 న ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మలిశెట్టి కృష్ణ మూర్తి, రెంటాల, చిన్న హుస్సేన్, తిరునగరి శ్రీనివాస్, గుమ్మడి పుల్లయ్య, రేళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రిక్షా కార్మికుని కుటుంబానికి రూ.50వేల ఆర్థికసాయం

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని బైపాస్ రోడ్డు వద్ద గల కూరగాయల మార్కెట్లో రిక్షా కార్మికుడిగా పనిచేస్తున్న ఎం.ఉపేందర్ కరుణగిరి దగ్గర లారీ రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతి చెందాడు. ఆయన కుటుంబ సభ్యులైన భార్య వసంత, కుమారులు సంతోష్, రాజేష్‌లకు ఏఎంసీ రిటైల్ మార్కెట్ యూనియన్ ప్రెసిడెంట్ ఎండి ఫజల్ ఆధ్వర్యంలో రూ.50 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఫజల్ 10 వేలు, యూనియన్ తరపున 24వేలు రూపాయలు, రిక్షా కార్మికులు 16 వేల రూపాయలు అందజేశారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, జి.వి.ఆర్,బోయినపల్లి కొండలరావు, శెట్టి నాగేశ్వరరావు, ముంతా వెంకటేశ్వరరావు, నాగ, జానీమియా, ఆనందరావు, కేతనబోయిన నాగేశ్వరరావు, వై.వీరభద్రం, సిహెచ్ నాగమణి, రాంరెడ్డి, శేఖర్, కే.సురేష్, రిక్షా కార్మికుల కమిటీ యూనియన్ నాయకులు బీరప్ప, స్వామి, ప్రభాకర్, భాష, నరసింహ, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలు

నవతెలంగాణ-ఖమ్మం లీగల్

ఖమ్మం పట్టణం ద్వారకా నగర్‌కు చెందిన పేరసాని వెంకటేశ్వర్లుకు చెల్లని చెక్కు కేసులో ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు ఫిర్యాదికి రూ.15 లక్షల నష్టపరిహారం కిందను చెల్లించాలని ఖమ్మం ప్రత్యేక సంచార కోర్టు ఇన్ చార్జ్ న్యాయధికారి రాళ్ళబండి శాంతిలత మంగళవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఫిర్యాది వద్ద నిందితుడు తన కుటుంబ అవసరాల కోసం ది.16-10-2013 నాడు రూ.12లక్షలను అప్పుగా తీసుకుని అదే రోజు నిందితుడు ఫిర్యాదికి ప్రాంసరి నోటు రాసి ఇచ్చినాడు. ఫిర్యాది నిందితుడిని తన రుణం తిరిగి చెల్లించమని ఒత్తిడి చేయగా నిందితుడు ది.27-10-2015న రూ.15 లక్షలకు ఫిర్యాదికి చెక్కును జారీ చేసినాడు. అట్టి చెక్కును ఫిర్యాది తన బ్యాంకు ఖాతాలో జమ చేయగా, నిందితుని ఖాతాలో సరిపడ నగదు లేకపోవడంతో చెక్కు నిరాధారణకు గురి అయినది. పిర్యాది తన న్యాయవాది అయిన చింతనిప్పు వెంకట్ ద్వారా లీగల్ నోటీసు జారీ చేసి కోర్టులో ప్రైవేటు కేసు దాఖలు చేసినారు. ఈ కేసును విచారించిన న్యాయధికారిపై విధంగా తీర్పు చెప్పారు. మరొక కేసులో ఖమ్మం పట్టణం ముస్తాఫా నగర్‌కి చెందిన రేపాల సీతారామయ్యకు ప్రత్యేక సంచారా కోర్టు ఇన్ చార్జ్ న్యాయాధికారి రాళ్ళబండ శాంతి లత నిందితుడికి 1 సంవత్సరం జైలు శిక్ష తో పాటు ఫిర్యాదికి రూ.4 లక్షల చెల్లించాలని మంగళవారం తీర్పు చెప్పారు.

ఆరు గ్యారెంటీలను సాకులు లేకుండా అమలు చేయాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరావు



నవతెలంగాణ-వైరాటౌన్

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలలో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తానని హామీలు ఇచ్చి ప్రజల చేత ఓట్లు వేయించుకుని అధికారం వచ్చిన తర్వాత మొదటి సంతకం ఆరు గ్యారెంటీలు మీదనే పెడతానని చెప్పిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పుడు రెండు గ్యారంటీల మీద సంతకం పెట్టారని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక బోడేపూడి వెంకటేశ్వరరావు భవనంలో సీపీఐ(ఎం) పట్టణ కమిటీ సమావేశం చింతనిప్పు చలపతిరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలలో మహాలక్ష్మి, చేయూత పథకాలు అమలు చేస్తున్నామని సంతకం పెట్టారు కానీ, మహాలక్ష్మి పథకంలో మహిళలకు ఫ్రీ బస్సు, వంట గ్యాస్ 500కు, ప్రతి మహిళలకు 2500 అకౌంట్ లో వేస్తానని చెప్పి కేవలం ఫ్రీ బస్సును, చేయూత పథకంలోని 4000 పెన్షన్, 10 లక్షల ఆరోగ్య శ్రీ లో కేవలం ఆరోగ్య శ్రీని అమలు చేస్తూ ఆరింటిలో రెండు పథకాలు అమలు చేశామని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పడం సరైంది కాదని అన్నారు. మిగతా వాటిని కూడా వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో తుఫాన్ వలన రాష్ట్రంలో పంట నష్టపోయిన ఖమ్మం, వరంగల్ జిల్లాల్లోని రైతులకు పంట నష్టపరిహారం వెంటనే అందజేయాలని అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బుగ్గవీటి సరళ, బొంతు రాంబాబు, భుక్యా వీరభద్రం, పట్టణ కార్యదర్శి సుంకర సుధాకర్, బోడపట్ల రవీందర్, మచ్చా మణి, బొంతు సమత, మల్లెంపాటి రామారావు, హరి వెంకటేశ్వరరావు, గుడిమెట్ల రజిత, అనుమోలు రామారావు, గుడిమెట్ల మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని బాధితులకు డబ్బులు చెల్లించాలి

- అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎన్.బాలమల్లేష్
- ప్రజావాణిలో 300 వందల మంది బాధితులతో కలిసి వినతి



నవతెలంగాణ-వైరాటౌన్

తెలంగాణ రాష్ట్రంలోని అగ్రిగోల్డ్ సంస్థల ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని అగ్రిగోల్డ్ బాధితులకు డబ్బులు చెల్లించి, వారిని ఆదుకోవాలని అగ్రిగోల్డ్ బాధితుల సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.బాలమల్లేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ అగ్రిగోల్డ్ బాధితుల సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ ప్రజాభవన్‌లోని ప్రజావాణిలో సుమారు 300 వందల మంది బాధితులను తీసుకొని అధికారులను కలిసి అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను పరిష్కరించాలని అర్జీని ఇచ్చారు. ఈ సందర్భంగా ఎన్.బాలమల్లేష్ మాట్లాడుతూ అగ్రిగోల్డ్ కంపెనీ 1996లో ప్రారంభించబడిందని, అగ్రిగోల్డ్ కంపెనీలో డిపాజిట్లు చేస్తే ఎక్కువ లాభాలు వుంటాయని నమ్మించి, డిపాజిట్లు పేరుతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలలో దాదాపు 5 వేల కోట్ల రూపాయలు వసూళ చేసి కంపెనీలను ప్రారంభించారని, ఆ డబ్బులతో స్థలాలు, రిసార్ట్స్ నిర్మించారని తెలిపారు. 2015లో డిపాజిట్ దారులకు డబ్బులు తిరిగి ఇవ్వాల్సి వచ్చినప్పుడు అగ్రిగోల్డ్ కంపెనీ యాజమాన్యం చేతులు ఎత్తివేసిందని విమర్శించారు. బాధితులు ఆందోళన చేయడంతో మేనేజిమెంట్‌ను అరెస్టు చేసి గత ప్రభుత్వాలు చేతులు దులుపుకున్నదని, తమ కష్టార్జితం నష్టపోయామని, మోసపోయామని కొంత డిపాజిట్‌దారులు ఆత్మహత్యలు చేసుకున్నారని బాలమల్లేష్ ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో అగ్రిగోల్డ్ కంపెనీలో డిపాజిట్ చేసిన నగదు ఐదు వందల కోట్ల రూపాయల వరకు ఉంటాయని, తెలంగాణ రాష్ట్రంలో అగ్రిగోల్డ్ ఆస్తుల విలువ వెయ్యి కోట్లకు పైగా ఉంటాయని వారన్నారు. అగ్రిగోల్డ్ కంపెనీ మూతపడి ఎనిమిది సంవత్సరాలు గడిచిందని, తెలంగాణలో అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు పరిష్కారం కాకపోవడంతో అనేక మంది ఆత్మహత్యలకు గురైనారని అన్నారు. ఇటీవల కాలంలో అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు పరిష్కరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి మెమోరాండం ఇవ్వడంతో మా ప్రభుత్వం నెల రోజులలో వస్తుందని, అగ్రిగోల్డ్ ఆస్తులన్నింటిని వేలం వేసి బాధితులకు డబ్బులు చెల్లిస్తామని అన్నారని, అగ్రిగోల్డ్ యాజమాన్యం రియల్ ఎస్టేట్ వెంచర్లలో ప్లాట్ కొనుగోలు చేసినవారికి రిజిస్ట్రేషన్ చేసి ప్లాట్లు అందించాలని రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశామని అన్నారు. ఈ అన్ని విషయాలపై సమగ్ర విచారణ జరిపి అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గోగుల వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గుడిమెట్ల రజిత, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నల్లబోలు సునీత, కట్లా సతీష్, లక్ష్మీనారాయణ, శివకోటి విశ్వా, సుజాత పాల్గొన్నారు.

ఎన్నికలలో గెలిచినా, ఓడినా ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు ఆగవు

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు భాస్కర్
- మధిర నియోజకవర్గ ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపిన భాస్కర్

నవతెలంగాణ - బోనకల్

ఎన్నికలలో గెలిచినా ఓడినా ప్రజా సమస్యల పరిష్కారం కోసమే సిపిఎం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిపిఎం మధిర నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేసిన పాలడుగు భాస్కర్ స్పష్టం చేశారు. మండల పరిధిలోని సిపిఎం ముష్టికుంట కార్యాలయంలో పార్టీ ముష్టికుంట్ల శాఖల సమావేశం సోమవారం రాత్రి జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికలలో మధిర నియోజకవర్గం నుంచి సిపిఎం అభ్యర్థిగా తాను పోటీ చేశానని, ఈ ఎన్నికలలో తనకు ఓట్లు వేసిన ఓటర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సిపిఎం నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసమే పోరాటాలు చేస్తుంది తప్ప ఓడిపోయినంత మాత్రాన కుంగిపోదన్నారు. ప్రజా ప్రతినిధుల పదవులను శాసనసభలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం అదనంగా ఉపయోగిస్తుందన్నారు. ప్రజా సమస్యలను లేవనెత్తి వాటి పరిష్కారం కోసం శాసనసభలో పోరాటం చేయడానికి ప్రజా ప్రతినిధుల పదవులు అవసరం అన్నారు. ప్రజా ప్రతినిధుల పదవులను శాసనసభ తో పాటు బయట కూడా పోరాటం చేయడానికి అది తోడ్పాటునందిస్తుందన్నారు. ప్రజా ప్రతినిధి అనే హెూదాను ప్రజా సమస్యల కోసమే సిపిఎం వినియోగిస్తుంది తప్ప అలంకారప్రాయం కోసం కాదన్నారు. ఎన్నికలలో ఓడటం, గెలవడం అనేది సహజమని, ఓడిపోతే కుంగిపోవడం గెలిస్తే సంతోషపడటం అనేది సిపిఎం నైజం కాదన్నారు. మధిర నియోజకవర్గ అభ్యర్థిగా విజయం సాధించిన మల్లు భట్టి విక్రమార్క రాష్ట్రస్థాయిలో ఉపముఖ్యమంత్రి పదవి లో ఉన్నారని నియోజకవర్గంలో పాటు రాష్ట్ర అభివృద్ధికి ఆ పదవిని వినియోగించాలని సూచించారు. మధిర నియోజకవర్గ ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాటిపై మల్లు భట్టి విక్రమార్క దృష్టి పెట్టాలని సూచించారు. ప్రధానంగా బోనకల్ నుంచి ఖమ్మం వరకు రోడ్డు అత్యంత ప్రమాదకరంగా, ఆందోళనకరంగా ఉందని వెంటనే ఆ రోడ్డుకు మరమ్మతులకు నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలని కోరారు. ముదిగొండ మండలంలో గ్రానైట్ కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, దృష్టి సారించాలని కోరారు. అదేవిధంగా నియోజకవర్గంలోని ఐదు మండలాలలో ప్రజలు వివిధ రకాల సమస్యలు ఎదుర్కొంటున్నారని వాటి పరిష్కారం చేయాలన్న ఆయన సూచించారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతలచెరువు కోటేశ్వరావు, మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బంధం శ్రీనివాసరావు, గ్రామ కమిటీ కార్యదర్శి దొప్ప కొరివి వీరభద్రం, కందికొండ శ్రీనివాస రావు, గుగులోతు పంతు, పిల్లల మరి వెంకట అప్పారావు శాఖా కార్యదర్శులు బొడ్డుపల్లి కోటేశ్వరరావు, షేక్ నజీర్, పిల్లలమర్రి సాంబశివరావు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

- ఎమ్మెల్యే రాగమయి దయానంద్‌కు యూటీఎఫ్ విజ్ఞప్తి



నవతెలంగాణ-సత్తుపల్లి

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని టీఎస్‌యూటీఎఫ్ ఖమ్మం జిల్లా కమిటీ పక్షాన ఆ సంఘ జిల్లా నాయకులు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్‌కు విజ్ఞప్తి చేశారు. మంగళవారం జిల్లా కమిటీ బాధ్యులు సత్తుపల్లిలో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో నాయకులు మాట్లాడారు. సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పింఛన్ విధానం కొనసాగేలా కృషి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యా యులకు సంబంధించి మూడు కరువు భత్యాలను మంజూరు చేయించాలన్నారు. పీఆర్సీ కమిషన్‌ను నియమిస్తూ నివేదిక తెప్పించుకొని అమలు చేయాలన్నారు. స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రి మెంట్లు మంజూరు చేయాలన్నారు. వీటితో పాటు విద్యారంగానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని యూటీఎఫ్ నాయకులు ఎమ్మెల్యే రాగమయి దయానంద్‌ను కోరుతూ వినతిపత్రం అందించారు. ఈ సమావేశంలో సంఘ జిల్లా కార్యదర్శులు జీఎస్ఆర్ రమేశ్, వీవీ రామారావు, కే నిర్మలకుమారి, ఆర్ రమేశ్, సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి, కల్లూరు, దమ్మపేట మండలాల బాధ్యులు బాల నాగేశ్వరరావు, కే శ్రీనివాసరావు, చంద్రశేఖర్, ఈశ్వరాచారి, వీరాస్వామి, ఆర్ ప్రసాద్, సీనియర్ నాయకులు బాలయ్య, ఉమామహేశ్వరరెడ్డి, తిరుపతిరావు పాల్గొన్నారు. ఎమ్మెల్యే విజయం సాధించిన నేపథ్యంలో శుభాకాంక్షలు తెలుపుతూ రాగమయి దయానంద్‌ను సన్మానించారు.

బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించిన ఎంఎల్‌ఏ

సత్తుపల్లిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్న తీరును విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినుల హాజరు పట్టికలను పరిశీలించారు. హాజరు శాతంపై ప్రధానోపాధ్యాయుడిని అడిగారు. అనంతరం విద్యార్థినులతో ఎమ్మెల్యే రాగమయి మాట్లాడుతూ తాను చదివిన చిన్ననాటి తన పాఠశాల జ్ఞాపకాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. విద్యార్థినులు చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులు, పాఠశాలను పేరు తీసుకురావాలన్నారు. అనంతరం ఉపాధ్యాయినులు ఎమ్మెల్యే రాగమయి దయానంద్‌ను సన్మానించారు.

ఉపాధ్యాయుడు వెంకటేశ్‌ను అభినందించిన ఎమ్మెల్యే

సత్తుపల్లి పురపాలక పరిధిలోని గాంధీనగర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కంభంపాటి వెంకటేశ్‌ను సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో సన్మానించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గత 3 నెలల పాటు వెంకటేశ్ ఓటుహక్కు ప్రాముఖ్యత, వినియోగం తదితరాంశాలను వివరిస్తూ అవగాహన చైతన్యయాత్రను నిర్వహిస్తూ జిల్లా వ్యాప్తంగా గ్రామగ్రామాన ప్రచారం చేశారు. ఓటుహక్కుపై వెంకటేశ్ ఓటర్లను చైతన్య పర్చేందుకు తీసుకున్న కార్యక్రమాన్ని ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయి దయానంద్ అభినందించారు.

పంటనష్టం గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండి

కల్లూరు: ఇటీవల వచ్చిన తుఫాన్ కారణంగా పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇప్పించేందుకు అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి న్యాయం చేయాలని సత్తుపల్లి శాసనసభ్యులు డాక్టర్ రాగమయ దయానంద్ కు రైతులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. సత్తుపల్లి శాసనసభ్యురాలుగా గెలుపొందిన డాక్టర్ రాగమయను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. బుధవారం నుండి జరిగే అసెంబ్లీ కార్యక్రమాల్లో రైతుల బాధలను అసెంబ్లీ దృష్టికి తీసుకుపోయి పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు పెద్ద బోయిన దుర్గాప్రసాద్, ఉబ్బన గోపాల స్వామి, మేము దినాకర్, తదితరులు తెలిపారు.

మిషన్ భగీరథ నీళ్లు బంద్

తల్లంపాడు ప్రజల ఇక్కట్లు

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ మంచినీరు గత పది రోజులుగా మండలంలోని తల్లంపాడు గ్రామానికి రాకపోవడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత పది రోజులుగా గ్రామంలో నీరు లేక సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. గతంలో మాదిరిగా గ్రామాల్లో బావులు, చేతి పంపులు లేకపోవడంతో మిషన్ భగీరథ నీటికే అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో పది రోజుల నుంచి నీళ్లు రాక మహిళలు, రైతులు, విద్యార్థులు ఎక్కడి పనులు అక్కడ ఆగిపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

నీటి సమస్య పరిష్కరించండి

: రెంటాలా కమలాకర్, గ్రామస్తుడు



తల్లంపాడు గ్రామంలోని మంచినీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని మిషన్ భగీరథ అధికారులకు విజ్ఞప్తి. సమస్యను పరిష్కరించని పక్షంలో మంచినీటి బిందెలతో ఖమ్మం-సూర్యాపేట ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహిస్తాం.

'సేంద్రీయ ' ప్రోత్సాహకాలు ఎలా..?

ఏదైనా కొత్త విధానం రూపొందించారా ?

లోక్ సభలో ఎంపీ నామ నాగేశ్వరరావు

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



దేశంలో సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులకు క్రమంగా డిమాండ్ పెరుగుతుంది.. ఈ విషయంలో కేంద్రంది.. రాష్ట్రాల వారీగా వివరాలు తెలపాలని బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నేత, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. లోక్ సభలో మంగళవారం ఎంపీ నామ ఈ విషయమై లికితపూర్వకంగా కేంద్రానికి ప్రశ్నలు సంధించారు. సేంద్రియ వ్యవసాయం వివరాలను రాష్ట్రం, యూటీల వారీగా ఇవ్వాలని కేంద్రాన్ని కోరారు. గత మూడు సంవత్సరాలలో మంజూరు చేసిన, వినియోగించిన నిధుల వివరాలు వెల్లడించాలని అడిగారు. దేశంలో సహజ వ్యవసాయం అభివృద్ధికి తీసుకున్న చర్యలు, ప్రోత్సాహకాలను వివరించాలని కోరారు. మార్కెటింగ్ సౌకర్యం ఎలా ఉందని ప్రశ్నించారు. సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వం ఏదైనా కొత్త విధానాన్ని రూపొందించిందా? అని నిలదీశారు. అదే నిజమైతే ఈ విధానాన్ని అమలు చేయడానికి ప్రతిపాదించిన కాల వ్యవధి, రైతులకు ఏ విధంగా ప్రయోజనకరంగా ఉంటుందో తెలిపాలి అన్నారు. రాష్ట్రాల వారీగా సమాచారం అడిగినా ఇవ్వకపోవడం పట్ల నామ అసంతృప్తి వ్యక్తం చేశారు.

కేంద్రమంత్రి సమాధానం...

ఈ విషయమై కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ మంత్రి అర్జున్ ముండా సమాధానం ఇస్తూ సేంద్రియ వ్యవసాయం, ఉత్పత్తుల్లో భారత దేశం గణనీయమైన సామర్థ్యాన్ని కలిగి ఉన్నదని చెప్పారు. గ్లోబల్ మార్కెట్ లో సేంద్రియ వ్యవసాయానికి పెరుగుతున్న డిమాండ్ దృష్ట్యా అంతర్జాతీయ మార్కెట్ కు అనుగుణంగా 2001లో థర్డ్ పార్టీ సర్టిఫికేషన్ నేషనల్ ప్రోగ్రాం ఫర్ ఆర్గానిక్ ప్రొడక్షన్ (ఎన్పీఓపి) పథకాన్ని ప్రారంభించామని తెలిపారు. పరంపరగత్ కృషి వికాస్ యోజన (పికెవివై) , మిషన్ ఆర్గానిక్ వాల్యూ చైన్ డెవలప్‌మెంట్ ఫర్ నార్త్ ఈస్టర్న్ రీజియన్ పథకాల ద్వారా ప్రభుత్వం 2015-16 నుండి దేశంలో సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. దేశవ్యాప్తంగా ఈశాన్య (ఎన్ఈ) రాష్ట్రాలు కాకుండా ఇతర అన్ని రాష్ట్రాల్లో పికెవిపి పథకాన్ని అమలు చేయబడుతోందన్నారు. అయితే మిషన్ ఆర్గానిక్ వాల్యూ చైన్ డెవలప్‌మెంట్ ఫర్ నార్త్ ఈస్టర్న్ రీజియన్ పథకాన్ని నార్త్ ఈస్టర్న్ రాష్ట్రాల్లో ప్రత్యేకంగా అమలు చేయబడుతోందని పేర్కొన్నారు. ఈ రెండు పథకాలు సేంద్రీయ వ్యవసాయంలో నిమగ్నమైన రైతులకు ఎండ్-టు-ఎండ్ మద్దతుగా నిలిచాయన్నారు. ఉత్పత్తి నుండి ప్రాసెసింగ్, ధృవీకరణ, మార్కెటింగ్, పంట అనంతర నిర్వహణ వరకు రైతును ప్రోత్సహించినట్లు చెప్పారు. శిక్షణ సామర్థ్య పెంపు పథకంలో అంతర్భాగం అన్నారు. సేంద్రియ ఎరువులు, ఎరువులను ఉత్పత్తి చేయడానికి, వాడడానికి రైతులకు ఇన్సెంటీవ్‌లు ఇందులో అంతర్నిర్మితంగా ఉంటాయని చెప్పారు. పీకేవివై పథకం ఉప పథకమైన భారతీయ ప్రకృతిక్ క్రిస్ పద్ధతి పథకం (బీపీకేపీ) కింద 2019 -2020 నుంచి సహజ వ్యవసాయం కోసం విస్తృత ప్రచారం చేయడం జరుగుతుందని వివిధ పథకాల గురించి కేంద్ర మంత్రి అర్జున్ ముండా తెలిపారు.

బకాయిలు తక్షణమే చెల్లించాలి

ఖమ్మం జిల్లా ఫోటో, వీడియో గ్రాఫర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు

నవతెలంగాణ- ఖమ్మం

అసెంబ్లీ ఎన్నిలలో రాత్రనక పగలనక కష్టపడి వీడియో గ్రఫీ చేసిన వీడియో గ్రాఫ్రార్స్ అందరికీ తక్షణమే బకాయిలు చెల్లించాలని ఖమ్మం జిల్లా ఫోటో , వీడియో గ్రాఫర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వేములూరి నాగరాజు దేవర డిమాండ్ చేశారు. మంగళవారం ఖమ్మం నూతన కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు జరిగి ఇరవై రోజులు గడుస్తున్నా ఇంతవరకు అధికారులు ఎలక్షన్ ఆఫీస్ చుట్టూ తిప్పు కుంటున్నారని, జాయింట్ కలక్టర్, ఎన్నికల అధికారుల సమక్షంలో కలెక్టర్ ఇచ్చిన హామీ మేరకు 8 గంటల షిఫ్ట్‌కు 1500 చొప్పున వెంటనే చెల్లించాలని తెలిపారు. లేనిచో కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని 5 నియోజకవర్గాలలో నియోజకవర్గల ఎన్నికల ఇంచార్జులు కమటం రఘు, వీరన్నగౌడ్ ,బాలాజీ నాయక్, రామారావు, స్వామీ, రాము, కనకా చారి, శ్రీకాంత్, యాసిన్, జగదీశ్, రామ్మూర్తి 21 మండలాల వీడియో గ్రాఫర్ లు పాల్గొన్నారు.


www.praja.khammam@gmail.com
అనుదినం...జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం 20, డిసెంబర్ 2023

తుఫాన్ వల్ల నష్టపోయిన పొగాకు రైతులను ఆదుకోవాలి

- రైతుం సంఘం ఆధ్వర్యంలో వినతి

నవతెలంగాణ-దమ్మపేట



ఇటీవల వచ్చిన మిచౌంగ్ తుఫాన్ కారణంగా తెలంగాణ ప్రాంతంలో పండిస్తున్న వర్జీనియా పొగాకు రైతులు భారీ నష్టం వాటిల్లిందని, వారిని ఆదుకోవాలని రైతుం సంఘం ఆధ్వర్యంలో మంగళవారం యూనియన్ బ్యాంక్ డీజీఎంకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సుమారుగా 2000 ఎకరాలలో పంట సాగు చేయగా అందులో 1000 నుంచి 1500 ఎకరాలకు భారీ నుంచి అతిభారీగా నష్టం జరిగిందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. లైసెన్స్ కలిగిన ప్రతి రైతుకు అదనంగా రూ.200000 రుణ సౌకర్యం కల్పించి రైతులని ఆదుకోవాలని విన్నవించారు. ఈ విధానం ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ బ్యాంకులు ఇస్తున్నారని, అదే విధంగా తెలంగాణ బ్యాంకర్స్ కూడా చేయాలని రైతు నాయకులు విన్నవించారు. ఈ కార్యక్రమంలో పొగాకు బోర్డు కార్యదర్శి వీవీఎస్ ప్రకాష్, డైరక్టర్ కుకలకుంట కిషోర్, సీనియర్ రైతు నాయకులు సుంకవల్లి వీరభద్రమ్, వీరితో పాటు రైతులు అల్లూరి రామారావు, మాధవరావు, సురేష్‌లు పాల్గొన్నారు.

సమర్ధవంతంగా విధులు నిర్వర్తించాలి

నవతెలంగాణ-చంద్రుగొండ



ఎన్నికల విధులను సమర్ధవంతంగా బూత్ లెవల్ అధికారులు నిర్వర్తించాలని మాస్టర్ ట్రైనీ వినయ్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ మండలాలకు చెందిన బూత్లవల్ అధికారుల శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని, అవగాహన కల్పించారు. రాబోయే పంచాయతీ, పార్లమెంటు ఎన్నికల్లో విధులు సమర్ధవంతంగా నిర్వర్తించాలన్నారు. ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా చూసుకోవాలని, కొత్తగా ఓటర్ల నమోదును సైతం పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు చేయటంలో సైతం తగిన జాగ్రత్తలు, నియమనిబంధనలు పాటించాలన్నారు. 18 ఏండ్లు నిండిన వారందరికి ఓటు హక్కు వచ్చేలా, ధరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సాజియాసుల్తానా, డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్న, రెండు మండలాల బూత్లవల్ అధికారులు పాల్గొన్నారు.

పర్ణశాలలో ముక్కోటి పనులు పరిశీలన

నవతెలంగాణ-దుమ్ముగూడెం

భద్రాచల రామాలయానికి అనుబంధ ఆలయమైన పర్ణశాల రామాలయంలో జరుగుతున్న ముక్కోటి వైకుంఠ ఏకాదశి ఉత్సవాలలో భాగంగా ఈనెల 22వ తేదీన నిర్వహించే తెప్పోత్సవం పనులను నీటిపారుదల శాఖ ఎస్‌ఈ వెంకటేశ్వర రెడ్డి మంగళవారం పరిశీలించారు.

గోదావరి ప్రాంతంలో సీతమ్మ సాగర్ కరకట్ట పనుల వలన తెప్పోత్సవం నిర్వహించే గోదావరి ప్రదేశం ప్రమాదకరంగా ఉంద న్నారు. తెప్పోత్సవం నిర్వహించే ప్రాంతంలో భారీ కేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. గోదావరి ప్రదేశంలోకి ఇతరులను ఎవ్వరినీ అనుమతించవద్దని సూచించారు. ఆయన వెంట డీఈ మసూదనరావు, ఈఈ రాంప్రసాద్, ఏఈఈ రాజ్ సుహాస్ ఉన్నారు.

చిల్లర దుకాణంలో అగ్నిప్రమాదం

- అనుమానాస్పదంగా ఘటన

నవతెలంగాణ-అశ్వారావుపేట

ఓ చిల్లర దుకాణంలో సంభవించిన అగ్నిప్రమాదం అనుమానాస్పదంగా అనిపిస్తుంది. సోమవారం రాత్రి 11 గంటల సమయంలో మండలంలోని పేరాయిగూడెం పంచాయతీ అల్లి గూడెం రోడ్‌లో తగరం రాజేష్ అనే వ్యక్తి చిల్లర దుకాణంలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. బాధితుడు రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం రోజువారి మాదిరిగానే దుకాణం 10 గంటలకు మూసివేసారు. 11 గంటలకు స్థానికి పరిశ్రమలో విధులు ముగించుకుని వస్తున్న స్థానికులు ఈ అగ్ని ప్రమాదాన్ని గుర్తించి రాజేష్‌ను కేకలు వేసి నిద్ర లేపారు. మేలుకున్న రాజేష్ మంటలు అదుపు చేసారు. అయితే సంఘటనకు చెందిన ఆనవాళ్ళను బట్టి గుర్తుతెలియని వ్యక్తి మూసి ఉన్న షాపు సెట్టర్ కింది నుండి పెట్రోల్‌ను పోసి అగ్గిపుల్ల గీసి వెలిగించాడు. గీసిన అగ్గిపుల్ల, ముందుగానే ప్లాన్ ప్రకారం తెచ్చుకున్న పెట్రోల్ బాటిల్ షాపుకు కొంచెం దూరంలో పడవేసి ఉన్నాయి. ఈ ప్రమాదంలో రోజువారీ విక్రయాలు నిమిత్తము నిల్వ ఉంచిన కిరాణా సరుకులు, ఒక డబుల్ డోర్ ఫ్రిడ్జ్ కాలిపోయాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.1 లక్ష నష్టం వాటిల్లింది అని ఆవేదన వెలిబుచ్చాడు. ఈ విషయంపై బాధితుడు అతని కుటుంబీకులు జరిగిన ఘటనపై స్థానిక పోలీస్‌లకు ఫిర్యాదు చేసారు.

మద్దిశెట్టికి మరో బంగారు నంది అవార్డు

నవతెలంగాణ-జూలూరుపాడు



హైదరాబాదులోని బిర్లా సైన్స్ మ్యూజియం ఆడిటోరియం నందు మెగా ఎంటర్ప్రైజెస్ వారు అవినీతి శిరీష రెడ్డి ఆధ్వర్యంలో సినిమా నటీనటులు సుమన్, సమీర్, నాగ మహేష్, శశి, మధు, అనుప్రసాద్, అనిత, అనూష, ముంతాజ్, ప్రముఖ నటీనటులు శ్వేత, బుల్లితెర నటుల చేత మద్దిశెట్టి వెంకటేశ్వరరావుని బంగారు నంది బంగారు పథకంతో సన్మానించారు. తాను విద్యారంగంలో చేసిన కృషి సినిమా వారు సత్కరించినందుకు నాకు చాలా ఆనందంగా ఉండదని వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విద్యారంగంలో చేసిన కృషి గురించి సమీర్ తెలుసుకొని ప్రత్యేకంగా అభినందించారు. వెంకటేశ్వరరావు పదవి విరమణ పొందిన తర్వాత కూడా కేజీబీవీ, మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలో పనిచేసే అభినందనలు పొందారు. విద్యార్థులకు వారు చేసిన కృషికి గతంలో ఏడు బంగారు పతకాలు, 16 అవార్డులు, మూడు నంది అవార్డులు వరించాయి. విద్యార్థులు చేసిన సేవలు వారి అభివృద్ధి చేసిన సేవలను గుర్తించి, వీరికి అవార్డు రావడం పట్ల విద్యార్థులు ఉపాధ్యాయులు స్నేహితులు, బంధువులు అభినందించారు.

రామన్న స్మారక స్థూపం కూల్చివేత

నవతెలంగాణ-చర్ల





సరిహద్దు ఛత్తీస్గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లాలోని సలాటోంగ్ అడవుల్లో మావోయిస్టు పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి రామన్న స్మారక స్థూపంను భద్రతా బలగాలు మంగళవారం ధ్వంసం చేసాయి. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో భద్రతా బలగాలు గాలింపు చర్యలు చేస్తున్న సమయంలో సలాటోంగ్‌లో మావోయిస్టులు ఏర్పాటు చేసిన భారీ స్థూపం కనిపించడంతో, భద్రతా ప్రమాణాలు పాటించి సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ ఆదేశాల మేరకు ఏఎస్పీ ప్రభాత్ కుమార్ సమక్షంలో జేసీబీ సాయంతో కూల్చివేశారు. డీఆర్జీ, డిస్ట్రిక్ట్ ఫోర్స్, సీఆర్పీ ఎఫ్ 217, కోబ్రా 208, 204 కార్ప్స్ సైనికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సీఐటీయూ జెండాను ఎగిరేద్దాం..

- కార్మికుల హక్కులను రక్షించుకుందాం
- ఒకే ఒక్కసారి అవకాశం ఇవ్వండి
- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపు
- ఉదయించే సూర్యుని గుర్తుకు ఓటెయ్యండి

నవతెలంగాణ-కొత్తగూడెం



సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో సీఐటీయు జెండాను ఎగిరెద్దామని, కార్మికుల హక్కులను రక్షించుకుందామని, ఓకె...ఒక్కసారి అవకాశం ఇవ్వాలని, ఉదయించే సూర్యుని గుర్తుకు ఓటెయ్యాలని సిఐటియూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ కార్మికులకు పిలుపునిచ్చారు. మంగళవారం సింగరేణి బొగ్గు బావుల వద్ద, కార్పొరేట్ ఏరియాలో సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో పిట్ మీటింగ్, గేట్ మీటింగులను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ మీటింగ్‌లో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే.రమేష్ మాట్లాడుతూ సింగరేణి సంస్థ పరిరక్షణ కోసం అహర్నిశలు కృషి చేస్తున్న సిఐటియూ యూనియన్‌ని గెలిపించాలని, సింగరేణి ప్రైవేటు పరం చేస్తున్న యూనియన్లను ఓడించేందుకు ప్రతి కార్మికుడు సిద్ధంగా ఉండాలని కోరారు. ఒక్కసారి సీఐటీయూని గెలిపిస్తే, కార్మికుల సత్తా చాటుతాం అని అన్నారు. ఇన్‌కం టాక్స్‌ను రద్దు చేయాలని, అవినీతి కుంభకోణాలకు అడ్డుకట్ట వేయాలంటే సిఐటియుని గెలిపించాలన్నారు. యాజమాన్యంకు తలొగ్గి, కార్మికుల జీవితాలను తాకట్టు పెట్టే సంఘాలకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. సింగరేణి కార్మికుల హక్కుల కోసం, సొంత ఇంటి కల కోసం, సింగరేణిలో జరుగుతున్న అవినీతి కార్యకలపాలని అరికట్టేందుకోసం కృషి చేస్తున్న సిఐటియు సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్‌ని గెలిపించాలని కార్మికులను కోరారు. ఇప్పటివరకు అధికారంలో ఉన్న యూనియన్లు కార్మికుల హక్కులు కాలరాసే విధంగా సింగరేణి సంస్థను బొగ్గు బ్లాక్లుగా వేరుచేసి ప్రైవేటుపరం చేసే పద్ధతికి శ్రీకారం చుట్టాయని అన్నారు. కార్మికులు కష్టపడి తమ రక్తాన్ని చమట చుక్కగా చేసి శ్రమటోడ్చి పనిచేస్తున్న కార్మికులకు అండగా నిరంతరం సిఐటియు నిలబడిందన్నారు. ప్రైవేటీకరణను కార్మికుల హక్కుల కాపాడేందుకు సిఐటియు కృషి చేసిందని గుర్తు చేశారు. వేతన ఒప్పందాల విషయంలో కార్మికులకు న్యాయం చేసే విధంగా జేబీసీసీఐ సమావేశాల్లో గట్టిగా కొట్లాడి హక్కులు సాధించుకోవడం జరిగిందన్నారు. కాబట్టి సీఐటీయూని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలనీ ఎంప్లాయిస్ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్, నాయకులు వై.వెంకటేశ్వరరావు, సూరం ఐలయ్య, కర్ల వీరాస్వామి, కె.రమేష్ బాబు, నాజర్, సమ్మయ్య, రామ్మూర్తి, డి.వీరన్న, భూక్య రమేష్, లిక్కి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



ఇల్లందు ఎమ్మెల్యేకు శాలువలతో సన్మానం

నవతెలంగాణ-టేకులపల్లి

టేకులపల్లి మండల పీఆర్‌టీయూ సంఘం ఉపాధ్యాయులు ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యను ఇల్లందు క్యాంపు కార్యాలయంలో శాలువలతో సన్మానించినట్టు మంగళవారం ఉపాధ్యాయులు తెలిపారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలను అమలుపరుస్తూ, ప్రతి నెల క్రమం తప్పకుండా 1వ తేదీన రాష్ట్రంలోని ఉపాధ్యాయులందరికీ జీతాలు ఇవ్వాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని, 317 జీవో బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, 40 శాతం ఫిట్మెంట్తో కూడిన పిఆర్‌సి ఇవ్వాలని, ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న 3 డీఏలతో పాటు, అన్ని రకాల పెండింగ్ బిల్లులను వీలైనంత త్వరగా క్లియర్ చేయాలని, ఐటీడీఏ ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ చేపట్టడంతో పాటు పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని, ఈ సమస్యలన్నింటిని తీసుకెళ్లి, పరిష్కారమయ్యే విధంగా కృషి చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆ సంఘం టేకులపల్లి మండల అధ్యక్షులు జి.మోతిలాల్ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు పి.నర్సయ్య, జిల్లా ఉపాధ్యక్షులు టి.రవీందర్, బి.రమేశ్ బాబు, కె.ప్రసాద్, బి.బాలు, విజయనిర్మల, బి.మోహన్, బి.మంగి లాల్, బి.వీరన్న తదితరులు పాల్గొన్నారు.

నిజరూప అలంకారంలో భద్రాద్రి రామయ్య



తెప్పోత్సవానికి సిద్ధమవుతున్న హంస వాహనం



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో ఆధ్యాత్మికంగా కొనసాగుతున్న ముక్కోటి వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా మంగళవారం భద్రాద్రి రామయ్య నిజరూప అవతారమైన సీతారామచంద్ర స్వామి వారి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. వేకువజామునే మేలుకొలుపు సేవ అనంతరం స్వామివారిని పంచామృతాలతో అభిషేకించిన అర్చకులు స్వామివారి నిజరూపమైన సీతారామచంద్రస్వామి రూపంలో అలంకరించి మేళ తాళాలతో భజన భజంత్రీలతో స్వామి తిరువీధి సేవ నిర్వహించి భక్తుల దర్శనార్థం ఉంచారు. నిజరూప అవతారమైన రామ అవతారం ప్రత్యేకతను ఆలయ ఆస్థాన అర్చకులు వివరిస్తూ వ్యక్తిగత సులభల కన్నా రాజ్యసంక్షేమమే మిన్న అని నిరూపించేందుకు దశరథ మహారాజు కుమారుడిగా రామనారాయణుడు జన్మించాడని పరిపూర్ణ మానవుడు అంటే అర్థం ఏమిటో రామ అవతారంలో సృష్టికి అర్థమయ్యే విధంగా తెలియజేసేందుకే రామవతారంలో జన్మించారని తెలియజేశారు. నిజరూపం అవతారంలో ఉన్న రామచంద్రమూర్తిని దర్శించేందుకు భక్తులు అధిక సంఖ్యలో భద్రాచలం తరలిరాగా ఈనెల 22వ తారీకున జరిగే స్వామివారి తెప్పోత్సవానికి హంస వాహనాన్ని ఆలయ అధికారులు సిద్ధం చేస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం గోదావరి నదిలో హంస వాహనంతో ట్రైల్ రన్ నిర్వహించిన అధికారులు ఎటువంటి లోటు పాటు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు.

ఉచిత విద్యా, ఉపాధి కల్పనకై జనవరి 12న ఛలో పార్లమెంట్

- డిసెంబర్ 28 నుండి 31 వరకు ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ వేడుకలు

నవతెలంగాణ-కొత్తగూడెం



దేశంలో అందరికీ ఉచిత విద్య, ఉపాధి కల్పించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఇతర 16 విద్యార్థి సంఘాలు ఛలో పార్లమెంట్ నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బుర్ర వీరభద్రం తెలిపారు. మంగళవారం కొత్తగూడెం మంచి కంటి భవన్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గార్లపాటి పవన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వీరభద్రం మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తుందన్నారు. దేశంలో ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకునేందుకు, అందరికీ ఉచిత విద్యా, ఉపాధి కల్పించాలని జనవరి 12వ తేదీన చలో పార్లమెంట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర బడ్జెట్లో విద్యారంగానికి 3 శాతం నిధులు మాత్రమే కేటాయిస్తున్నారని, ఈ బడ్జెట్ సమావేశాల్లో విద్యారంగానికి కనీసం 20 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే ప్రభుత్వ విద్యా సంస్థలకు సరిపడా నిధులు కేటాయించాలని కోరారు. దేశంలో ఎన్నడూ లేనంతగా నిరుద్యోగం తీవ్రంగా పెరిగిందనీ, సంవత్సరానికి రూ.10 లక్షల ఉద్యోగాలు కల్పిస్తానన్న కేంద్ర ప్రభుత్వ హామీ ఏమైందని ప్రశ్నించారు. ఎన్‌టిఏ అనే ఒకే గొడుగు కింద జాతీయ స్థాయి పోటీ పరీక్షలు అన్నీ నిర్వహించడం సరైన నిర్ణయం కాదన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ బిసి విద్యార్థులకు ఇచ్చే జాతీయస్థాయి ఫెలోషిప్‌లు కోత విధిస్తున్నారని, ఈ కారణం చేతనే జాతీయ విశ్వవిద్యాలయాల్లో విద్యార్థుల ఆత్మహత్యలు పెరిగాయన్నారు. అందరికీ ఉచిత విద్య అందరికీ ఉపాధి కల్పించాలని చేపట్టబోయే చలో పార్లమెంట్ కార్యక్రమానికి ప్రజాస్వామిక వాదులు అందరూ మద్దతు ప్రకటించాలన్నారు.

డిసెంబర్ 28 నుండి 31 వరకు ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ ఉత్సవాలు

డిసెంబర్ 28 నుండి 31 వరకు ఎస్ఎఫ్ఐ 54వ ఆవిర్భావ ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు వీరభద్రం ఈ సందర్భంగా తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, ఉపన్యాస పోటీలు, క్విజ్, విద్యార్థినీలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తామనీ, తదితర విభాగాలలో భద్రాద్రి కల్చరల్ ఫెస్ట్ పేరుతో వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు అత్యధిక సంఖ్యలో పాల్గొని ఆవిర్భావ వేడుకలను జయప్రదం చేయాలని కోరారు. ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి నాగకృష్ణ, కొత్తగూడెం పట్టణ అధ్యక్షులు రామ్ చరణ్, నాయకులు చింటూ, చరణ్, నిఖిల్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మై భారత్ పోర్టల్ ప్రారంభం

- యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా యువజన క్రీడల అధికారి యం.పరంధామ రెడ్డి

నవతెలంగాణ-పాల్వంచ

నెహ్రూ యువ కేంద్ర సంఘటన్, యువజన సర్వీసులు క్రీడల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో మై భారత్ పోర్టల్‌ని ప్రారంభించటం జరిగిందని జిల్లా యువజన, క్రీడల అధికారి యం.పరంధామ రెడ్డి తెలిపారు. ఈ పోర్టల్ ఉద్దేశ్యము ఆజాద్ ఇక అమృత మహోత్సవము నుంచి, 2047 అమృత్ కాల్‌లోకి వెళ్ళుటలో భాగంగా ఈ పోర్టల్‌ను లాంచ్ చేసినట్టు తెలిపారు. ఈ పోర్టల్ యందు యువతకు సంబంధించిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, స్వయం ఉపాధి కార్యక్రమాలు, డిజిటల్ లెర్నింగ్, సాంకేతిక నైపుణ్యత అంశాలు, క్యారియర్ గైడెన్స్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇందులో పొందుపరచడమైనది. ఇది యువతకు ఎంతగానో ఉపయోగపడుతుంది. కావున జిల్లాలోని యువతీ యువకులు, విద్యార్థినీ, విద్యార్థులు, యువజన సంఘాల ప్రతినిధులు, వారి యొక్క మొబైల్ నెంబర్ ద్వారా ఈ క్రింది పోర్టల్ యందు రిజిస్టర్ కాగలరని తెలియజేయడమైనది. https://mybharat.gov.in యూత్ ట్రైప్ నందు ఎన్‌వైకెఎస్‌ను సెలెక్ట్ చేసుకుని సబ్మిట్ చేయవలెను. ఎన్‌వైకేఎస్ ద్వారా మీరు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లయితే వకృత్వ పోటీల ద్వారా పార్లమెంటులో ప్రసంగించే అవకాశం, క్రీడా సామగ్రిని పొందుకోవడం, యూత్ ఎక్స్చేంజ్ ప్రోగ్రాం ద్వారా ఇతర రాష్ట్రాలను సందర్శించడం, సాంకేతిక శిక్షణ నైపుణ్యాలను పెంపొందించుకోవడం, ఉపాధి అవకాశాలను పొందుకోవడం, సాంస్కృతిక కళలకు, ప్రతిభకు గుర్తింపునిచ్చి వారిని రాష్ట్ర జాతీయస్థాయిలోకి వెళ్లడానికి ప్రోత్సహించడం లాంటి అవకాశాలు ఉంటాయి. కావున ఈ అవకాశాన్ని జిల్లాలోని యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలి తెలిపారు.





వైభవంగా అక్షింతల, కలశ శోభాయాత్ర

- పాల్గొన్న ఎమ్మెల్యే జారె

నవతెలంగాణ-ములకలపల్లి

అయోధ్య రామమందిరం నుంచి వచ్చిన తలంబ్రాలను భక్తులకు పంపిణీ చేసే కార్యక్రమంలో భాగంగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో అక్షింతల కలశ శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. ఈ శోభాయాత్రలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పాల్గొన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు ఏర్పాటు చేసిన పరిచయ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల అధికారులు, ఉద్యోగులు ఎమ్మెల్యే జారెను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్రావు, మాజీ జడ్పీటీసీ బత్తుల అంజి, కారం సుధీర్, మండల నాయకులు పేటేటి నర్సింహారావు, పువ్వాల మంగపతి, అమర్నాథ్, నాగళ్ల వెంకటేశ్వరరావు, అడపా నాగేశ్వరరావు, బాల అప్పారావు, గాడి తిరుపతిరెడ్డి, శెనగపాటి సీతారాములు, సురభి రాజేష్, అంజి, ఆదిత్య, సర్పంచ్లు, ఎంపీటీసీలు, యువజన నాయకులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి : ఎమ్మెల్యే జారె

మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మండల అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. మౌలిక సదుపాయాల కల్పనకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదని, ఉద్యోగులకు వృత్తిరీత్యా ఇబ్బంది కలిగితే తనకు తెలపాలన్నారు. తొలుత తహశీల్దార్, ఎంపీడీవోలతో పాటు ఎంపీటీసీల బృందం, ఎంపీపీ మట్ల నాగమణి, వైస్ ఎంపీపీ కొదుమూరి పుల్లారావు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. ఈ సమావేశంలో తహశీల్దార్, ఎంపీడీవో, ఎస్సైలతో పాటు కోఆప్షన్ సభ్యులు షేక్ జబ్బార్, ఎంపీటీసీలు మడకం విజయ, సున్నం సునీత, కొర్రి, భద్రం, తులసి, మెహరామణి తదితరులు పాల్గొన్నారు.

ఆరు నూరైనా ఆరు గ్యారంటీల హామీని నెరవేర్చుతాం

- కల్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే పాయం

నవతెలంగాణ-పినపాక



ఆరు నూరైనా ఆరు గ్యారంటీల హామీని నెరవేర్చుతాం అని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండలంలోని పినపాక గ్రామంలోని రైతు వేదికలో తహసీల్దార్ వీరభద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో ఆడపడుచులకు మంజూరైన 38 కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి హాజరై చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 6 గ్యారంటీ పథకాలలో భాగమైన మహిళల ఉచిత బస్ ప్రయాణం, ఐదు లక్షలున్న ఆరోగ్య శ్రీ కార్డును 10 లక్షలు వరకు పెంచారని అలాగే త్వరలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్‌కు ఇప్పుడు ఇస్తున్న నగదుతో పాటు తులం బంగారం కూడా ఇవ్వడం జరుగుతుందని అలాగే 100 రోజుల్లో 500కి గ్యాస్ సిలిండర్, 5లక్షల ఇందిరమ్మ ఇల్లు, ప్రతి మహిళకు ప్రతినెల 2500, చేయూత కింద 4000 పెన్షన్, చదువుకునే విద్యార్థులకు విద్య భరోసా కార్డు కూడా అందజేయడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వంలో ఇసుక దందాలు, అక్రమ దందాలు, భూకబ్జాలు చేసిన ఎవరిని పార్టీలోకి చేర్చుకునే అవకాశం లేదన్నారు. అలాగే ప్రస్తుతం నాయకులు, కార్యకర్తలు కానీ ఏ పథకం కోసమైన డబ్బులు అడిగితే తన దృష్టికి తీసుకొని రావాలని అలాంటి వారిని ప్రజాభవన్ క్యాంపు కార్యాలయం గుమ్మం గేటు కూడా తాకనివ్వనన్నారు. అలాగే తన గెలుపు కోసం కృషి చేసిన ప్రతి ఒక్క కార్యకర్తని కాపాడుకుంటానన్నారు. అనంతరం సీతంపేట, పినపాకలో పలు కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు రామనాథం, యూత్ నాయకులు ఆనంద్, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



హై స్కూల్ పీడీని సస్పెండ్ చేయాలని ధర్నా

నవతెలంగాణ-జూలూరుపాడు

జూలూరుపాడు హైస్కూల్లో పిడిని సస్పెండ్ చేయాలని వామపక్ష విద్యార్థి యువజన మహిళా సంఘాలు మంగళవారం పాఠశాల ఎదుట ధర్న కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గార్లపాటి పవన్ కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోతు వంశీ మాట్లాడుతూ స్థానిక హైస్కూల్లో పీడీగా విధులు నిర్వహిస్తున్న అరుణ కుమారి శుక్రవారం మధ్యాహ్నం పూట తన కారును నలుగురు విద్యార్థులతో కడిగించుకోవడం జరిగిందన్నారు. బాధ్యతారహిత హోదాలో ఉండి విద్యార్థులతో పెట్టి చాకిరి చేయించుకోవడం సరైనది కాదని అన్నారు. గతంలోనూ విద్యార్థులతో అనేక వ్యక్తిగత పనులు చేయించుకోవడం జరిగిందని అన్నారు. ఏజెన్సీ ఏరియాలో ఉండకుండా సమయానికి ఉపాధ్యాయులు రాకుండా విద్యార్థులకు ఇలాంటి పనులు చేయించుకుంటూ విద్యను పక్కదారి పట్టిస్తున్నారని అన్నారు. విద్యాబుద్ధులు నేర్పే ఉపాధ్యాయులు వెట్టిచాకిరి చేపిస్తే ఇంకెలా అని ప్రశ్నించారు. తక్షణమే పిడి పై చర్యలు తీసుకుని సస్పెండ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బోడా అభిమిత్ర, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి ఎస్.కె చాంద్ పాషా.తదితరులు పాల్గొన్నారు.

మ్యానిఫెస్టోను 100శాతం అమలు చేస్తాం

- పేదల ప్రజల బతుకుల్లో వెలుగులు నింపుతాం : పాయం

నవతెలంగాణ-మణుగూరు



నూతనంగా ఏర్పడిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రేవంత్ రెడ్డి నాయకత్వంలో 6 గ్యారంటీతో పాటు 100శాతం మ్యానిఫెస్టోను అమలు చేస్తామని, పేదల ప్రజల బతుకుల్లో వెలుగులు నింపుతామని పినపాక పాయం శాసనసభ్యులు అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ 36 చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆత్మగౌరవం పెంపొందించేందుకు స్వయం సమృద్ధి సాధించేందుకే కళ్యాణ్ లక్ష్మితో పాటు తులం బంగారం అందజేస్తామని అన్నారు. ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. అవినీతికి తావు లేకుండా పినపాక ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ప్రజాభవణంగా మార్చుమన్నారు. ఈ కార్యక్రమంలో సమితి సింగారం సర్పంచ్ బచ్చల భారతి, పగడేరు సర్పంచ్ తాటి సావిత్రి, ఉప సర్పంచులు తరుణ్ రెడ్డి, వీరంకి వెంకటరావు, ఎంపిటిసి కోటేశ్వరరావు, తహసీల్దార్, అధికారులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పంటకు పెట్టుబడి సాయం, రైతుబంధుపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలి

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కాంతారావు

నవతెలంగాణ-కరకగూడెం



రాష్ట్ర ప్రభుత్వం పంటకు పెట్టుబడి సాయం కింద అందించే రైతుబంధు విషయంలో స్పష్టమైన ప్రకటన చేయాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కొమరం కాంతారావు అధికారులను డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ నూతన ప్రభుత్వం రైతుబంధు డబ్బులను నేరుగా ఖాతాలో వేస్తామని ప్రకటించిన నుండి ఇప్పటివరకు ఎకరం విస్తీర్ణం ఉన్న రైతులకు మాత్రమే ఖాతాల్లో జమ అయ్యాయని మిగతా వారికి జమ కాలేదన్నారు. గత ప్రభుత్వంలో రోజు వారిగా తక్కువ విస్తీర్ణం నుండి ఎక్కువ విస్తీర్ణానికి జమ అయ్యేదని, ప్రస్తుతం ఎకరం విస్తీర్ణం వరకే జమ అయ్యాయని మిగతా వారికి డబ్బులు ఎప్పుడు జమ అయితాయో తెలవని సందిగ్ధంలో రైతులు ఉన్నారని అన్నారు. రైతుబంధు పథకంపై పెద్ద ఎత్తున రాజకీయ దుమారం లేస్తుందని రోజు సామాజిక మాధ్యమాల్లో వస్తున్న కథనాల ఆధారంగా ప్రజల్లో తీవ్ర గందరగోళానికి దారితీస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుబంధు డబ్బులు పడతాయో లేదో అని ప్రజలు ఆందోళన చెందుతున్నారని వారన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పష్టమైన ప్రకటన చేసి ప్రజల గందరగోళానికి తెరదించేలా, రైతుల ఖాతాల్లో రైతుబంధు డబ్బులు జమ అయ్యేలా అధికారులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు ఊకే నరసింహారావు, బిలపాటి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై పేరుకుపోయిన మట్టిని శుభ్రం చేయించిన ఎంపీఓ

నవతెలంగాణ-పినపాక



పినపాక మండలం ఈ బయ్యారం గ్రామ పంచాయతీ పరిధిలో ఈ బయ్యారం క్రాస్ రోడ్ నుండి పంచాయతీ కార్యాలయం వరకు రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ వరకు పేరుకుపోంది. ఈ మట్టితో ప్రజలు, వాహదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇది గమనించి మండలంలోని 23 గ్రామపంచాయతీలకు చెందిన సెక్రటరీలు, మల్టీపర్పస్ వర్కర్ల సహాయంతో శుభ్రం చేసే పనులను చేపట్టామని ఎంపీఓ వెంకటేశ్వరరావు తెలియజేశారు. మంగళవారం ఆయన స్వయంగా రంగంలోకి దిగి రోడ్డుకు ఇరువైపులా దుమ్ము లేగకుండా ఉండేందుకు చర్యలు చేపట్టారు. ఆఫీసులో కూర్చుని ఉండటం, ఆఫీసులో పనిచేయడం కాదని ప్రతిరోజు గ్రామపంచాయతీలో తిరుగుతూ 23 గ్రామపంచాయతీలను పరిశీలిస్తున్నట్లుగా తెలియజేశారు. మరో మూడు రోజులపాటు ఈ.బయ్యారం గ్రామపంచాయతీ ఇది శుభ్రం చేసే పనులు చేపడతామని తెలియజేశారు. తన పని తనను చేసుకొనిస్తే అన్ని పంచాయతీల్లో అభివృద్ధి ఏ విధంగా ఉంటుందో చూపిస్తానని ఆయన తెలియజేశారు. సహకరిస్తున్న సెక్రెటరీలకు మల్టీపర్పస్ వర్కర్లకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. స్వయంగా ఎంపీఓని రోడ్లపై తిరుగుతూ ప్రజల కష్టాలు తెలుసుకుంటూ ఉంటే గ్రామస్తులు ఆయనకు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేస్తున్నామన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అహర్నిశలు శ్రమించిన నేత పొదెం

- కాంగ్రెస్ పార్టీ జిల్లా సోషల్ మీడియా చైర్మెన్ కను బుద్ధి దేవా

నవతెలంగాణ-దుమ్ముగూడెం

2018లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నుండి ఎమ్మెల్యేలుగా గెలుపొందిన పొదెం వీరయ్య తప్ప కాంగ్రెస్ పార్టీలో గెలిచిన మిగతా ఎమ్మెల్యేలు వారి స్వార్ధ ప్రయోజనాల కోసం పార్టీ మారారని, జిల్లాలో పార్టీ కష్ట కాలంలో ఉన్న సమయంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి చేపట్టి జిల్లాలోని ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు కష్టంలో తోడుగా ఉన్న వ్యక్తి వీరయ్య మాత్రమేనని జిల్లా సోషల్ మీడియా చైర్మన్ కను బుద్ధి దేవా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్నుగా ఉన్న పొదెం వీరయ్య కాంగ్రెస్ పార్టీకి వీర విధేయుడుగా ఉంటూ 2018 నాటి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గుర్తు మీద గెలిచిన వారిలో వీరయ్య తప్ప, మిగతా ఎమ్మెల్యేలందరూ కాంగ్రెస్ పార్టీని, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను మోసం చేసి, వారి స్వార్ధ ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ ఇచ్చిన డబ్బుకి కక్కుర్తి పడి పార్టీ మారినట్టు తెలిపారు. పొదెం వీరయ్యను కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకత్వం గుర్తించి ఎమ్మెల్సీ పదవి ఇచ్చి మంత్రివర్గంలో చోటు కల్పించాలని జిల్లాలోని ప్రతి కాంగ్రెస్ కార్యకర్త నోట వినబడుతుందని తెలిపారు.



కార్మిక పక్షాన పోరాడే టీబీజీకేఎస్‌నే గెలిపించండి

- ఉపాధ్యక్షులు వూకంటి ప్రభాకర రావు

నవతెలంగాణ-మణుగూరు

రానున్న సింగరేణి గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికల్లో కార్మిక పక్షపాతిగా ఉన్న టీబీజీకేఎస్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలని ఏరియా టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షులు వూకంటి ప్రభాకర రావు కార్మికులకు పిలుపునిచ్చారు. మంగళవారం ఓసి స్టోర్స్ , ఏరియా వర్క్ షాప్, జియం ఆఫీస్ ఫిట్ సెక్రటరిలు గంగాధర్, మహబూబ్ పాషా, మనోహర్ అధ్యక్షతన జరిగిన గేట్ మీటింగ్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీబీజీకేఎస్ గెలిస్తే కార్మికులు గెలిచినట్టే అని కార్మిక విజయం కోసం జరుగబోయే ఎన్నికల్లో టీబీజీకేఎస్‌కు ప్రతి కార్మికుడు అండగా నిలవాలని అడిగిందే తడవుగా అన్ని పనులల్లో తోడుగా నిలిచి ప్రతి ఒక్కరి కష్ట సుఖాల్లో తోడుగా ఉన్నామన్నారు. బ్యాలెట్ పై ఉన్న తొమ్మిదో నెంబర్ బాణం గుర్తు పై మీ అమూల్యమైన ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ అబ్దుల్ రవుఫ్, బ్రాంచి నాయకులు వీర భద్రయ్య, కాపా శివాజీ, యస్వియస్‌యన్ వర్మ, మునిగెల రమేష్, సీతక్క నాయకులు మహబూబ్ పాషా, యం.వి శ్రీను, శ్రీనివాస రెడ్డి, గంగాధర్, హబీబ్, అమినుద్దీన్, రాం దాస్, టీబీజీకేఎస్ శ్రేణులు, కార్మికులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి

నవతెలంగాణ-అశ్వారావుపేట



రానున్న పార్లమెంటు ఎన్నికలకు ఎన్నికల విధులు నిర్వహించనున్న మండల, గ్రామ స్థాయి సిబ్బంది సిద్ధంగా ఉండాలని నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేక అధికారి, స్థానిక తాసీల్దార్ కృష్ణ ప్రసాద్ స్పష్టం సూచించారు. అందుకు కావలసిన ఓటర్లు జాబితాను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాల్సిన బాధ్యత మనదేనని అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశపు ప్రాంగణంలో మండల బీఎల్ఓ (బూత్ లెవల్ అధికారులు) లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వచ్చే ఫిబ్రవరి 8 నాటికి ఓటరు తుది జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఓటర్ల జాబితా రూపకల్పన మాస్టర్ ట్రైనీ, ఏఓ నవీన్, ఎన్నికల విభాగం యూడీసీ లావణ్య, ఆర్ఐ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వం చేసిన అన్యాయాన్ని సరిచేయండి

- కోలిండియా వేతనాలు చెల్లించండి
- సీఐటీయూ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు

నవతెలంగాణ-కొత్తగూడెం



సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు గత ప్రభుత్వం చేసిన అన్యాయాన్ని సరిచేసి, కోలిండియా వేతనాలు, లేదా జీఓ నెం.22 ప్రకారం వేతనాలు పెంచాలని ప్రజావాణిలో సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం (సిఐటియు) సీఐటీయూ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు ప్రభుత్వానికి వినతి పత్రం అందజేశారు. హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిరావ్ పూలే భవన్‌లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు మధు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ అభివృద్ధిలో, సింగరేణి లాభాలు గడించడంలో కాంట్రాక్టు కార్మికులు ప్రధాన పాత్ర పోషిస్తున్నారని, కానీ వారికి వేతనాలు పెంచడంలో, వారి సమస్యలు పరిష్కరిచడంలో గత రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించాయన్నారు. సింగరేణి సంస్థలో 25 వేల మంది కాంట్రాక్టు కార్మికులకు గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అన్యాయాన్ని సరిచేయాలని కోరారు. కోలిండియాలో కాంట్రాక్టు కార్మికులకు రోజుకు రూ.1,199లు చెల్లిస్తుంటే సింగరేణిలో మాత్రం కేవలం రూ.504లు మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. సింగరేణిలో ప్రతి కాంట్రాక్టు కార్మికుడు రోజుకు రూ.695లు నెలకు రూ.18,070లు నష్టపోతున్నాడని వివరించారు. జీఓ నెం.22 అమలుకు అనుమతి కోసం సింగరేణి యాజమాన్యం గత సంవత్సరం సెప్టెంబర్ 26న రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసినప్పటికీ గత రాష్ట్ర ప్రభుత్వం స్పందిచలేదని అన్నారు.

2022 సెప్టెంబర్ 18 రోజుల సమ్మె సందర్భంగా జరిగిన ఒప్పందాన్ని సహితం సింగరేణి యాజమాన్యం పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. సింగరేణి యాజమాన్యం కాంట్రాక్టు కార్మికుల పట్ల అడుగడుగునా వివక్షత పాటిస్తున్నదని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కోల్ బెల్ట్ పర్యటనలో నేటి ముఖ్యమంత్రి సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు న్యాయం చేస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. గత ప్రభుత్వం చేసిన అన్యాయాలన్నింటినీ సరిచేస్తున్న ముఖ్యమంత్రి గత ప్రభుత్వం పాలనలో అన్యాయానికి గురైన సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు కూడా న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.



అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలి

- కొత్త పరిశ్రమ నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయండి
- గూడెంలో ఐటీ హబ్ ఏర్పాటుకు కృషి
- అధికారుల పనితనం ప్రజల గుండెల్లో నిలిచిపోవాలి
- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

నవతెలంగాణ-కొత్తగూడెం

కమిషన్లకు తావు లేకుండా అభివృద్ధి పనులు చేయాలని, నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా అధికారులు పనిచేయాలని, నియోజకవర్గంలో కొత్త పరిశ్రమ నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు తయారు చేయాలని, గూడెంలో ఐటీ హబ్ ఏర్పాటుకు కృషి చేస్తానని, ప్రజలకు సేవలు అందించిన అధికారులు వారి గుండెల్లో నిలిచిపోతారని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం కొత్తగూడెంలో తొలిసారిగా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కొత్తగూడెం క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడారు. కొత్తగూడెం నియోజకవర్గం 75శాతం పైగా షెడ్యూల్ ఏరియాలో ఉన్నందున ఈ ఏరియాలో పనిచేయాలంటే రెవెన్యూ, పోలీసుల అధికారులకు సవాల్‌గా మారిందని చెప్పారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులు వెంటనే పూర్తి చేయాలని కోరారు. కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలు బతకాలంటే కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, యువతకు ఉపాధి అవకాశాలు లభించాలని సూచించారు. ఆ దిశగా అధికారులు ప్రణాళికలు తయారు చేయాలన్నారు. గెలిచిన ఎమ్మెల్యేలు నియోజకవర్గ తండ్రిగా ఉండాలన్నారు. ప్రజలకు చేసిన అభివృద్ధి విషయంలో అధికారుల సేవలు ప్రజలకు గుర్తుండి పోవాలని సూచించారు. కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలను కలిపి ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేసే విధంగా కృషి చేస్తాని తెలిపారు. నిలిచిపోయిన బైపాస్, టూరిజం పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. సుజాత నగర్‌లో నూతన పరిశ్రమ ఏర్పాటుకు, కొత్తగూడెం, పాల్వంచలో ఐటీ హబ్ ఏర్పాటు కృషి చేస్తానని చెప్పారు. అనేక సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న, గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేసిన యూనివర్సిటీ ఏర్పాటు కృషి చేస్తామని చెప్పారు. కొత్తగూడెంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు అవసరముందన్నారు. పోలీసుల అతి ఉత్సాహం ఆపాలని కోరారు. నెలలో ఒక్క రోజు... "మీ కోసం...మీ ఎమ్మెల్యే"..పేరుతో నిర్వహించనున్న కార్యక్రమ నిర్వహణకు జిల్లా అధికార యంత్రాంగం సహకరించాలని కోరారు. దీని ద్వారా ప్రజా సమస్యలు నేరుగా తమ దృష్టికి వస్తాయని, వెంటనే పరిష్కారానికి అవకాశం ఉంటుందని తెలిపారు.

అధికారుల సహకారం, సమన్వయంతో నియోజకవర్గం అభివృద్ధికి పాటుపడదామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర రావు, డీసీసీబీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ కాపు సీతాలక్ష్మి, సీపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.షాబీర్ పాష, లక్ష్మీదేవి పల్లి ఎంపీపీ సోనా, చుంచుపల్లి ఎంపీపీ శాంతి, ఎంపీటీసీలు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గెలిపించిన ప్రజలను గుండెల్లో పెట్టుకుంటా

- మోరంపల్లి బంజరలో ఎమ్మెల్యే పాయంకు ఘన స్వాగతం
- ఆలయాలలో ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-బూర్గంపాడు



బూర్గంపాడు మండలం మోరంపల్లి బంజర గ్రామంలో మంగళవారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు ప్రజలు, పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. మండల పరిధిలోని మణుగూరు క్రాస్ రోడ్‌లో గల శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ క్రమంలో మర్రికుంట గ్రామంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజలు మంగళ హారతులు పలుకుతూ, పూలు చల్లుతూ ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత తొలిసారిగా బూర్గంపాడు మండలం మోరంపల్లి బంజరకు పాయం విచ్చేయడంతో ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున తరలివచ్చారు. మర్రికుంట గ్రామం నుంచి మోరం పల్లి బంజర గ్రామంలోని పురవీధుల్లో ఓపెన్ టాప్ జీపుపై ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు ప్రజలకు అభివాదం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

గెలిపించిన ప్రజలు, కార్యకర్తలను గుండెల్లో పెట్టుకుంటా : పాయం

తనను ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలను, పార్టీ కార్యకర్తలను, నాయకులను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటానని, అభివృద్ధి చేసి చూపెడతానని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మోరంపల్లి బంజర్‌లో ప్రజలకు అభివాదం చేస్తూ ప్రజలందరికీ తాను రుణ పడి ఉంటానని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా మోరంపల్లి బంజరలోని రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మోరంపల్లి బంజరులో నూతనంగా నిర్మించిన శ్రీ వెంకటేశ్వర ఫంక్షన్ హాలును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పినపాక నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ జెడ్పిటిసి బట్టా విజయ్ గాంధీ, శ్రీ వెంకటేశ్వర ఫంక్షన్ హాల్ నిర్వాహకులు వీరంరెడ్డి వెంకట రెడ్డి, పీసీసీసభ్యులు తాళ్ళూరి చక్రవర్తి, మాజీ సొసైటీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, లక్ష్మీపురం ఉపసర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, మోరంపల్లి బంజర గ్రామ ఉప సర్పంచ్ కైపు లక్ష్మీ నారాయణ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దుగ్గంపూడి కృష్ణారెడ్డి, ప్రధాన కార్య దర్శి చల్లా వెంకటనారాయణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పూలపల్లి సుధాకర్ రెడ్డి, బెల్లంకొండ రామారావు, వీరంరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ తెలుగు మహాసభల గోడ పత్రికను ఆవిష్కరించిన కూనంనేని

నవతెలంగాణ-కొత్తగూడెం



2024 జనవరి 5,6,7 తేదీలలో ఆంధ్రప్రదేశ్ రాజమండ్రిలో ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండవ అంతర్జాతీయ తెలుగు మహాసభల గోడ పత్రికను కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలుగు మహాసభల నిర్వాహకులకు కవులకు, కళాకారులకు ఎమ్మెల్యే కూనంనేని అభినందనలు తెలిపారు. అనంతరం అంతర్జాతీయ తెలుగు మహాసభల సంచాలకులు, గజల్ కవి రాజేష్ మాట్లాడారు. సుమారు 70 దేశాల నుండి ప్రతినిధులు, లక్షలమంది సాహితీ ప్రియులు పాల్గొంటారని, నాలుగు రాష్ట్రాల గవర్నర్లు, రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్య మంత్రులను, మంత్రులను, చలన చిత్ర ప్రముఖులను, సాహితీవేత్తలను ఆహ్వానించామని తెలిపారు. ప్రజలందరూ పాల్గొని సభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి తూముల శ్రీనివాస్, లఘుచిత్ర దర్శకులు, రచయిత కొత్తపల్లి శేషు, ప్రముఖ కవి నాగులపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు తనిఖీ చేసిన ఎంపీడీవో

నవతెలంగాణ-టేకులపల్లి

టేకులపల్లి మండలంలోని బేతంపూడి గ్రామపంచాయతీ పరిధిలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, తెలంగాణకు హరితహారం నర్సరీ మొక్కల పెంపకం కోసం ఏర్పాటు చేస్తున్న నర్సరీని టేకులపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి కోట వీరబాబు మంగళవారం తనిఖీ చేసినట్లు తెలిపారు. బ్యాగులు నింపుట, విత్తనాలు నాటే కార్యక్రమం త్వరగా పూర్తి చేయాలని గ్రామ పంచాయతీ సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ శ్రీనివాస్, టీఏ చాంద్మల్, ఎఫ్.ఎ.వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

ఆస్తుల పరిరక్షణకు సహకరించాలని పోలీస్ కమిషనర్‌కు జీఎం వినతి

నవతెలంగాణ-ఇల్లందు



సింగరేణి సంస్థ ఆస్తుల పరిరక్షణకు తమ సహాయ సహకారాలు అందించాలని ఖమ్మం పోలీస్ కమిషనర్ విష్ణు వారియర్‌ను జీఎం కోరారు. దీనికి పోలీస్ కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఖమ్మం పోలీస్ కమిషనర్ విష్ణు వారియర్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు ఖమ్మం కమిషనరేట్ పరిధిలోని ఉసిరికాయల పల్లిలో గల సోలార్ ప్లాంట్ గురించి వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి, ఇంటిలిజెన్స్ గార్డ్ సాంబయ్య, కమ్యూనికేషన్సమాన కోఆర్డినేటర్ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి డే-2023..మహిళలకు ఆటల పోటీలు

నవతెలంగాణ-కొత్తగూడెం



సింగరేణి డే సందర్భంగా కార్పొరేట్ ఆధ్వర్యంలో కొత్తగూడెం పరిసర ప్రాంత మహిళలకు సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు-2023 పురస్కరించుకొని కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో ఏజిఎం (పర్సనల్) కె.శ్రీనివాస రావు ఆటల పోటీలను ప్రారంభించారు. మహిళలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భముగా ఏజిఎం (పర్సనల్) కె.శ్రీనివాస రావు మాట్లాడారు. గెలుపొందిన వారికి 23శనివారం ప్రకాశం స్టేడియం నందు నిర్వహించే సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో బహుమతుల ప్రధానం జరుగునని తెలిపారు. ఈ కార్యక్రమములో సీనియర్ పిఓ టి.శ్రీనివాస రావు, వెల్ఫేర్ పిఏ వర ప్రసాద్, స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ ఫాస్నెట్, సేవా కో-ఆర్డినేటర్ ఎంఏ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందు : 23న జరగనున్న సింగరేణి దినోత్సవం సందర్భముగా మహిళా ఉద్యోగులకు, ఉద్యోగుల కుటుంబ మహిళలకు, సేవా సమితి సభ్యులకు దీపాలంకరణ పోటీలను స్థానిక సింగరేణి పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సేవా అధ్యక్షురాలు నిమ్మి ఆనంద్ హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డి.జి.ఎం (పర్సనల్) జీవీ మోహన్ రావు , సీనియర్ పర్సనల్ అధికారి సాయి స్వరూప్, ఉపాధ్యాయులు సంఘాల సుధాకర్ పాల్గొన్నారు.

కార్మికులను పరిరక్షించే దమ్ము సీఐటీయూకే ఉంది : రాజారావు

నవతెలంగాణ-ఇల్లందు



సింగరేణి సంస్థను కాపాడి కార్మికులను పరిరక్షించే దమ్ము సీఐటీయూ కే ఉన్నదని ఉదయించే సూర్యుడు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పి.రాజారావు విజ్ఞప్తి చేశారు. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల నేపథ్యంలో ఇల్లందులో వర్క్ షాప్, సింగరేణి ఆసుపత్రిలలో జరిగిన సమావేశాల్లో పాల్గొని మాట్లాడారు. నీతి నిజాయితీగా పోరాడే సీఐటీయూను ఆదరించాలన్నారు. ఒక నాడు లక్షా పద్దెనిమిది వేల మంది కార్మికులు ఉన్న సింగరేణి నేడు ముప్పై తొమ్మిది వేల మంది మాత్రమే ఉన్నారని దీనికి పాలకులే కారణం అన్నారు. ఐక్యతా పోరాటం ద్వారా నే బలమైన పాలకుల, యాజమాన్యం మేడలు వంచగలమని అది సీఐటీయూ కే సాధ్యమని అన్నారు. కార్మికుల సొంతింటి కల సిఐటియు ద్వారానే సాధ్యమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి కార్యదర్శి ఎండి.అబ్బాస్, నాయకులు అబ్దుల్ నబి , తాళ్లూరి కృష్ణ, ఆలేటి కిరణ్, కూకట్ల శంకర్,మన్యం మోహన్ రావు, వరంగంటి రాజ మొగిలి, ఆర్ బీ జే రాజు,తదితరులు పాల్గొన్నారు.



చెరువు కట్ట రక్షణే ధ్యేయం : డీవీ

నవతెలంగాణ-ఇల్లందు

బ్రిటిష్ కాలం నాటి చెరువు, ఇటీవల పటిష్టంగా నిర్మించిన కరకట్ట రక్షణే ధ్యేయమని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అన్నారు. మంచినీటి చెరువు కట్టకు రక్షణ కల్పించేందుకు పురపాలక సంఘం ఆధ్వర్యంలో డిఎంఎఫ్టి నిధుల ద్వారా ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు ఇటీవల పనులు ప్రారంభమయ్యాయి. ఫెన్సింగ్ పనులు శరవేగంగా జరుగుతున్న క్రమంలో మంగళవారం డీవీ పనులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ ఏఈ శంకర్, వర్క్ ఇన్స్పెక్టర్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

చదరంగంలో ఆల్ ఇండియా యూనివర్సిటీకి ప్రియదర్శిని విద్యార్థి ఎంపిక

నవతెలంగాణ-కొత్తగూడెం



వరంగల్‌లో ఈనెల 18న కాకతీయ యూనివర్సిటీలో జరిగిన చదరంగం పోటీలో స్థానిక ప్రియదర్శిని కళాశాల విద్యార్థి బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న గణేష్ యూనివర్సిటీలో ప్రథమ స్థానంలో నిలిచి ఆలిండియా యూనివర్సిటీకి ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కాటేపల్లి నవీన్ బాబు తెలిపారు. ఈ సందర్భముగా మంగళవారం కళాశాలలో కళాశాల డైరెక్టర్ శ్రీరామనేని చలపతిరావు ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ నయీం పాషా, ప్రత్యేకంగా అభినందిస్తూ చెన్నైలో జరిగే ఆలిండియా యూనివర్సిటీ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి కాకతీయ యూనివర్సిటీకి, చదువుతున్న కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించినారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాయల వివేక్, పి.డి కాశిమల్ల రమేష్, అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేల సహకారంతో సింగరేణి అభివృద్ధి

నవతెలంగాణ-కొత్తగూడెం



సింగరేణి విస్తరించి ఉన్న ఏరియాల ఎమ్మెల్యేల సహకారంతో సింగరేణి మరింత అభివృద్ధి సాధ్యమని కొత్తగూడెం ఏరియా జీఎం. ఎం.షాలెం రాజు అన్నారు. కొత్తగా ఎన్నికైన కొత్తగూడెం, సత్తుపల్లి ఎమ్మెల్యేలను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సత్తుపల్లి నూతన శాసనసభ సభ్యులు మట్టా రాగమయి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావులను మర్యాద పూర్వకముగా కలిశారు. ఈ కార్యక్రమములో కొత్తగూడెం ఏరియా పీఓ వెంకటాచారి, ఎస్.ఓ.టు జీఎం జీవి.కోటిరెడ్డి, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ డి.రమణారెడ్డి, సీనియర్ ఎస్టేట్స్ ఆఫీసర్ బి.తౌరియా నాయక్, ఎస్టేట్స్ ఆఫీసర్ ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంగన్వాడీలో పిల్లలకు పౌష్టికరమైన ఆహారం : సీడీపీఓ

అన్నపురెడ్డిపల్లి : అంగన్వాడీలో పిల్లలకు పౌష్టికరమైన ఆహారం అందించడంలో అంగన్వాడీ టీచర్లు ఎంతో కృషి చేస్తున్నారని సిడిపిఓ నిర్మల జ్యోతి అన్నారు. మండల పరిధిలోని అబ్బుగూడెం, ఊటుపల్లి, అన్నదైవం గ్రామాల్లో గల అంగన్వాడీ కేంద్రాలను సిడిపిఓ నిర్మల జ్యోతి పరిశీలించి స్టాక్, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్లు అప్పుడే పుట్టిన పిల్లలు దగ్గర నుండి 5 సంవత్సరాల లోపు వయస్సు గల పిల్లలు ఎత్తు బరువులు చూసి ప్రతి నెల 5వ తేదీ లోపల ఆన్ లైన్ చేయాలని అంగన్వాడి టీచర్లకు సూచించారు. ఐదేండ్ల లోపల ఉన్న పిల్లలందరినీ అంగన్వాడి కేంద్రాలకు తీసుకు వచ్చే విధంగా పిల్లలు తల్లితండ్రులకు అవగాన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ అరుణ గంగాజలం అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

9

నవతెలంగాణ

ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం | డిసెంబర్ 20, 2023 | www.navatelangana.com

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

నవతెలంగాణ-ఖమ్మం లీగల్

జై భీమ్ న్యాయవాదుల ఐక్య వేదిక కమిటీ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఖమ్మం టి.ఎస్.జీ.ఓ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ఎస్.జగ్జీవన్ కుమార్ హాజరై ప్రసంగించారు. ఈకార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దిరిశాల కృష్ణా రావు, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మన్నెపల్ల బసవయ్య, బార్ అసోసియేషన్ కోశాధికారి మిరియాల జ్యోతి ప్రవీణ్ కుమార్, ఖమ్మం ఫాస్టర్ వేద రత్నం, ఫాస్టర్ సత్యపాల్, ఫాస్టర్ బి.ఆనందరావులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ న్యాయవాదుల అధ్యక్షుడు కర్లపూడి శ్రీనివాసరావు, గద్దల దిలీప్ కుమార్, బార్ కౌన్సిల్ సభ్యుడు కొల్లి సత్యనారాయణ, వి.సంజయ్ కుమార్, విక్కిరాల రాంబాబు, పి.దానయ్య, చరణ్, పాల్గొన్నారు.

శ్రీ రామావతారంలో పర్ణశాల రామయ్య



నవతెలంగాణ- దుమ్ముగూడెం.

ముక్కోటి వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలలో భాగంగా 7వ రోజు మంగళవారం పర్ణశాల రామయ్య శ్రీ రామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. లోకకంటకులైన రావణ కుంభకర్ణాది రాక్షసులను సంహరించడానికై దశరథుని కుమారునిగా శ్రీమన్నారాయణుడు ధరించిన అవతారం శ్రీరామావతారం. వ్యక్తిగత సౌఖ్యాలకన్నా ధర్మాచరణయే ఉత్తమమైనదని అదే శాశ్వతమైనదని భావించి, పరిపూర్ణమైన మానవుడు ఎలా వుండాలో ఆచరించి చూపించిన ఆదర్శపురుషుడు, మర్యాద పురుషోత్తముడు, మూర్తీభవించిన ధర్మస్వరూపుడు శ్రీరామచంద్రుడు. సూర్య గ్రహ బాధలున్నవారు రామావతారాన్ని దర్శించడం వలన ఆ బాధల నుండి విముక్తిని పొందుతారు. సాయంత్రం 4.30 గంటలకు స్వామివారిని గ్రామ పురవీధుల్లో తిరువీధి సేవ నిర్వహించారు. భక్తులు పెద్ద తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు శ్రావణ్ కుమార్, అనిల్, సూపరిండెంట్ కిషోర్, పర్ణశాల ఆలయ ఇన్చార్జ్ ప్రసాద్, అర్చకులు అ మరవాది కిషోర్ కుమారాచార్యులు, శేషం కిరణ్ కుమారాచార్యులు, భరద్వాజచార్యులు, ఆలయ సిబ్బంది యగ్గడి శివ, కంటెం రాము తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య మహిళ కార్యక్రమం మహిళలకు వరం

- ప్రభుత్వ వైద్యశాలలో డెలివరీల సంఖ్య పెంచాలి
- జిల్లా ప్రభుత్వ అదనపు వైద్యాధికారి డాక్టర్ బెజవాడ సైదులు

నవతెలంగాణ-కామేపల్లి



ఆరోగ్య మహిళ కార్యక్రమం మహిళలకు వరం అని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ డిప్యూటీ డిఎంహెచ్ఓ బెజవాడ సైదులు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించి రికార్డులు రిజిష్టర్లను తనిఖీ చేశారు. ప్రతి మంగళవారం మండల ప్రభుత్వ వైద్యాధికారులు డాక్టర్ నెల్లూరి చందన, డాక్టర్ శిరీష ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆరోగ్య మహిళ వైద్య శిబిరాన్ని సందర్శించి పలు సలహాలు సూచనలు చేశారు. ప్రభుత్వ వైద్యంను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆరోగ్య మహిళ కార్యక్రమం లో మహిళలకు మెరుగైన ప్రభుత్వ వైద్యసేవలు అందించాలని ప్రభుత్వ వైద్యశాలలో డెలివరీల సంఖ్యను పెంచాలని, విధి నిర్వాహణలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం చేయవద్దని, పల్లె దవాఖాన వైద్యులు ఖచ్చితంగా సమయపాలన పాటించాలని అలసత్వం వహిస్తే వేటు తప్పదని అన్నారు. ప్రభుత్వ వైద్యసేవలు ప్రజలకు అందించడంలో మండల వైద్యాధికారులు డాక్టర్ చందన, శిరీష సేవలు భేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ ధూప్ సింగ్, పల్లె దవాఖాన వైద్యులు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేపూరి నారాయణ మృతికి నివాళులు

నవతెలంగాణ-వైరాటౌన్

వైరా మండలం వల్లాపురం గ్రామంలో వేపూరి నారాయణ అనారోగ్యంతో బాధపడుతూ మరణించారు. మరణవార్త తెలిసిన వెంటనే సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు వనమా చిన్న సత్యనారాయణ, సిపిఐ(ఎం) వైరా మండల కార్యదర్శివర్గ సభ్యులు బాజోజు రమణ, తూము సుధాకర్ అమరజీవి వేమూరి నారాయణ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారితోపాటు యనమద్ది రామకృష్ణ, బంధువులు స్నేహితులు కుటుంబ సభ్యులు తదితరులు నివాళులు అర్పించారు.

22న ముదిగొండలో సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-ముదిగొండ

ఈ నెల 22న మండల సాధారణ సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి సామినేని హరిప్రసాద్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వాసిరెడ్డి దుర్గవెంకట్ (విడివి) అశోక్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని గ్రామపంచాయతీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు వివిధ శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

మినీ స్టేట్ బ్యాంకు ప్రారంభం

నవతెలంగాణ-ఎర్రుపాలెం

మండల పరిధిలోని బుచ్చిరెడ్డిపాలెం గ్రామంలో మంగళవారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మినీ బ్యాంకును బ్రాంచ్ మేనేజర్ వేద వసంతరాయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మినీ బ్యాంకు ద్వారా విత్‌డ్రా, మనీ ట్రాన్స్ సేషన్, ఇన్సూరెన్స్ ఏపీఎస్‌బివై, ఏపీజెజెవై తదితర సౌకర్యాలను ఖాతా దారులు వినియోగించు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్యాషియర్ గోపి, మినీ బ్యాంక్ నిర్వాహకరాలు కర్నాటి సునీత, నాయకులు యర్రమల శ్రీనివాస్ రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూనంనేనిని సన్మానించిన అంబేద్కర్ యూత్ సభ్యులు

నవతెలంగాణ-కొత్తగూడెం టౌన్

కొత్తగూడెం సీపీఐ ఆఫీసు నందు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును లక్ష్మీదేవి పల్లి మండల పరిధిలోని రేగళ్ల ఎస్సీ కాలనీ గ్రామ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సన్మానించారు. గ్రామంలో సిసి రోడ్లు, డ్రైనేజీ సమస్యలు, ఇల్లు లేని నిరుపేదలకు ఇండ్లు ఇవ్వాలని పలు సమస్యలను ఎమ్మెల్యే కూననేనికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కంటెం శ్రీను, తేలూరి నరసింహ రావు, నాగరాజు, రవీందర్, పాల శ్రీను, నిరంజన్ పవన్ పాల్గొన్నారు.

టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సుకు దరఖాస్తు ఆహ్వానం

నవతెలంగాణ-కొత్తగూడెం టౌన్

టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్‌తో పాటు టైలరింగ్, ఎంబ్రాయిడింగ్ లో కోర్సులు చదివేందుకు www.bse telangana.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ ఎం.వెంకటేశ్వర చారి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సంబంధిత డాక్యుమెంట్స్ జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాలన్నారు. ఎటువంటి ఆలస్య రుసుము లేకుండా ఈనెల 29 వరకు, ఆలస్య రుసుముతో జనవరి 12 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పరీక్ష ఫీజును చలానా రూపంలో హెడ్ ఆఫీస్ అకౌంట్ కి ఎస్బిఐ చలానా బ్రాంచ్‌లో చెల్లించాలన్నారు. ఇతర వివరములకు. 8919279238ను సంప్రదించగలరు.

పొదెం వీరయ్యకు మంత్రి పదవి ఇవ్వాలి

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు లంకా శ్రీనివాసరావు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో పార్టీకి, కార్యకర్తలకు అండగా నిలిచిన మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య కు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించి మంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు లంకా శ్రీనివాసరావు, పర్ణశాల గ్రామపంచాయతీ సర్పంచ్ తెల్లం వరలక్ష్మి అన్నారు. మంగళవారం లక్ష్మీ నగరం మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కన్నతల్లి లాంటి కాంగ్రెస్ పార్టీ కష్ట కాలంలో ఉన్న సమయంలో అగ్రకులానికి చెందిన ఎమ్మెల్యేలు డబ్బు అధికారం కోసం పార్టీలు ఫిరాయించడం జరిగింది అన్నారు. గిరిజన బిడ్డ, ఆర్థికంగా బలహీనుడు అయ్యుండి కూడా అధికార పార్టీ ఇస్తానన్న 50 కోట్లతో పాటు పదవులను కాదని కష్టాల్లో ఉన్నటువంటి కాంగ్రెస్ పార్టీ కొరకు ప్రజాస్వామ్య విలువలు కాపాడడం కొరకు అనేక ఇబ్బందులు అనేక అవమానాలు కలిగిన వాటన్నింటినీ భరిస్తూ ... ప్రజాస్వామ్యంలో ప్రధాన పాత్ర అయినటువంటి ప్రతిపక్షంలో నిలిచి ప్రజా సమస్యలను అసెంబ్లీ సాక్షిగా ప్రస్తావించిన మా గిరిజన నికార్సైన కాంగ్రెస్ నాయకుడు పొదెం వీరయ్య మాత్రమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు బైరెడ్డి సీతారామారావు, అంజిపాక సర్పంచ్ నాగేంద్రబాబు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కోడి చంటిబాబు, సుబ్బారావుపేట సర్పంచ్ వర్స చిన్నారావు, సీనియర్ నాయకులు శీరపు అప్పల రెడ్డి పాల్గొన్నారు.

డివిజన్ కోల్ ట్రాన్స్ పోర్టు వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నిక

నవతెలంగాణ-ఇల్లందు

ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆధ్వర్యంలో డివిజన్ కోల్ ట్రాన్స్ పోర్టు వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నిక నిర్వహించారు. గౌరవ అధ్యక్షులుగా ఆనాటి లక్ష్మయ్య, అధ్యక్షునిగా వరద రామచంద్రయ్య, ఉపాధ్యక్షునిగా జెఎ. ప్రసాద్ జనరల్ సెక్రటరీ జె.వెంకట్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ ఇ.శ్రీను, ఆర్గనైజరీ సెక్రెటరీ ఆర్. మహేష్, ప్రచార కార్యదర్శిగా పీ.మూర్తి, కోశాధికారి ముత్యాల వీరన్న, కమిటీ సభ్యునిగా మున్నా, వెంకన్న, శంకర్, మధు, విష్ణు వెంకన్న, శేఖర్, రాజు, గోపాల్ ఎన్నికయ్యారు.

ఆకతాయిల ఆగడాలు



- బర్త్ డే ల పేరుతో మితిమీరుతున్న సరదాలు
- నివాస ప్రాంతాలలో ఆకతాయిల అత్యుత్సాహం
- పోలీస్ సారూ జర కన్నేయండి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం పట్టణంలో గతంలో ఎన్నడూ లేని విధంగా గత సంవత్సర కాలం నుండి ఆకతాయిల ఆగడాలు శృతిమించుతున్నాయి. వీరి వెకిలిచేష్టల వల్ల నివాస ప్రాంతాలలో మహిళలతో పాటు సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్నేహితుల పుట్టినరోజులు పేరుతో అతిగా మద్యం సేవించి నివాస ప్రాంతాలలో కేక్ కట్ చేసే కార్యక్రమాలు నిర్వహిస్తూ అర్ధరాత్రి దాటే వరకు డీజే సౌండ్లతో కేరింతలు కొడుతూ ప్రజలకే అనేక రకాల ఇబ్బందులు కల్పించడమే కాక ప్రశ్నించిన వారిపై దాడికి సైతం దిగుతున్నారు. అత్యుత్సాహం మితిమీరి పట్టణ నడిబొడ్డు అయిన అంబేద్కర్ సెంటర్లో కూడా కేకులు కట్ చేస్తూ ఇటు ట్రాఫిక్ కి సామాన్య ప్రజలకు తీవ్ర ఇబ్బందులు గురి చేస్తున్నారంటే ఆకతాయిల అరాచకం ఏ స్థాయికి వెళ్ళిందో అర్థమవుతుంది. భద్రాచలం పట్టణంలో సోమవారం రాత్రి జన్మదిన వేడుకలు పేరుతో అంబేద్కర్ సెంటర్లో కొంతమంది వ్యక్తులు చేసిన హంగామా అంతా ఇంతా కాదు. చివరికి పెట్రోలింగ్‌కు వచ్చిన పోలీసులను సైతం లెక్క చేయకపోగా దుర్భాషలాడారు. అంటే భద్రాచలంలో సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటో స్పష్టమవుతుంది. ఇక నివాస ప్రాంతాలలో అయితే ఇటువంటి చర్యలకు అంతు పొంతే లేకుండా పోతుంది. నివాస ప్రాంతాల మధ్య అర్ధరాత్రి వరకు వేడుకలు నిర్వహించడం పిల్లల చదువులకు ఇబ్బందులు కలుగుటమే కాక మహిళలకు వృద్ధులకు కూడా అనేక రకాల సమస్యలను సృష్టిస్తూ ప్రశ్నించిన వారిపై దాడికి సైతం దిగటం పరిపాటయిపోయింది. సోమవారం రాత్రి జరిగిన సంఘటనతో పోలీసులు ఎక్కడైనా మేలుకొని ఇటువంటి విచ్ఛిన్నకర కార్యక్రమాల పట్ల కఠినంగా వ్యవహరిస్తూ ప్రత్యేకించి నివాస ప్రాంతాలలో రాత్రి వేళలో పెట్రోలింగ్ నిర్వహించి ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలకు కోరుతున్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

: నాగరాజు రెడ్డి సిఐ భద్రాచలం టౌన్



శాంతి భద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని పట్టణ సీఐ నాగరాజు రెడ్డి స్పష్టం చేశారు. పుట్టినరోజు వేడుకలు ఎవరింటి వద్ద వారే ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. జన్మదిన వేడుకల సందర్భంగా అర్ధరాత్రిలు రోడ్లపైన కేకులు కట్ చేయడం బైక్ ర్యాలీ నిర్వహించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నివాస ప్రాంతాలలో అసాంఘిక కార్యక్రమాలుకి పాల్పడితే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ప్రజలను కోరారు.

సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలి

: గడ్డం స్వామి సిపిఐ(ఎం) పట్టణ కార్యదర్శి



ప్రజా జీవితానికి ఆటంకాలు కలిగించే ఆకతాయిలో పట్ల పోలీస్ వారు కఠినంగా వ్యవహరించాలి. కొన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, యువకులను ఇటువంటి విచ్ఛినకర ఉత్సవాల వైపు ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. యువకులను సమస్యలపై పోరాడే బాట నుండి పక్కకు తీసుకు వెళ్తూ సరదాల పేరుతో పార్టీల పేరుతో పెడదోర్ని పట్టే విధంగా ప్రోత్సహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులను, యువకులను సన్మార్గంలో పెట్టే బాధ్యత ప్రతి రాజకీయ పార్టీపై ఉందని అభిప్రాయపడ్డారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో పోలీసు వారు యువకులకు కౌన్సిలింగ్ నిర్వహించాలని అదేవిధంగా అవకాశం ఉన్న మేరకు సెమినార్లు నిర్వహించి యువకులను ఉపాధి వైపు పయనించే విధంగా ప్రోత్సహించాలని కోరారు.

నూతన ప్రభుత్వాన్ని స్వాగతిస్తున్నాం

- కేసీఆర్ అహంకారం వల్లే ప్రజలు సాగనంపారు
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు భాస్కర్

నవతెలంగాణ-చింతకాని



రాష్ట్రంలో ఏర్పడిన నూతన ప్రభుత్వాన్ని స్వాగతిస్తున్నామని సిపిఐ(ఎం)రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు భాస్కర్ అన్నారు. మండల కేంద్రంలోని సీపీఐ(ఎం) పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన మండల కమిటీ సమావేశంలో పాలడుగు మాట్లాడుతూ గత బిఆర్ఎస్ పాలకుల మోసపూరిత హామీలు అహంకార దోరనివల్లె ప్రజలు బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని సాగనంపారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలైన రూ.2 లక్షల రైతు రుణమాఫీ, రైతుబంధు పెంపు, రేషన్ కార్డులు, పేదవారికి ఇల్లు, ఇళ్ల స్థలాలు పంపిణీ చేయడంతో పాటు మిగిలిపోయిన పోడు భూముల, పార్ట్ బి సర్వే చేయని భూములను సర్వే చేయించి పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేయాలని కోరారు. నిరుద్యోగ సమస్యలపై ఇచ్చిన హామీలను సత్వరమే అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలను నిరంకుశ పోకడలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ ప్రజా ఉద్యమాలను కొనసాగిస్తామన్నారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి జరగడానికి కావాల్సిన నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు. ప్రజల సమస్యలపై అఖిలపక్షం ఏర్పాటు చేసి అన్ని పక్షాల అభిప్రాయాన్ని తీసుకొని రాష్ట్ర అభివృద్ధికై రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు. కమ్యూనిస్టులు ప్రజల పక్షాన నిలబడి ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజలతోనే ఉంటూ ప్రజా పోరాటాలు కొనసాగిస్తామని అన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, మండల కమిటీ సభ్యులు వత్సవాయి జానకి రాములు, నన్నక కృష్ణమూర్తి, మద్దిన్ని బసవయ్య, వీరబాబు, రాచబంటి రాము, మద్దిన్ని బసవయ్య, పంగా గోపయ్య, దేశబోయిన ఉపేందర్, గడ్డం రమణ, పులి యజ్ఞనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

నవతెలంగాణ-కల్లూరు



పట్టణంలోని శాంతినగర్ లోని యుఈఎం చర్చ్ సభ్యులు నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలకు టీపీసీసీ అధ్యక్షులు బిషప్ సుదర్శనం, కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్ రావు, ఎంపీటీసీ కొండూరి కిరణ్ కుమార్ హాజరై కేక్ కట్ చేసి క్రిష్టియన్ సోదరులకు శుభాకాంక్షలు తెలియ చేశారు.ప్రజలందరూ యేసుక్రీస్తు సూచించిన మార్గము లో ప్రేమ,శాంతి,సమాధానం కిలిగి జీవించాలి అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రెవరెండ్ మానుకొండ కిరణ్ కుమార్, సంఘ పెద్దలు మాతిపోగు రమేష్, సతీష్, పుల్లయ్య, వెంకటేశ్వర్లు, దావీదు శాంతినగర్ ప్రజలు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటిని కలిసిన కట్ల రంగారావు

నవతెలంగాణ-వైరాటౌన్

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డిని ఖమ్మం లోని తన ఇంట్లో టిపిసిసి కార్యదర్శి కట్ల రంగారావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు కట్ల నాగరాజు, కట్ల సంతోష్, నంద్రు నాగరాజు, వేంపటి.రంగారావు, గుత్తికొండ వీరబాబు, రేచర్ల రామారావు, రేచర్ల నాగేశ్వరావు, కంభంపాటి సత్యనారాయణ, యామల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

9 ఇసుక ట్రాక్టర్ల సీజ్

మైనింగ్ ఏడి సంజయ్ కుమార్

నవతెలంగాణ-ముదిగొండ



అక్రమంగా ఇసుకను తరలిస్తే అక్రమార్కులపై కఠినచర్యలు తీసుకుంటామని మైనింగ్ శాఖ ఏడి జి.సంజయ్ కుమార్ హెచ్చరించారు. మండలంలోని గంధసిరి, పెద్దమండవ మున్నేరులో ఇసుక అక్రమంగా తరలిస్తున్న 9 ఇసుక ట్రాక్టర్లను మంగళవారం ఆయన పట్టుకుని సీజ్ చేసి పోలీసులకు అప్పజెప్పారు.ఈసందర్భంగా సంజయ్ కుమార్ మాట్లాడుతూ అక్రమ ఇసుక రవాణాపై ఉక్కు పాదం మోపి, అక్రమ ఇసుక రవాణాదారులను అణిచివేస్తామన్నారు. గంధసిరి, పెద్దమండవ మున్నేరుల నుండి ఇసుక రవాణాకు ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతులు లేవన్నారు. ఆయన వెంట మైనింగ్ శాఖ ఏజి సిద్ధం గంగాధర్, ఆర్ఐ రాజారెడ్డి సిబ్బంది ఉన్నారు.

కమనీయం శ్రీ సుబ్రహ్మణ్య స్వామి కళ్యాణం





- భక్తిశ్రద్ధలతో తిలకించిన భక్తజనం
- భక్తులకు సౌకర్యాలు కల్పించిన "మాగంటి" కుటుంబం

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం పట్టణంలో జూనియర్ కళాశాల సెంటర్లో కొలువై ఉన్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా కన్నుల పండగ లాగా జరిగింది. శ్రీ వల్లి దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం కార్తీక మాస అనంతరం సుబ్రహ్మణ్యేశ్వర షష్టి సందర్భంగా నిర్వహించే కళ్యాణ మహోత్సవం ఈ ఏడాది కూడా ఎటువంటి ఆటంకాలు లేకుండా అశేషంగా హాజరైన భక్తజన సమక్షంలో వైభవపేతంగా ఆలయ అర్చకులు, ట్రస్టు నిర్వాహకులు మాగంటి కుటుంబ సభ్యుల సహాయ సహకారాలతో శాస్త్రబద్ధంగా నిర్వహించారు. ఉదయం 5 గంటల నుండే భారీగా తరలి వచ్చిన భక్తుల సమక్షంలో స్వామివారికి పంచామృతాలతో రుద్రాభిషేకం నిర్వహించిన అర్చకులు మహిళా భక్తులచే నాగదేవతలకు ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించి కళ్యాణ తంతు కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు భైరవభట్ల వెంకటరత్నం ప్రారంభించారు. అనంతరం స్వామివారి పల్లకి సేవను దివంగత మాగంటి సూర్యం మనవడు సాయి సూర్య ప్రత్యక్షంగా పాల్గొని స్వామివారి పల్లకిని మోసి భక్తుల సమక్షంలో ఉత్సాహంగా ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. కళ్యాణానికి తరలి వచ్చిన భక్తులందరికీ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సాయంకాలం భక్తుల సమక్షంలో ఆగమ శాస్త్రం ప్రకారం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవానికి తరలివచ్చిన భక్తులకు ప్రత్యేకించి మహిళా భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా మాగంటి సూర్యం కుటుంబ సభ్యులైన మాగంటి శారద, ప్రసాద్ బాబు దంపతులు మాగంటి సిరి లక్ష్మీ, రమేష్ బాబు దంపతులు దగ్గరుండి ఇటువంటి లోటుపాట్లు జరగకుండా కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అందరికీ తీర్థప్రసాదాలు అందే విధంగా చూడాలన్న మాగంటి సత్య వాణి ఆదేశానుసారం మాగంటి శారద, సిరి లక్ష్మిలు బాధ్యత తీసుకొని దగ్గరుండి అన్ని ఏర్పాట్లను చేశారు. భద్రాచలం పట్టణంలో ఒకవైపు వైకుంఠ ముక్కోటి ఏకాదశి అధ్యయనోత్సవాలు జరుగుతున్న తరుణంలో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం కూడా జరగటంతో ఆలయ పరిసర ప్రాంతాలు మొత్తం ఆధ్యాత్మిక శోభను సంతరించుకునే విధంగా అలంకరించి ఏర్పాట్లను చేశారు.

గ్రీన్ భద్రాద్రి వారి సేవలు అమోఘం

- డాక్టర్ తెల్లం వెంకట్రావు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

గ్రీన్ భద్రాద్రి ఫౌండర్ బొలిశెట్టి రంగారావు ఇంటి వద్ద స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావును గ్రీన్ భద్రాద్రి ప్రముఖులు సన్మానించి మొక్కను బహుకరించారు. ఈ సందర్భంగా తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ గ్రీన్ భద్రాద్రి వారు గత 12 సంవత్సరాల నుండి నిరంతరాయంగా, నిస్వార్థంగా, ఎటువంటి లాభాపేక్ష లేకుండా ప్రజల శ్రేయస్సు కోసం, భావితరాల భవిష్యత్తు కోసం మొక్కలు నాటుతూ, భద్రాచలంలో ఇంతటి వృక్ష సంపదను సమకూర్చడం నిజంగా అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ భద్రాద్రి అధ్యక్షులు బెల్లంకొండ రాంబాబు, కార్యదర్శి శ్రీరంగం సంపత్, ఫౌండర్స్ బొలిశెట్టి రంగారావు, జి రాజారెడ్డి, గౌరవాధ్యక్షులు యోగి సూర్యనారాయణ, మాజీ అధ్యక్షులు జి శివ శంకర్ రావు, పల్లింటి దేశప్ప, డా.గోళ్ళ భూపతి రావు, కామిశెట్టి కష్టార్జునరావ్, ఉపాధ్యక్షులు ఉమాశంకర్ నాయుడు, అబ్రహం, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం

- ఎమ్మెల్యే కూనంనేని

నవతెలంగాణ-సుజాతనగర్

సొసైటీల ద్వారా ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడుతూ ధాన్యానికి మద్దతు ధర పెరిగే విధంగా కృషి చేస్తానని తెలిపారు. రాబోయే కాలంలో మండలాన్ని సుందరంగా తీర్చిదిద్ది అభివృద్ధి పదంలో ముందు వరుసలో ఉంచుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ కంచర్ల చంద్రశేఖర్, టిపిసిసి సభ్యులు నాగ సీతారాములు, సిపిఐ జిల్లా కార్యదర్శి షాబీర్ పాషా, సొసైటీ చైర్మన్ మండే వీర హనుమంతరావు, అధికారులు సిపిఐ కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.



ర్యాగింగ్ కు పాల్పడితే కఠినచర్యలు తప్పవు

- భవిష్యత్తును పాడుచేసుకోకండి : సిఐ కరుణాకర్

నవతెలంగాణ-ఇల్లందు



సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులను పరిచయం పేరుతో వికృతచర్యలకు పాల్పడి, దూషించడం, హేళన చేయడం, ఏడిపించడం భయభ్రాంతులకు గురిచేయడం లాంటి కార్యక్రమాలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని సిఐ కరుణాకర్ హెచ్చరించారు. పట్టణంలోని స్థానిక ప్రభుత్వ గిరిజన బాలల వసతి గృహంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, జాతీయ సేవాపథకం విభాగం ఆధ్వర్యంలో ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ తోర్తి జాన్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ర్యాగింగ్ నిషేధ చట్టం -1997 ప్రకారం సెక్షన్ 4లోపేర్కొనిన విధంగా ఆరు నెలలు జైలు శిక్షపడటంతో రూ. 1000 వరకు జరిమానా ఉంటుందన్నారు. ఎంజాయ్ ముఖ్యము కాదని మీ భవిష్యత్తు ముఖ్యమన్నారు. ఫేస్ లేని ఫేస్బుక్లో మీ అమూల్యమైన సమయాన్ని వ్యర్థం చేసుకోవద్దని సాధ్యమైనంత వరకు సెల్ ఫోన్ కు దూరంగా ఉండాలన్నారు. మూఢ నమ్మకాలు విశ్వసించోద్దని క్రమశిక్షణతో ఉంటూ తల్లిదండ్రులు, సమాజానికి మంచిపేరు తేవాలని ర్యాగింగ్ కు పాల్పడవద్దన్నారు. ఈ కార్యక్రమంలో 14 నంబర్ బస్తి వార్డు మాజీ కౌన్సిలర్ సుదర్శన్ కోరి, ఎస్టి వసతి గృహం వార్డెన్ చందు, బీసీ హాస్టల్ వార్డెన్ రవి, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ విలియం ప్రసాద్, ఎస్టి వసతి గృహ సహాయకులు, సుబ్రహ్మణ్యం,బిసి వసతి గృహ సహాయకులు వినోద్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ తదితరులు పాల్గొన్నారు.

కాలం చెల్లిన మందులు 108లో ఉంచకూడదు

నవతెలంగాణ-ఆళ్ళపల్లి



కాలం చెల్లిన(ఎక్స్పైరీ) మందులను 108 వాహనంలో ఉంచకూడదని సంబంధిత జిల్లా ఆడిటర్ ఫకీర్ దాస్ వాహన సిబ్బందికి సూచించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఆళ్ళపల్లి మండల కేంద్రంలోని నూతన 108 వాహనాన్ని ఆడిటింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబులెన్స్ లోని వైద్య పరికరాలు, రికార్డ్స్ లను పరిశీలించానన్నారు. ఈ.ఎం.టీ, పైలట్ లకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఎప్పటికప్పుడు వైద్య పరికరాలు, రికార్డ్స్ లను అప్డేట్ చేసుకోవాలని తెలిపారన్నారు. ఎప్పటికప్పుడు 108 వాహనాన్ని శుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశానన్నారు. ఆయన వెంట 108 సిబ్బంది ఈ.ఎం.టి ప్రేమలత, పైలెట్లు పరమ సునీల్ కుమార్, పరమ శ్రీహర్ష ఉన్నారు.

ప్రజావాణిలో 5,324 వినతులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణికి అనూహ్య స్పందన లభిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి తమ సమస్యలను చెప్పుకుంటున్నారు. ఇప్పటివరకు రికార్డు స్థాయిలో 5,324 వినతి పత్రాలు అందించారు. ఇందులో 55 శాతం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, 30 శాతం పింఛన్లకు సంబంధించిన వినతి పత్రాలే ఉన్నాయి. మిగిలినవి ఉద్యోగాలు, రెవెన్యూ ఇతర సమస్యల దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు :మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజావాణిలో వచ్చిన అర్జిదారుల సమస్యలను పరిష్కరించటానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రజావాణికి వచ్చిన ప్రతి ఒక్కరి సమస్యను తెలుసుకుని , వారి అర్జీలను తీసుకున్నారు. ప్రతి అర్జికి ఒక నంబర్‌ను కేటాయిస్తున్నట్టు తెలిపారు. అలాగే అర్జిదారుల రిఫరెన్స్ కోసం వారి సెల్ ఫోన్ నంబర్‌కు సంక్షిప్త సందేశం పంపుతున్నట్టు తెలిపారు.

పాత పీఎస్‌లు, పీఆర్వోలకు నో

- సీఎంఓ ఆదేశాలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రులు, వివిధ కార్పొరేషన్ల చైర్మెన్ల వద్ద పీఏలు, పీఎస్‌లు, పీఆర్వోలు, ఓఎస్డీలుగా పనిచేసిన వారెవ్వరినీ తిరిగి విధుల్లోకి తీసుకోవద్దని ముఖ్యమంత్రి కార్యాలయం ఆదేశించింది. వారందర్నీ తొలగించామని పేర్కొంది. ఒకవేళ వారిలో ఎవరినైనా తిరిగి కొనసాగించాలంటే తమ అనుమతి తప్పనిసరి అని స్పష్టం చేసింది. వారిని కాకుండా కొత్తవారినెవరినైనా నియమించుకోదలిస్తే కచ్చితంగా సమాచారం ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో గత ప్రభుత్వంలో పనిచేసిన పీఏలు, పీఎస్‌లు, పీఆర్వోలు, ఓఎస్డీల్లో చాలా మంది కొలువులను కోల్పోనున్నారు.

జ్ఞానవాపి మసీదు కేసులో..

- మసీదు కమిటీ పిటిషన్‌లను తిరస్కరించిన అలహాబాద్ హైకోర్టు

అలహాబాద్ : జ్ఞానవాపి కేసులో మసీదు కమిటీ దాఖలు చేసిన అన్ని పిటిషన్‌లను అలహాబాద్ హైకోర్టు మంగళవారం తిరస్కరించింది. ఈ కేసుపై విచారణను ఆరు నెలల్లోగా ముగించాలని వారణాసి కోర్టుని ఆదేశించింది. ఈ కేసు దేశంలోని రెండు ప్రధాన కమ్యూనిటీలను ప్రభావితం చేస్తుందని, ఆరు నెలల్లోగా తీర్పు ఇవ్వాలని జస్టిస్ రోహిత్ రంజన్ అగర్వాల్ నేతృత్వంలోని ధర్మాసనం ట్రయల్ కోర్టుకు ఉత్తర్వులు జారీ చేసింది. ఆలయాన్ని పునరుద్ధరించాలని కోరుతూ వారణాసి కోర్టులో పెండింగ్‌లో ఉన్న సివిల్ వ్యాజ్యాన్ని సవాలు చేస్తూ దాఖలైన ఐదు పిటిషన్లపై డిసెంబర్ 8న వాదనలు విన్న జస్టిస్ అగర్వాల్ తీర్పును రిజర్వ్ చేశారు.

జ్ఞానవాపి మసీదుపై శాస్త్రీయ సర్వే చేపట్టాలని ఏప్రిల్ 8 2021లో వారణాసి కోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ అంజుమన్ ఇంతిజామియా మస్జిద్ కమిటీ (ఎఐఎంసీ), ఉత్తరప్రదేశ్ సున్నీ సెంట్రల్ వక్ఫ్ బోర్డులు పిటిషన్‌లు దాఖలు చేసిన సంగతి తెలిసిందే.

వారణాసిలోని కాశీ విశ్వనాథ ఆలయాన్ని ఆనుకుని ఉన్న జ్ఞానవాపి మసీదు నిర్వహణను ఎఐఎంసి చూస్తోంది. అయితే జ్ఞానవాపి మసీదు ఆలయంలో భాగమని, ఆ స్థలంలో ఆలయాన్ని పునరుద్ధరించాలని హిందూ పిటిషనర్లు ఆరోపిస్తున్నారు. ప్రార్థనా స్థలాల చట్టం 1991 (ప్రత్యేక నిబంధనలు) ప్రకారం.. 1947 ఆగస్ట్ 15న ఉనికిలో ఉన్న మతపరమైన ప్రదేశాలను మార్చకూడదని ఎఐఎంసీ, యూపీ సున్ని సెంట్రల్ వక్ఫ్ బోర్డ్‌లు వాదిస్తున్నాయి.

అక్రమాస్తుల కేసులో తమిళనాడు మంత్రి దోషి

చెన్నై : అక్రమాస్తుల కేసులో తమిళనాడు ఉన్నత విద్యాశాఖ మంత్రి కె. పొన్ముడిని మద్రాస్ హైకోర్టు మంగళవారం దోషిగా నిర్ధారించింది. ఆయన భార్య పి. విశాలక్షిని కూడా దోషిగా పేర్కొంది. శిక్ష విధించడానికి ముందు గురువారం (డిసెంబర్ 21)న కోర్టులో హాజరుకావాలని ఇరువురిని ఆదేశించింది. 2017లో రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్‌ను జస్టిస్ జి.జయచంద్రన్ అనుమతించారు. విల్లుపురంలోని అవినీతి నిరోధక చట్టం కేసుల్లో 2016, ఏప్రిల్ 18న ప్రత్యేక కోర్టు ఇచ్చిన తీర్పుని కూడా పక్కనపెట్టింది. సీనియర్ న్యాయవాది ఎన్.ఆర్. సుప్రీంకోర్టులో అప్పీలు చేసుకునేందుకు వీలుగా శిక్షను సస్పెండ్ చేయాలని జడ్జిని కోరారు. ఈ పిటిషన్‌ను డిసెంబర్ 21న విచారిస్తామని చెప్పారు. 2006 ఏప్రిల్ 13 మరియు 2010 మార్చి 31 మధ్య కాలంలో నిందితులు రూ.1.79 కోట్ల అక్రమాస్తులను కూడబెట్టినట్టు ప్రాసిక్యూషన్ పేర్కొంది.

ఎంపీలకు వివరణ కోరే హక్కు ఉంది

- శరద్ పవార్



న్యూఢిల్లీ : ప్రతిపక్ష ఎంపీలకు వివరణ కోరే హక్కు ఉందని నేషనల్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) అధ్యక్షుడు శరద్ పవార్ పేర్కొన్నారు. ఎంపీల సస్పెన్షన్‌ను ఖండిస్తూ మంగళవారం రాజ్యసభ చైర్మెన్ జగదీప్ ధన్కర్‌కి లేఖ రాశారు. పార్లమెంటు భద్రతపై వివరణ కోరేందుకు ఎంపీలకు చట్టబద్ధమైన హక్కు ఉందని స్పష్టం చేశారు. ఈ నిర్ణయం జవాబు దారీ తనం, పారదర్శకత సూత్రాలకు విరుద్ధంగా ఉందని అన్నారు. ఎంపీల ఆందోళనలు ఘటన తీవ్రతను ప్రతిబింబి స్తున్నాయని లేఖలో పేర్కొన్నారు. పార్లమెంటు సభ్యులు వివరణ కోరడం సాధారణమేనని, ఈ సమస్యను ఎలా పరిష్కరించాలనే దానిపై ప్రభుత్వం ప్రకటన చేయాలని లేఖలో పేర్కొన్నారు. కానీ ప్రభుత్వం ప్రకటన చేయకుండా ఆందోళన చేపట్టిన ఎంపీలను సస్పెండ్ చేయడం సరికాదని అన్నారు. ఆందోళనలో పాల్గొనని సభ్యులను కూడా సస్పెండ్ చేశారని ఎత్తి చూపారు. ఇవి వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలకు ముందు నిర్వహిస్తున్న చివరి సమావేశాలు కావడం గమనార్హం. పార్లమెంటులో భద్రతా వైఫల్యంపై కేంద్రం హోం మంత్రి అమిత్‌షా వివరణనివ్వాలంటూ గత వారంరోజులుగా ప్రతిపక్ష ఎంపీలు ఆందోళన చేపడుతున్న సంగతి తెలిసిందే.

ఈజిప్టు అధ్యక్ష ఎన్నికల్లో సిసికే పట్టం

- 89.6 శాతం ఓట్లతో గెలుపు



కైరో : ఈజిప్టు అధ్యక్ష ఎన్నికల్లో ప్రస్తుత అధ్యక్షులు అబ్దెల్-ఫత్తా అల్-సిసి ఘన విజయం సాధించారు. 2024 అధ్యక్ష ఎన్నికల్లో పోలైన ఓట్లలో సిసి సుమారు 40 మిలియన్ల ఓట్లు లేదా 89.6 శాతం ఓట్లతో విజయం సాధించినట్లు ఈజిప్ట్ నేషనల్ ఎలక్షన్ అథారిటీ (ఎన్ఇఎ) ప్రకటించింది. కైరోలో విలేకరుల సమావేశంలో ఎన్ఇఎ చైర్మెన్ హజెమ్ బదావీ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో స్వదేశంలో, విదేశాలలో దాదాపు 44.8 మిలియన్ల మంది ఓటు వేశారని, మొత్తం 67 మిలియన్ల మంది అర్హులైన ఓటర్లలో 66.8 శాతం పోలింగ్‌లో పాల్గొన్నారని, ఇది ఈజిప్ట్ చరిత్రలోనే అత్యధిక పోలింగ్ శాతమని తెలిపారు. రిపబ్లికన్ పీపుల్స్ పార్టీకి నాయకత్వం వహిస్తున్న హజెమ్ ఒమర్ 4.5 శాతం ఓట్లు సాధించగా, ఈజిప్షియన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీకి చెందిన ఫరీద్ జహ్రాన్, ఈజిప్షియన్ వాఫ్డ్ పార్టీకి చెందిన అబ్దెల్-సనాద్ యమామా తర్వాతి స్థానాల్లో నిలిచారు.

ఎన్నికల ఫలితాల ప్రకటన తర్వాత జాతిని ఉద్దేశించి సిసి ప్రసంగించారు. 'దేశానికి నాయకత్వం వహించే లక్ష్యం కోసం నన్ను ఎన్నుకున్నారు' అని తెలిపారు. ప్రస్తుతం ఈజిప్టు అనేక సవాళ్లతో పోరాడుతోందని అన్నారు. గాజాపై ఇజ్రాయిల్ దాడులు 'ఈజిప్ట్ యొక్క జాతీయ భద్రతకు' ముప్పుగా మారాయని అన్నారు. అయితే జాతీయ భద్రత, ప్రజల ప్రయోజనాలను రక్షించే, ఆర్థిక సామర్థ్యాలను ఈజిప్టు కలిగిఉందని కూడా తెలిపారు. ఈజిప్టు అధ్యక్ష ఎన్నికల ఓటింగ్ స్వదేశంలో ఈ నెల 10, 12 తేదీల్లో జరగా, విదేశాల్లో ఉన్న ఈజిప్షియన్లు ఈనెల 1-3 తేదీల్లో ఓట్లు వేశారు. 121 దేశాల్లో పోలింగ్ జరిగింది.

ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలతో ఫిబ్రవరిలో

'పార్లమెంటు మార్చ్'

రైతు వ్యతిరేక బీజేపీ సర్కారుపై పెద్ద ఎత్తున ప్రచారం

దేశంలో రైతు ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తాం : ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ విజ్జూ కృష్ణన్ పిలుపు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

దేశంలో రైతు ఉద్యమాలను ఉధృతం చేస్తామని అఖిలభారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ విజ్జూ కృష్ణన్ చెప్పారు. దేశ వ్యాప్తంగా ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలతో ఫిబ్రవరిలో 'పార్లమెంటు మార్చ్' నిర్వహిస్తామన్నారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నదని చెప్పారు. కార్పొరేట్ అనుకూలం విధానాలపై ప్రజాసంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహిస్తామన్నారు. వరల్డ్‌కప్‌లో సెమీఫైనల్ దాకా వచ్చి భారత్ ఫైనల్‌లో ఓడిపోయిందనీ, ఇటీవల మూడు రాష్ట్రాల్లో గెలిచిన బీజేపీని అదే తరహాలో ఇండియా కూటమిగా ఫైనల్ ఎన్నికల్లో ఓడిస్తామన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కమిటీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతన్నకి అనేక హామీలు ఇచ్చిందన్నారు. అందులో స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం రైతులు పెట్టిన పెట్టుబడికి 50శాతం కలిపి కనీసం మద్దతు ధర నిర్ణయిస్తాం.విత్తనాలు, ఎరువులు సబ్సిడీతో తక్కువ ధరకు ఇస్తాం.పంట నష్టం జరిగితే ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా పరిహారం చెల్లిస్తాం. తక్కువ వడ్డీతో పంట రుణం ఇస్తాం' అనే హామీలనిచ్చిందని గుర్తు చేశారు. పదేండ్లలో ప్రభుత్వ లెక్కల ప్రకారం లక్ష మందికి పైగా రైతులు వ్యవసాయ కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. ఇదే కాలంలో మూడు లక్షల మంది వలస కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారని అన్నారు. 50వేల మంది నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఈ లెక్కల్లో కౌలు రైతులు, మహిళలు, కార్మికుల, నిరుద్యోగుల లెక్కలు నిర్దిష్టంగా లేవని చెప్పారు. పత్తి పంట తెలంగాణలో చూస్తే ఒక క్వింటాల్‌కు పదివేలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధిక వర్షాలు, కరువు కారణంగా రైతులు లక్షల ఎకరాల్లో పంట నష్టపోయారని తెలిపారు. తెలంగాణలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వ ఈ సమస్యలపై స్పందించాలని కోరారు. దేశంలో ప్రజాస్వామ్యంపై దాడి మరింత పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మీడియా గొంతు నొక్కే ప్రయత్నం జరుగుతున్నదని చెప్పారు. దేశంలో ఫాసిస్ట్ శక్తులకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్ మాట్లాడుతూ డిసెంబర్ 4 నుంచి 7 మధ్య మిగ్జాంగ్ తుఫాను వల్ల 4.75 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు.

కొత్తగా ఎన్నికైన ప్రభుత్వ కూడా ఎలాంటి పరిహారం చెల్లించలేదన్నారు. రైతు భరోసా నిధులను తక్షణమే విడుదల చేయాలని కోరారు. సమావేశంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి, నంద్యాల నర్సింహారెడ్డి, ప్రొఫెసర్ అరిబండి ప్రసాదరావు, బొంతల చంద్రారెడ్డి, మాదినేని రమేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, శెట్టి వెంకన్న, సహాయ కార్యదర్శి కందాల ప్రమీల, మూడ్ శోభన్, కున్నరెడ్డి నాగిరెడ్డి, అన్నవరపు సత్యనారాయణ, డి. బాల్‌రెడ్డి, ఎం శ్రీనివాసులు, బాలరాజు గౌడ్, పల్లపు వెంకటేష్, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, బండ శ్రీశైలం, కందాల శంకర్‌రెడ్డి, అశోక్, యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు ఉద్యమానికి రూ.లక్ష విరాళం

రైతు ఉద్యమానికి ఖమ్మం జిల్లా రైతు సంఘం సీనియర్ నేత రాయల వెంకటేశ్వరరావు లక్ష రూపాయల విరాళం ఇచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎస్వీకేలో నిర్వహించిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జూ కృష్ణన్, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పోతినేని సుదర్శన్‌రావు, టి. సాగర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు విజ్జూ కృష్ణన్ అభినందనలు తెలిపారు. సీనియర్ రైతు నేత రాయల వెంకటేశ్వరరావుకు ఏఐకేఎస్ అభినందనలు

2008 సంక్షోభ స్థాయిని మించిన కార్పొరేట్ దివాళాలు

ఫైనాన్షియల్ టైమ్స్



ప్రపంచ కార్పొరేట్ రంగం గత దశాబ్దాలలో కనీవినీ ఎరుగని స్థాయిలో రెండంకెల వేగంతో దివాళాలను చవిచూస్తోందని జాతీయ గణాంకాలను ఉదాహరిస్తూ ఫైనాన్షియల్ టైమ్స్ తెలిపింది. అమెరికాలో సంవత్సరం తరువాత సంవత్సరం కార్పొరేట్ దివాళాలు పెరుగుతున్నాయి. గత 12 నెలల కాలంలో ఈ దివాళాలు అంతకు ముందటి సంవత్సరంతో పోల్చినప్పుడు 30 శాతం పెరగగా, ఐరోపాలో అత్యంత పెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన జర్మనీలో జనవరి- సెప్టెంబర్ మధ్యకాలంలో అంతకు ముందు సంవత్సరం అదే కాలంతో పోల్చినప్పుడు కార్పొరేట్ దివాళాలు 25 శాతం పెరిగాయి.

ఐరోపా ఖండంలో సెప్టెంబర్ ముందటి 9 నెలల కాలంలో కార్పొరేట్ దివాళాలు 13 శాతం పెరిగాయి. గత 8 సంవత్సరాలలో ఇదే అత్యధిక శాతం. అక్టోబర్‌లో గత సంవత్సరం అదే నెలతో పోల్చినప్పుడు దివాళాలు 30శాతం పెరిగాయి. ఆర్గనైజేషన్ ఆఫ్ ఎకనామిక్ కో ఆపరేషన్ అండ్ డెవలప్మెంట్ (ఓఇసిడి) గ్రూపులోని సంపన్న దేశాలలో నోర్డిక్ దేశాలైన డెన్మార్క్, స్వీడెన్, ఫిన్లాండ్‌లతోసహా కార్పొరేట్ కంపెనీలు 2008 నాటి ప్రపంచ ఆర్థిక సంక్షోభం నాటికంటే ఎక్కువగా దివాళా తీశాయి. ఇంగ్లాండ్, వేల్స్‌లలో కూడా వర్తమాన సంవత్సరంలోని జనవరి- సెప్టెంబర్ మధ్యకాలంలో కార్పొరేట్ దివాళాలు 2009 స్థాయిని దాటిపోయాయి. ఇలా జరగటానికి వడ్డీ రేట్లు అధికంగా ఉండటం, కోవిడ్ కాలంలో ప్రభుత్వాల మద్దతుతో బ్రతికి బయటపడిన జోంబీ కంపెనీలను లిక్విడేట్ చేయటం కారణమని "క్యాపిటల్ ఎకనామిక్స్"లో చీఫ్ ఎకనామిస్టుగావున్న నీల్ షియరింగ్ ఫైనాన్షియల్ టైమ్స్‌కి చెప్పాడు. కోవిడ్ కాలంలో ప్రవేశపెట్టిన పెద్ద ఎత్తున మద్దతునిచ్చే స్కీముల ను ప్రభుత్వాలు ఉపసంహరించటం, పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని అరికట్టేందు కోసం కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లను పదేపదే పెంచటంవల్ల కార్పొరేట్ దివాళాలు వేగవంతం అయ్యాయి. కేంద్ర బ్యాంకులు వడ్డీరేట్లను ఇకపై పెంచకపోయినప్పటికీ చాలా కార్పొరేట్ కంపెనీలకుగల అప్పులను తీర్చటానికి ఎక్కువ వడ్డీతో తిరిగి అప్పుచేయవలసిన పరిస్థితి ఏర్పడి కార్పొరేట్ కంపెనీలు దివాళా తీసే ధోరణి కొనసాగుతుందని నీల్ షియరింగ్ ఫైనాన్షియల్ టైమ్స్‌కి చెప్పాడు.

చైతన్యపురిలో డ్రగ్స్ పట్టివేత


- ఇద్దరి అరెస్ట్



నవతెలంగాణ-చైతన్యపురి

గోవా నుంచి హైదరాబాద్‌కు గుట్టు చప్పుడు కాకుండా డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్న ఇద్దరిని చైతన్యపురి పోలీస్టేషన్ పరిధిలో పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన కునప రాజు హైదరాబాద్‌లోని గాజులరామారం ద్వారకానగర్ కాలనీలో నివాసమంటూ ప్రయివేటు ఉద్యోగం చేస్తున్నాడు. గాజుల రామారం హెచ్ఏఎల్ కాలనీకి చెందిన శ్యామ్‌రాయ్ కూడా ప్రయివేటు ఉద్యోగం చేస్తున్నాడు. వీరిద్దరూ కలిసి గోవా నుంచి డ్రగ్స్ తీసుకొచ్చి చైతన్యపురిలో మంగళవారం విక్రయిస్తుండగా ఎల్బీనగర్ ఎస్ఓటీ పోలీసులు పట్టుకొని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఎండీఎంఏ(5) డ్రగ్, ఎల్ఎస్‌డి(4) బ్లాట్స్‌లను, రెండు సెల్ ఫోన్‌లను సీజ్ చేశారు. గోవాకు చెందిన మరో నిందితుడు హబీబ్ పరారీలో ఉన్నాడు.

కృత్రిమ మేధతో జైలు నుంచే ప్రసంగించిన పాకిస్తాన్ మాజీ ప్రధాని



ప్రస్తుతం జైలులోవున్న పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ తమ మద్దతుదారుల ముందు ఉపన్యాసించటానికి కృత్రిమ మేధను ఉపయోగించారు. సోషల్ మీడియా వేదికలైన ఫేస్‌బుక్, ఎక్స్(గతంలో ట్విట్టర్),యుట్యూబ్‌లలో వర్చువల్‌గా సమావేశమైన 45లక్షల మద్దతు దారుల ముందు 4 నిమిషాలపాటు ఇమ్రాన్ ఖాన్ ప్రసంగించారు. ఇమ్రాన్ ఖాన్ మే నెలలో అరెస్టైన తరువాత పాకిస్తాన్ ప్రభుత్వం ఆయన నాయకత్వంవహిస్తున్న తెహరీక్- ఎ-ఇన్సాఫ్ (పిటిఐ) సమావేశాలను నిషేధించింది. పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ప్రభుత్వానికి వచ్చిన బహుమతులను అమ్మాడనే పేరుతో ఆయనకు 3 సంవత్సరాల జైలు శిక్షను విధించారు. ఇదే కాక అనేక ఇతర ఆరోపణలు ఇమ్రాన్ పై మోపారు. ఇవన్నీ రాజకీయ ప్రేరేపితమని 71 ఏండ్ల ఇమ్రాన్ ఖాన్ ఖండించారు. ఒక పేపర్‌పై తను ఉపన్యాసించ వలసిన విషయాన్ని రాసి తన వకీళ్ళ ద్వారా పిటిఐ పార్టీ ప్రతినిధులకు ఇమ్రాన్ పంపారు. ఎలెవెన్ లాబ్స్ అనే కృత్రిమ మేధతో పనిచేసే సంస్థ ఆ ఉపన్యాసాన్ని ఇమ్రాన్ ఖాన్ "వాయిస్ క్లోన్" ద్వారా డబ్ చేసి ప్రసారం చేసింది. పాకిస్తాన్ ప్రభుత్వం తన పార్టీ కార్యకర్తలను కిడ్నాప్ చేస్తోందని, ఇబ్బందులు పెడుతోందని ఇమ్రాన్ ఖాన్ తన సందేశంలో ఆరోపించారు. ప్రభుత్వ నిర్బంధాలను అధిగమించి తన పార్టీ సోషల్ మీడియా "ఈ చారిత్రక ప్రయత్నం" చేయటం తనకు నిజమైన స్వేచ్ఛ కోసం పోరాడటానికి స్ఫూర్తినిస్తుందని ఆయన అన్నారు. అయితే ఆదివారం పాకిస్తాన్‌లో చాలాచోట్లలో సోషల్ మీడియా అందుబాటులో లేకుండాపోయింది. దీనికి "ఇంటర్నెట్ సెన్సార్షిప్" కారణమని పిటిఐ పార్టీ ప్రతినిధులు ఆరోపించారు. గత సంవత్సరం తనను పదవి నుంచి తొలగించటానికి జరిగిన కుట్ర వెనుక అమెరికా ప్రమేయం ఉందని ఇమ్రాన్ ఖాన్ ఆరోపించారు. అలా ఇమ్రాన్ చేసిన ఆరోపణను ప్రభుత్వ రహస్యాలను చట్ట విరుద్ధంగా బయటపెట్టటంతో సమానమని ఒక ప్రత్యేక కోర్టు రూలింగ్ ఇచ్చింది. అమెరికాలో పాకిస్తాన్ రాయబారిగా పనిచేసిన అసద్ మజీద్ ఖాన్ 2022 మార్చిలో అమెరికా విదేశాంగ శాఖకు చెందిన ఇద్దరు అధికారులతో మాట్లాడిన తరువాత ఒక డిప్లొమాటిక్ కేబుల్‌ని పంపారు. ఇమ్రాన్ ఖాన్ పశ్చిమ దేశాల అనుకూల వైఖరిని తీసుకోకపోవటం తమను బాధకు గురిచేసిందని ఆ కేబుల్‌లో ఉంది. ఇమ్రాన్ ఖాన్‌ను అవిశ్వాస తీర్మానంతో ఓడించి పదవీచ్యుతుడిని చేస్తే అంతా సర్దుకుంటుందని అమెరికా అధికారులు చెప్పినట్టు పాకిస్తాన్ రాయబారి మజీద్ ఖాన్ తన కేబుల్‌లో రాశాడు. పాకిస్తాన్ రాయబారి అమెరికా విదేశాంగ శాఖ అధికారులతో మాట్లాడిన తరువాత నెల రోజుల్లో ఇమ్రాన్ ఖాన్‌ను పదవి నుంచి తొలిగించారు. ఆ తరువాత పాకిస్తాన్‌లో నిరసన ప్రదర్శనలు పెల్లుబికాయి. తాము పాకిస్తాన్ మీద ఎటువంటి ఒత్తిడి తీసుకురాలేదని అమెరికా చెప్పినప్పటికీ జులైలో అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎమ్ఎఫ్) 3 బిలియన్ డాలర్ల ఉద్దీపనను పాకిస్తాన్‌కు అందించటానికి కారణం అమెరికా తన పలుకుబడిని ఉపయోగించటమేనని ఇంటర్ సెప్ట్ రాసింది.

కోతిని తప్పించబోయి ఆటో బోల్తా..

- ప్రమాదంలో మహిళ మృతి
- ఐదుగురికి తీవ్ర గాయాలు



నవతెలంగాణ - వేములవాడ రూరల్


కోతిని తప్పించబోయి ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందింది. మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలంలోని పోశెట్టిపల్లెలో గురువారం జరిగింది. చింతల్ ఠానా గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు ప్రతిరోజూ పనులకోసం ఆటోలో వెళ్తుంటారు. మంగళవారం కూడా ఆటోలో బయలుదేరారు. మార్గమధ్యలో ఆటోకు కోతి అడ్డురావడంతో డ్రైవర్ తప్పించబోగా అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో చింతల్ ఠానాకు చెందిన మల్లవ్వ(45) అక్కడికక్కడే మృతిచెందింది. ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్పందించిన స్థానికులు 108 అంబులెన్స్‌కు,పోలీసులకు సమాచారం అందించి, గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

లోక్‌సభ ఎన్నికలకు కాంగ్రెస్ 'స్కెచ్'

ఇప్పటికే ఇన్‌చార్జీల నియామకం

బీఆర్ఎస్ అవినీతి, అక్రమాలపై నజర్

- అసెంబ్లీ వేదికగా గులాబీ పాలనను ఎండగట్టే వ్యూహం





(ఫైల్)

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి, కాంగ్రెస్ పార్టీకి వచ్చే పార్లమెంటు ఎన్నికలు కీలకం కానున్నాయి. సర్కారుతోపాటు ఏఐసీసీ అధిష్టానం తీసుకుంటున్న చర్యలు దీన్ని బలపరుస్తున్నాయి. ఏఐసీసీ రాష్ట్రంలోని 17 లోక్‌సభ నియోజకవర్గాలకు ఇప్పటికే ఇన్‌చార్జ్‌లను ప్రకటించిన సంగతి తెలిసిందే. సీఎంతోపాటు మంత్రులు, మరో ఇద్దరు సీనియర్ నేతలకు సైతం బాధ్యతలు అప్పగించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చి తర్వాత సార్వత్రిక ఎన్నికలు ఎప్పుడైనా జరగొచ్చు. ఏప్రిల్, మే లోగా ఎన్నికలు పూర్తవుతాయి.కేంద్రంలోనూ కొత్త ప్రభుత్వం రానుంది. ఇందుకోసం కాంగ్రెస్ అధిష్టానం వేగంగా చర్యలు చేపడుతున్నది. దక్షిణాదిలో కర్నాటక, తెలంగాణ రాష్ట్రాలపై ఎక్కువగా ఆశలుపెట్టుకున్నది. ఆంధ్రప్రదేశ్‌లోనూ అసెంబ్లీతోపాటు లోక్‌సభ ఎన్నికల్లో సత్తాచాటాలని భావిస్తున్నది. ఈమేరకు బలమైన నేతలను ఆ రాష్ట్రానికి ఇన్‌చార్జీగా వేసే ప్రయత్నాల్లో ఉన్నట్టు తెలిసింది. తెలంగాణలోని 17 లోక్‌సభ నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టిసారించింది. ప్రతి చిన్న అంశంపై కాంగ్రెస్ సూక్ష్మంగా ఆలోచిస్తూ నిర్ణయాలు తీసుకుంటున్నది. తెలంగాణ సీఎంతోపాటు మంత్రులు, వారికి కేటాయించిన శాఖల్లోనూ సమస్యలు రాకుండా చూసుకుంది. విస్తరణలోనూ ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తపడుతున్నదనే వ్యాఖ్యానాలు ఇస్తున్నాయి. గులాబీ సర్కారు హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలను ప్రజల్లో చర్చ చేయడం ద్వారా పైచేయి సాధించాలని సీఎం రేవంత్, ఆయన మంత్రివర్గ సహచరులు భావిస్తున్నారు.

ప్రధానంగా కాళేశ్వరం అవినీతి, విద్యుత్ అప్పులు, టిఎస్‌పీఎస్సీ అవకతవకలపై కచ్చితంగా శ్వేతపత్రాలు విడుదల చేయాలనే నిర్ణయానికొచ్చినట్టు తెలిసింది. ఆమేరకు అసెంబ్లీ వేదికగా, బయట కూడా వాటిపై చర్చ నడుపుతున్నది. మీడియాలోనూ విస్తృత ప్రచారం వచ్చేలా కొత్త బాధ్యతల్లోకి వచ్చిన మంత్రులు ప్రయత్నాలు చేస్తున్నారు. మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ తప్పిదాలను మంత్రులంతా అధ్యయనం చేసి అసెంబ్లీకి రావాలని సీఎం రేవంత్ ఇప్పటికే మౌఖిక ఆదేశాలు ఇచ్చారు. దీంతో మంత్రులంతా ఆమేరకు సన్నద్ధమవుతున్నట్టు సమాచారం. అయితే సర్కారును ఎదుర్కొనేందుకు బీఆర్ఎస్ సీనియర్ నేతలు హరీశ్‌రావు, కేటీఆర్‌లు సైతం గత రెండు రోజులుగా సమాలోచనలు చేసుకుంటూ అధ్యయనంలో మునిగిపోయినట్టు తెలంగాణ భవన్ వర్గాలు చెబుతున్నాయి. అసెంబ్లీలో కాంగ్రెస్‌ను సమర్థంగా ఎదుర్కొనేందుకు వ్యూహరచన చేస్తున్నారు. నేపథ్యంలో బుధ, గురువారాల్లో జరిగే అసెంబ్లీ కాస్త యుద్ధక్షేత్రాన్ని తలపించే అవకాశం లేకపోలేదు. శాసనసభ ద్వారా ప్రజల్లోకి బీఆర్ఎస్ అవినీతి, అక్రమాలను తీసుకుపోగలిగితేనే వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రయోజనం కలుగుతుందని పార్టీ సీనియర్ నేతలు చెబుతున్నారు. ఇదిలావుండగా ఇప్పటికే కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపిక దాదాపు పూర్తయినట్టు సమాచారం. బీఆర్ఎస్‌ను బీజేపీకి ధీటుగా బలమైన అభ్యర్థులను నిలబెట్టడం ద్వారా తమ సత్తా చాటాలనే తలంపుతో కాంగ్రెస్ ఉంది. 2019 ఎన్నికల్లో మాదిరిగానే బీజేపీ, బీఆర్ఎస్‌ను దెబ్బకొట్టేందుకు అవసరమైతే ఆర్థిక, అంగబలమున్న బలమైన ఎమ్మెల్యేలను రాజీనామా చేయించైనా లోక్‌సభ స్థానాలు సాధించాలనే గట్టి తలంపు కాంగ్రెస్‌లో ఉన్నట్టు గాంధీభవన్‌వర్గాల్లో చర్చసాగుతోంది.



అంతరిక్షంలో ఆమెకు ఎంపికలు అవసరం

అందరూ నడిచే దారిలో నడిస్తే అందులే ప్రత్యేకం ఏముంది. అతి తక్కువ మంది ఎంచుకునే చోటుకు బాటలు వేస్తే మనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. అలాంటి మార్గాన్నే ఎంచుకుంది ఈ గైనకాలజిస్ట్. 'స్పేస్ గైనకాలజిస్ట్'గా పిలువబడే డాక్టర్ వర్షా జైన్... అంతరిక్షంలో స్త్రీల శరీరాలు ఎలా స్పందిస్తాయో ప్రత్యేకంగా సూక్ష్మ గురుత్వాకర్షణలో రుతుక్రమ ప్రభావాలను అధ్యయనం చేస్తూ తన ప్రత్యేకతను చాటుకుంటుంది. ఆ వివరాలేంటే ఈ రోజు మానవిలో చూద్దాం...

అంతరిక్ష ప్రయాణం వ్యోమగామి ఆరోగ్యాన్ని స్వల్ప, దీర్ఘకాలికంగా ప్రభావితం చేస్తుంది. అనువైన ఆహారం, కఠినమైన వ్యాయామం చేసినప్పటికి తక్కువ గురుత్వాకర్షణ వాతావరణంలో ఎక్కువ సమయం గడపడం వల్ల కండరాలు, ఎముక ద్రవ్యరాశి కోల్పోతుంటారు. అలాగే బరువు తగ్గడం, కంటి చూపు లోపాలు, రోగనిరోధక వ్యవస్థలో మార్పులు వంటి అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. ఇవి వ్యోమ గాములందరూ ఎదుర్కొనేవే. అయితే మహిళా వ్యోమగాములకు అదనపు సవాలు ఉంటుంది. అదే రుతుస్రావం.

మహిళా వ్యోమగాముల కోసం

ప్రస్తుతం ఎడిన్‌బర్గ్ విశ్వవిద్యాలయంలో పిహెచ్‌డి చదువుతున్న డాక్టర్ వర్షా దీనిపై ఎన్నో పరిశోధనలు చేస్తున్నారు. 'స్పేస్ గైనకాలజిస్ట్'గా పిలవబడే వర్షా అంతరిక్షంలో స్త్రీల శరీరాలు ఎలా స్పందిస్తాయో అధ్యయనం చేస్తున్నారు. ప్రత్యేకించి సూక్ష్మ గురుత్వాకర్షణలో రుతుక్రమ ప్రభావాలను పరిష్కరించడంలో, దాన్ని దాటవేయాలనుకునే మహిళా వ్యోమగాములకు అవసరమైన పరిష్కారాలను అందించడంలో నిమగ్నమై ఉన్నారు. 'ఆమె అధ్యయనాల ప్రకారం మహిళలు అలా ఎంచుకుంటే అంతరిక్షంలోనూ రుతుక్రమం జరిగేలా చేసుకోవచ్చు. రుతు చక్రాలు మెదడు నుండి విడుదలయ్యే హార్మోన్లచే నియంత్రించబడతాయి, గర్భాశయంపై పని చేసే అండాశయాలపై పనిచేస్తాయి, ఆ మార్గం ప్రభావితం కాదు' ఆమె చెబుతున్నారు.



వ్యక్తిగత ఎంపిక

మహిళా వ్యోమగాములు అంతరిక్షంలో రుతుక్రమం వచ్చినా ఇబ్బందులు పెద్దగా వుండవని వర్షా చెబుతున్నారు. అయితే చాలా మంది వివిధ కారణాల వల్ల అలా చేయడానికి ముందుకు రావడం లేదు. ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్‌లో రెండు టాయిలెట్లు ఉన్నాయని, నీటి వ్యర్థాలను చాలాసార్లు రీసైకిల్ చేసి తాగునీరుగా ఉపయోగిస్తున్నారని ఆమె చెప్పారు. అయితే రక్తం ఘన పదార్థంగా పరిగణించబడుతుంది. అందువల్ల రక్తంతో కలిపిన నీటి వ్యర్థాలను డంప్ చేయాలి. దానిని రీసైకిల్ చేయడం సాధ్యం కాదు. అదనంగా సున్నా-గురుత్వాకర్షణ వాతావరణంలో నీరు ప్రవహించనందున మహిళా వ్యోమగాములు అంతరిక్షంలో స్నానం చేయడం సాధ్యం కాదు. స్పేస్‌వాక్ సమయంలో వారు తమ శానిటరీ ఉత్పత్తులను మార్చే అవకాశం ఉంటుంది. పైగా 8 నుండి 10 గంటల పాటు వారి పరికరాలను ధరించాలి. అందుకే అంతరిక్షంలో మహిళలు పీరియడ్స్ రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

రక్తం గడ్డకట్టకుండా...

వ్యోమగాములు పీరియడ్స్ రాకుండా సాధారణంగా నోటి గర్భనిరోధక మాత్రలు తీసుకుంటారు. 'వారు వరుసగా మూడు వారాల పాటు గర్భనిరోధక మాత్రలు తీసుకోవాల్సి వుంటుంది. అయితే అంతరిక్షంలో రుతుక్రమం రాకూడదనుకునే వ్యోమగాములు ఈ మాత్రలను నిరంతరం తీసుకోవాలి, సాధారణ రక్తస్రావం వారాన్ని దాటవేయాలి' అని ఆమె అంటున్నారు. 2013లో జరిగిన ఓ సమావేశంలో వర్షా మహిళా వ్యోమగామి ఆరోగ్యంపై దృష్టి సారించిన పరిశోధకులను కలిశారు. మహిళా వ్యోమగాములలో రక్తం గడ్డకట్టే ప్రమాదాన్ని తగ్గించడానికి సురక్షితమైన మాత్ర గురించి ఆమె అడిగారు. కంబైన్డ్ ఓరల్ కాంట్రాసెప్టివ్స్ వాడకం రక్తం గడ్డకట్టే ప్రమాదాన్ని రెట్టింపు చేస్తుందని తెలిసినప్పటికీ, అంతరిక్షంలో గడ్డకట్టే ప్రమాదం ఎక్కువగా ఉందనే ప్రశ్న వర్షా ఈ అంశంపై మరింత అధ్యయనం చేయడానికి పురికొల్పింది. 2016లో వ్యోమగాములకు పీరియడ్స్ ఆపివేయడానికి ఏమి ఇవ్వబడుతుందనే దానిపై ఆమె పరిశోధన చేయడం ప్రారంభించారు. హార్మోన్ల మాత్రలు వాడుతున్నట్టు ఆమె కనుగొన్నారు. 'రుతుస్రావం ఆపుకునేందుకు ఇది ఉత్తమ మార్గం' అని ఆమె చెప్పారు. అయితే దీనితో పాటు మిరెనా అని పిలువబడే ఇంట్రా-యూటెరైన్ హార్మోన్ల పరికరం వంటి ఇతర ఎంపికలు కూడా ఉన్నాయని ఆమె చెప్పారు.

వారికి ఎంపికలు అవసరం

'మిరెనా గర్భం లోపల ఉంటుంది. కాయిల్‌పై ఉన్న హార్మోన్ గర్భాశయ లైనింగ్ పెరగకుండా ఆపుతుంది. రక్తస్రావ భారాన్ని తగ్గిస్తుంది. చాలా మంది మహిళల్లో ఇది పీరియడ్స్ రాకుండా పూర్తిగా ఆపగలుగుతుంది' అని వర్షా అంటున్నారు. లాంగ్-యాక్టింగ్ రివర్సిబుల్ కాంట్రాసెప్టివ్ అని పిలువబడే మరొక ప్రత్యామ్నాయం కూడా ఉందని ఆమె చెప్పారు. ఇది హార్మోన్ల ఇంప్లాంట్. ఇది చేయి చర్మం కింద ఉంచబడుతుంది. నెమ్మదిగా రుతుస్రావాన్ని వాయిదా వేసే హార్మోన్లను విడుదల చేస్తుంది. ప్రాథమిక అధ్యయనం తర్వాత 48 వ్యోమగామి విమానాలపై వర్షా చేసిన తదుపరి పరిశోధనలో స్త్రీ వ్యోమగాములలో గర్భనిరోధక వాడకంతో, నోటి గర్భనిరోధకాలతో అంతరిక్ష ప్రయాణంలో రక్తం గడ్డకట్టే ప్రమాదం ఉన్నట్లు ఎటువంటి ఆధారాలు కనుగొనబడలేదు. కాబట్టి మహిళా వ్యోమగాములు అంతరిక్షంలో రుతుస్రావాన్ని ఆపడానికి హార్మోన్ల గర్భనిరోధకాలను తీసుకోవచ్చు. అయితే వారు ఎంచుకోవడానికి ఎంపికలు కచ్చితంగా ఉండాలని ఆమె చెప్పారు. 'మహిళలుగా మనకు ఒక ఎంపిక ఉండాలి. మన కోసం మనం ఆ ఎంపిక చేసుకోగలగాలి. ఈ పరిశోధన ద్వారా నేను సాధించాలనుకున్నది అదే. మహిళా వ్యోమగాములు ఏమి ఎంచుకుంటారో వారి ఇష్టం. కానీ నేను వారికి ఎంపికలను ఇవ్వగలగాలి' అని ఆమె జతచేశారు.



కెరీర్ మార్గాన్ని ఎంచుకోవలసి వచ్చినప్పుడు వర్షకు 17 ఏండ్లు. పాఠశాలలో భౌతిక శాస్త్రాన్ని ఇష్టపడేది. ముంబైలో గైనకాలజిస్ట్‌గా ఉన్న అత్త కూడా ఆమెను ఆకర్షించింది. అయితే ఆస్ట్రోఫిజిక్స్‌ని కెరీర్‌గా ఎంచుకున్నందుకు తన తల్లిదండ్రులు అంత ఇష్టంగా లేరు. 'నేను డాక్టర్ కావాలని కలలుకంటూ పెరిగాను. మా కుటుంబంలో మా అత్త ఒక్కరే

సేవ చేయాలనే ఉద్దేశంతో...

డాక్టర్. నేను ఎప్పుడూ ఖగోళ భౌతికశాస్త్రాన్ని కొనసాగించాల నుకుంటున్నాను' అని ఆమె చెప్పారు. కెరీర్‌ను నిర్ణ యించే ముందు వర్షా కంటిశుక్లం ఉన్నవారికి సహా యం చేసే కంటి డాక్టర్ వద్ద వారాంతపు కోర్సుకు హాజరయ్యారు. ఇది ఆమెను ఎంతగానో కదిలిం చింది. లండన్‌లోని ఇంపీరియల్ కాలేజీలో మెడి సిన్ చదవాలని నిర్ణయించుకుంది. 'ఆ సెషన్‌లో వైద్యులు ఒకరి జీవితాన్ని మార్చ డానికి చాలా చేయగలరని భావించాను. ప్రజలకు ఎక్కువ సేవలు అందించవచ్చనే ఉద్దేశ్యంతో నేను వైద్యాన్ని ఎంచు కున్నాను' అన్నారు ఆమె.

స్పేస్ మెడిసిన్ చదవితే...

2004లో వర్షా మెడికల్ స్కూల్ రెండవ ఏడాది చివరిలో ఉండగా స్పేస్ మెడిసిన్‌పై సమావేశం గురించి విన్నారు. ఫీల్డ్ గురించి తెలుసుకున్న తర్వాత శరీరం ఏమి చేస్తుందో లేదా ఈ విపరీతమైన వాతావరణంలో శరీరం ఎలా ఎదుర్కొంటుంది అనే విషయాలపై ఆమెకు ఆసక్తి కలిగింది. 'నేను స్పేస్ మెడిసిన్ చదవడం ద్వారా ఖగోళ భౌతికశాస్త్రం పట్ల నాకున్న అభిరుచిని ఔషధంతో కలపవచ్చని తెలుసుకున్నాను' అని ఆమె చెప్పారు. 2007లో నాసా జాన్సన్ స్పేస్ సెంటర్‌లో రీసెర్చ్ ప్లేస్‌మెంట్‌లో చేరారు. ఈ సమయంలో వ్యోమగాములు అంతరిక్షం నుండి తిరిగి వచ్చినప్పుడు బ్యాలెన్స్ కంట్రోల్ మెకానిజమ్‌ల గురించి పరిశోధన చేశారు. 'కోర్సు సమయంలో నేను విలువైన పరిచయాలను ఏర్పరచుకున్నాను. 2007లో నాసాలో స్థానం సంపాదించాను' అని ఆమె చెప్పారు. 2011 నుండి 2012 వరకు, ఆమె లండన్‌లోని కింగ్స్ కాలేజీలో స్పేస్ ఫిజియాలజీ, హెల్త్‌లో మాస్టర్స్ డిగ్రీని అభ్యసించారు. అప్పటి నుండి ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్‌లో పని చేస్తోంది. అలాగే ప్రసూతి, గైనకాలజిస్ట్‌గా ప్రాక్టీస్ చేస్తోంది.

పెరుగుతున్న మహిళల సంఖ్య

'మైక్రోగ్రావిటీ వాతావరణం ఆడ, మగ శరీరాలను ప్రభావితం చేసే విధానంలో కొన్ని చిన్న తేడాలు ఉన్నాయి. స్త్రీ శరీరం అంతరిక్ష వాతావరణంలోకి ప్రవేశించినప్పుడు చలన అనారోగ్యాన్ని అనుభవించే అవకాశం ఉంది. సాధారణంగా మగవారు భూమికి తిరిగి వచ్చినప్పుడు



అనారోగ్యంతో బాధపడే అవకాశం ఉంది. మహిళలు సాధారణంగా ఎత్తు తక్కువ ఉంటారు. వారికి ఎక్కువ రక్త నాళాలు ఉంటాయి. అందుకే వారు భూమికి తిరిగి వచ్చిన తర్వాత వారి రక్తపోటును నిర్వహించడం చాలా కష్టం. తద్వారా వారు మూర్ఛపోయే అవకాశం ఉంది' అని ఆమె వివరించారు. ఏది ఏమైనప్పటికీ గతంలో నాసాకు మహిళా వ్యోమగాముల నుంచి 10 నుంచి 15 శాతం దరఖాస్తులు మాత్రమే వచ్చేవని వర్షా గుర్తుచేసుకున్నారు. అయితే ఇప్పుడు మహిళా పరిశోధకులు, వ్యోమగాముల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఈ సంఖ్య భవిష్యత్‌లో మరింత పెరిగే అవకాశం ఉందని ఆమె అంటున్నారు.

- సలీమ

వెలుగు చూడని కాగ్ నివేదికలు

(మొదటిపేజీ తరువాయి)

22 నివేదికలు మాత్రమే సభ ముందుకు వచ్చాయి. 2014-2018 మధ్యకాలంలో సగటున 40 నివేదికలను సభలో ప్రవేశపెట్టారు. ఈ ఏడాది పార్లమెంట్ ముందు ఉంచిన కాగ్ నివేదికల సంఖ్య మరింతగా తగ్గిపోయింది. 2010-2023 మధ్య కాగ్ వెబ్‌సైట్‌లో ప్రచురితమైన 400కు పైగా ఆడిట్ నివేదికలను విశ్లేషించగా ఈ విషయాలు వెలుగు చూశాయి. కేంద్ర ప్రభుత్వానికి ఏప్రిల్, మే, జూన్ నెలల్లో కాగ్ సమర్పించిన నివేదికలను ఇప్పటి వరకూ పార్లమెంటులో ప్రవేశపెట్టలేదు. వివిధ ప్రభుత్వ శాఖలు, విభాగాలకు సంబంధించిన నివేదికల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. ఉదాహరణకు గత ఐదు సంవత్సరాల కాలంలో రైల్వే శాఖకు చెందిన 14 ఆడిట్ నివేదికలను మాత్రమే సభలో ప్రవేశపెట్టారు. అంతకుముందు ఐదు సంవత్సరాల కాలంలో 27 నివేదికలు సభ ముందుకు వచ్చాయి.

ప్రస్తుతం కాగ్‌గా వ్యవహరిస్తున్న జీసీ ముర్ము గతంలో ఐఏఎస్ అధికారిగా ఉన్నప్పుడు ప్రధాని నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్ షాకు అత్యంత సన్నిహితుడిగా పేరు పొందారు. ఆయుష్మాన్ భారత్, ద్వారకా ఎక్స్‌ప్రెస్ వే ప్రాజెక్ట్‌కు సంబంధించి కాగ్ ఇచ్చిన నివేదికలకు ఇన్‌ఛార్జిలుగా పనిచేసిన ముగ్గురు ఇండియన్ ఆడిట్ అండ్ అకౌంట్స్ సర్వీస్ అధికారులను ముర్ము బదిలీ చేశారు. ఈ రెండు నివేదికలలోని అంశాలపై ప్రతిపక్ష పార్టీలు మోడీ ప్రభుత్వాన్ని నిలదీశాయి. ఈ ఆడిట్ నివేదికల తర్వాత క్షేత్రస్థాయి పనులన్నింటినీ నిలిపివేయాలంటూ న్యూఢిల్లీలోని కాగ్ కార్యాలయం మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు వార్తలు వచ్చాయి. అయితే ఆ వార్తలను కాగ్ తోసిపుచ్చింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలలో ప్రవేశపెట్టిన 12 కాగ్ నివేదికలు ప్రభుత్వానికి ఇబ్బంది కలిగించాయి. కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాలలో చోటుచేసుకున్న ఆర్థిక, ఇతర అవకతవకలపై ఆ నివేదికలు అనేక ప్రశ్నలు లేవనెత్తాయి. తనకు ఇబ్బందికరంగా ఉన్న నివేదికలను ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే కోల్డ్‌స్టోరేజీలో ఉంచుతోందన్న విమర్శలు వస్తున్నాయి.

ఆటోడ్రైవర్లు ఆందోళన చెందొద్దు

(మొదటిపేజీ తరువాయి)

పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ఆటో డ్రైవర్లకు అన్యాయం చేయాలనే లక్ష్యంతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రకటించలేదని స్పష్టం చేశారు. ఏదైనా కొత్త పథకాన్ని ప్రారంభించినప్పుడు కొన్ని సమస్యలు ఉత్పన్నమవుతాయని చెప్పారు. వాటిని పరిష్కరించుకుందామని కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ సీనియర్ నేతలు బలరాం నాయక్, సురేష్ షెట్కర్, సిరిసిల్ల రాజయ్యలతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. గతంలో సీఎం కేసీఆర్ నీటిపారుదల ప్రాజెక్టులపై శాసనసభలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారని గుర్తు చేశారు.ఆ సందర్భంగా సీఎల్పీ తరుపున కూడా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చేస్తామంటే అనుమతి ఇచ్చారా? అని బీఆర్ఎస్‌ను ప్రశ్నించారు. ఆర్థిక పరిస్థితి ఏ విధంగా ఉందో బుధవారం అసెంబ్లీలో శ్వేత పత్రం విడుదల చేస్తామన్నారు. ప్రభుత్వం మారిందనీ, అందుకు అనుగుణంగా వ్యవహరించాలని సూచించారు. మీరు బంగారు తెలంగాణ అయితే ప్రజావాణిలో వేల దరఖాస్తులు ఎందుకు వస్తున్నాయని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీ పథకాలను 100 రోజుల్లో అమలు చేస్తామని తెలిపారు.

నాలుగు పాదాలపై నియంతృత్వం...పార్లమెంట్‌లో బీజేపీ తీరు సరిగాదు

పార్లమెంటు భద్రతపై ప్రశ్నించినందుకు 77 మంది ఎంపీలను సభ నుంచి సస్పెండ్ చేయడం పట్ల రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. పార్లమెంట్‌లో మొన్న ఆగంతకులు దూకి సభ్యులపై టియర్ గ్యాస్ విసరడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇది దేశ పార్లమెంటరి వ్యవస్థకే మాయని మచ్చ అన్నారు. దేశ వ్యాప్తంగా విద్వేషాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్యం రావాలని రాహుల్ గాంధీ పాదయాత్ర చేశారని గుర్తు చేశారు. పార్లమెంటుపై దాడికి పాల్పడిన బీజేపీ కార్యకర్తలను రక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. పార్లమెంటుపై దాడి జరిగితే రాష్ట్ర బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. పార్లమెంట్‌లో ఎంపీలను సస్పెండ్ చేయడం అత్యంత దారుణమని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు మల్లు రవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ముందుకెలా వెళ్దాం!

(మొదటిపేజీ తరువాయి)

అధికారులను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి యమునా బిల్డింగ్‌లోని తొమ్మిదో ఫ్లోర్ లోని ప్రస్తుత నివాసానికి చేరుకొని, కాసేపు రెస్ట్ తీసుకున్నారు.

తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా నూతన తెలంగాణ భవన్ నిర్మాణం

తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా దేశ రాజధాని న్యూఢిల్లీలో నూతన తెలంగాణ భవన్ నిర్మిస్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. న్యూఢిల్లీలోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ భవన్, రెండు రాష్ట్రాల మధ్య ఉన్న ఉమ్మడి ఆస్తుల విభజనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి సారించారు. ఢిల్లీలోని తన నివాసంలో ఈ అంశంపై తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్, భవన్ ఓఎస్డీ సంజయ్ జాజుతో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. భవన్ మొత్తం విస్తీర్ణం ఎంత? అందులో ఉన్న నిర్మాణాలు, వాటి స్థితి, అందులో తెలంగాణ వాటా వివరాలను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. ఉమ్మడిగా 19.781 ఎకరాల భూమి ఉందని అధికారులు తెలిపారు. ఇందులో ఉమ్మడి భవన్ పరిధిలోని 8.781 ఎకరాల్లో శబరి బ్లాక్, అంతర్గత రోడ్లు, గోదావరి బ్లాక్, 3.359 ఎకరాల్లో ఓల్డ్ నర్సింగ్ హాస్టల్, 7.641 ఎకరాల్లో పటౌడి హౌస్ ఉన్నాయని అధికారులు తెలిపారు. తెలంగాణ వాటా కింద ఎంత భూమి వస్తుందని సీఎం ప్రశ్నించారు. రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం మన రాష్ట్రం తెలంగాణకు 8.245 ఎకరాల భూమి వస్తుందని, ఏపీకి 11.536 ఎకరాలు (41.68:58.32 నిష్పత్తిలో) వెళుతుందని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ప్రస్తుత భవనాల స్థితి, అధికారులు, సిబ్బంది నివాస గృహాల స్థితిపై సీఎం ఆరా తీశారు. దశాబ్దాల క్రితం నిర్మించినవి కావడంతో చాలా వరకు శిథిలావస్థకు చేరాయని, మరమ్మతులు చేయిస్తున్నామని రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ తెలిపారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా నూతన భవనం నిర్మించుకుందామని ఈ సందర్భంగా సీఎం అన్నారు. అంతకు ముందు రెండు రాష్ట్రాల మధ్య ఉన్న ఆస్తుల విభజనపై దష్టి సారించాలని సీఎం అధికారులను ఆదేశించారు.. ఈ సందర్భంగా ఆయన ప్రస్తుత భవన్ మ్యాప్ ను పరిశీలించారు. ఆస్తుల విభజనపై అధికారులకు పలుసూచనలు ఇచ్చారు.

మంత్రి పదవి కోసం ఆశావాహుల చక్కర్లు

మంత్రివర్గం విస్తరణ ఉంటుందన్న వార్తల నేపథ్యంలో ఆశావాహులు ఢిల్లీలో చక్కర్లు కొడుతున్నారు. ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి నుంచి గెలిచిన ఏకైక కాంగ్రెస్ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మంత్రి పదవిని ఆశిస్తున్నారు. ఢిల్లీలో కేసీ వేణుగోపాల్‌ను కలిసి ఇదే విషయాన్ని వివరించారు. అయితే, ఇప్పటికే క్యాబినెట్‌లో రెడ్డి సామాజిక వర్గం ఎక్కువగా ఉందంటూ ఆయనకు మంత్రి పదవి ఇవ్వలేమని చెప్పినట్టు తెలిసింది. దీంతో ఏఐసీసీ హెడ్ ఆఫీస్‌లో ఆయన లాబీయింగ్ మొదలు పెట్టారు. సీఎం రేవంత్‌ను కలిసి కాసేపు ముచ్చటించారు. మరోవైపు తనకు మంత్రి పదవి ఇవ్వాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ సైతం అగ్రనేతలను కలుస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన మాజీ క్రికెటర్ అజారుద్దీన్, ఫిరోజ్ ఖాన్‌లు మైనార్టీ కోటాలో ఎమ్మెల్సీ పదవులు ఆశిస్తున్నట్టు తెలిసింది. ఇందులో భాగంగా ఢిల్లీలో రేవంత్‌ను కలిసేందుకు యమునా క్వార్టర్స్‌కు వచ్చారు. అయితే వరుస సమావేశాలతో బిజీ కారణంగా సీఎం వారిని హైదరాబాద్‌లో కలుస్తానని చెప్పినట్టు తెలిసింది.

వృత్తి నైపుణ్యాలు పెంచుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

సత్య నాదెళ్ల, అడోబ్ సీఈవో శంతన్ నారాయణ, పద్మభూషణ్ నాగేశ్వర్‌రెడ్డి లాంటి గొప్ప వ్యక్తులు ఈ పాఠశాలకు చెందిన వారు కావడం గర్వించదగ్గ విషయమన్నారు. అలాంటి వారిని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్యాలను నిర్దేశించుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. జీవితం ఎన్నో సవాళ్లతో ముడిపడి ఉంటుందనీ, విద్యార్థి దశ నుంచే వాటిని ఎదుర్కొవడంలో రాటు దేలాలని అన్నారు. నిరాశకు చోటివ్వకుండా ముందుకు దూసుకు పోవాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధిలో పాలు పంచుకుంటున్న ముఖ్యమంత్రులు, మంత్రులు, నాయకులు, బ్యూరోకాట్లు, డాక్టర్లు, న్యాయవాదులను ఈ స్కూల్ తయారు చేసిందని అన్నారు.

ప్రధాన మంత్రి మాటల్లో చెప్పాలంటె తరగతి గదుల్లో సంచరించే విద్యార్థులు భవిష్యత్ దిక్సూచీలని అన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు ఇతర ప్రాపంచిక అంశాలను పరిచయం చేస్తూ విద్య, నైపుణ్యం, క్రీడలకు ప్రాముఖ్యతనిస్తూ కేంద్రం రూపొందించిన జాతీయ విద్యావిధానాన్ని హెచ్‌పీఎస్ పాటిస్తోందని అన్నారు. ఫలితంగా ఉత్తమమైన ఫలితాలను సొంతం చేసుకుంటుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అప్రజాస్వామికంలో ఆల్‌టైం రికార్డ్

(మొదటిపేజీ తరువాయి)

నేత ఫరూఖ్ అబ్దుల్లా కూడా ఉన్నారు. పార్లమెంటులో చోటుచేసుకున్న భద్రత వైఫల్యంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాధానం చెప్పాలని, సోమవారం సస్పెండ్ అయిన ఎంపీలపై సస్పెన్షన్ ఎత్తివేయాలని 'ఇండియా' ఫోరానికి చెందిన సభ్యులంతా మంగళవారం సభ ప్రారంభమవ్వగానే ముక్తంకంఠంతో పట్టుబట్టారు. దీనిపై సమాధానం చెప్పేందుకు సాహసించలేని మోడీ సర్కార్ నిలదీసిన ఎంపీలందరిపైనా 'ప్రవర్తనా నియమావళి' ఉల్లంఘన కింద సస్పెండ్ చేసింది. ఈ శీతాకాల సమావేశాల మొత్తానికి 49 మందినీ సస్పెండ్ చేస్తున్నట్టు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. బీజేపీ ప్రభుత్వం పట్టపగలే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని 'ఇండియా' ఫోరం ఎంపీలు అటు సభలోనూ, ఇటు సభ వెలుపులా ఆందోళన చేపట్టారు.

పార్టీలు వారీగా సస్పెండ్ అయిన ఎంపీల సంఖ్య

కాంగ్రెస్ 18, జేడీయూ 10, డీఎంకే 6, టీఎంసీ 4, ఎన్సీపీ 3, నేషనల్ కాన్ఫరెన్స్ 2, ఎస్పీ 2, ఐయూఎంఎల్ 1, ఆప్ 1, వీసీకే 1, బీఎస్పీ (పార్టీ సస్పెండ్ ఎంపీ) 1 మంగళవారం నాటి సమావేశాల్లో సస్పెండ్‌కు గురయ్యారు. స్పీకర్ ఆదేశాలు ధిక్కరించారనే పేరుతో సభ్యుల సస్పెన్షన్ కు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దీన్ని మూజువాణీ ఓటుతో ఆమోదించారు. అనంతరం స్పీకర్ తన నిర్ణయాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రహ్లాద్ జోషి మాట్లాడుతూ 'సభలోకి ప్లకార్డులు తీసుకురావొద్దనే నిబంధన ఉంది. ఇటీవల జరిగిన పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో వారు (ప్రతిపక్షాలనుద్దేశిస్తూ) నిరాశ చెందారు. అందుకే వారు ఇలాంటి విపరీత చర్యలకు పాల్పడుతున్నారు' అని పేర్కొన్నారు.

కాగా.. లోక్‌సభలో ఇప్పటికే గతవారం 13 మందిని, సోమవారం మరో 33 మందిని సస్పెండ్ చేశారు. తాజా సంఖ్యతో కలిపి ఇప్పటి వరకు లోక్‌సభలో 95 మందిపై వేటు పడినట్టైంది. మరోవైపు రాజ్యసభలో ఇప్పటి వరకు 46 మందిని సస్పెండ్ చేశారు. దీంతో ఈ శీతాకాల సమావేశాల్లో ఇప్పటి వరకు మొత్తం 141 మంది ప్రతిపక్ష ఎంపీలపై చర్యలు తీసుకున్నట్టైంది.

ఉభయ సభలు వాయిదా

ప్రతిపక్షాల ఆందోళన నేపథ్యంలో మంగళవారం కూడా ఉభయ సభలు స్తంభించాయి. భద్రతా వైఫల్యం ఘటనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటన చేయడంతో పాటు తమ ఎంపిలపై సస్పెన్షన్ ను ఎత్తివేయాలని ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. వెల్లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. దీంతో ఉభయ సభలు వాయిదాల పర్వం తొక్కాయి. నిమిషాల్లో సభలను వాయిదా వేశారు. మరోవైపు, సస్పెన్షన్ కు గురైన ఎంపిలు అడిగిన 27 ప్రశ్నలను లోక్‌సభ ప్రశ్నల జాబితా నుంచి తొలగించారు. ప్రతిపక్షాల ఆందోళనల మధ్యే లోక్‌సభలో మూడు బిల్లులు ఆమోదం పొందాయి. నేషనల్ క్యాపిటల్ టెరిటరీ ఆఫ్ ఢిల్లీ చట్టం (ప్రత్యేక నిబంధనలు) రెండవ (సవరణ) బిల్లు, కేంద్ర వస్తువులు, సేవల పన్ను (రెండవ సవరణ) బిల్లు, తాత్కాలిక పన్నుల సేకరణ బిల్లు లోక్‌సభలో మూజువాణి ఓటుతో ఆమోదించారు.

చైనాలో భారీ భూకంపం

బీజింగ్ : చైనాలో భారీ భూకంపం సంభవించింది. భూకంపం దాటికి పలు భవనాలు నేలమట్టమయ్యాయి. రిక్టర్ స్కేల్‌పై దీని తీవ్రత 6.2గా నమోదైంది. స్థానిక మీడియా తెలిపిన వివరాల ప్రకారం.. చైనాలోని వాయువ్య గన్సు, కింగ్‌హై ప్రావిన్స్‌ల్లో భూకంపం దాటికి సుమారు 116 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. 400 మందికిపైగానే గాయపడినట్టు సమాచారం. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని స్థానిక మీడియా చెబుతోంది. అక్కడి కాలమానం ప్రకారం సోమవారం అర్ధరాత్రి దాటాక భూకంపం సంభవించింది. రాత్రి సమయంలో ఒక్కసారిగా భూమి కంపించడంతో ప్రజలు భయాందోళనతో రోడ్లపై పరుగులు తీశారు. దాదాపు ఆరువేలకుపైగా ఇండ్లు నేలమట్టమయ్యాయి. చాలా ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. రోడ్లు ధ్వంసమయ్యాయి. ఎల్లో రివర్‌పై వంతెన బీటలువారింది.కాగా, ఆ దేశ అధ్యక్షుడు జిన్‌పింగ్ అధికారులను అప్రమత్తం చేశారు. భూకంపం కారణంగా ప్రాణనష్టాన్ని తగ్గించేందుకు పూర్తిస్థాయి సహాయక చర్యలు చేపట్టాలని అధ్యక్షుడు అధికారులను ఆదేశించారు. తక్షణ సహాయక చర్యలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలనీ, గాయపడినవారికి తక్షణమే చికిత్స అందించాలని స్పష్టం చేశారు. భూకంపం ప్రభావంతో సంభవించే మార్పుల వల్ల పరిస్థితులు మరింత దిగజారకుండా చూడాలన్నారు. కింగ్‌హై ప్రావిన్స్.. టిబెట్‌కు సమీపంలో ఉంటుంది. ఆ ప్రాంతంలో తరచూ భూకంపాలు సంభవిస్తుంటాయి. కింగ్‌హై పక్కన ఉండే గ్జిన్జియాంగ్ ఉయ్‌గుర్‌లో మంగళవాం మరోసారి భూమి కంపించింది. రంగంలోకి దిగిన సహాయక బందాలు సహాయచర్యలు ముమ్మరం చేశాయి.

కరోనా సబ్ వేరియంట్ భయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కరోనా మళ్లీ కలవరపెడుతోంది. కొత్త సబ్ వేరియంట్ కేసులు దేశవ్యాప్తంగా రోజు రోజుకు పెరుగుతున్న నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కేంద్రం ఇప్పటికే రాష్ట్రానికి సూచించిన విషయం విదితమే. దీంతో కొత్త వేరియంట్‌ను ఎదుర్కొనేందుకు అవసరమైన అన్ని జాగ్రత్తలతో సిద్ధంగా ఉండాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో కోవిడ్-19 నోడల్ సెంటర్‌గా గతంలో సేవలందించిన గాంధీ ఆస్పత్రిని అవసరమైతే మరోసారి సేవలందించేందుకు సిద్ధం చేసినట్టు గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు తెలిపారు. ప్రత్యేకంగా కరోనా వార్డులో బెడ్లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఎప్పుడు రోగులు వచ్చినా చికిత్స అందిస్తామని తెలిపారు. క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి పండుగల నేపథ్యంలో ప్రజలు మాస్కులు ధరించడం, ఇతర కోవిడ్ జాగ్రత్తలు విధిగా పాటించాలని ఆయన సూచించారు. ఒమిక్రాన్‌కు చెందిన కొత్త సబ్ వేరియంట్ జేఎన్1తో కరోనా మళ్లీ విజంభిస్తోంది. కొన్ని రోజులుగా ఈ కేసులెక్కువగా వెలుగు చూస్తున్నాయి. రాష్ట్రంలోనూ ఐదు కేసులు నమోదైనట్టు అధికార వర్గాలు వెల్లడించాయి. దేశవ్యాప్తంగా ఆరుగురు చనిపోగా, ఎక్కువ కేసులు, మరణాలు కేరళ రాష్ట్రంలోనే నమోదు చేసుకున్నాయి. అయితే ఈ వేరియంట్ ప్రమాదకారి కాదు... అని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించిన నేపథ్యంలో ప్రజలు భయాందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని డాక్టర్లు సూచిస్తున్నారు. అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు తీసుకుంటే మంచిదని సూచిస్తున్నారు.

పవరేంటో చూపిస్తాం...

(మొదటిపేజీ తరువాయి)

తమకు అవకాశమివ్వాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు ప్రధాన ప్రతిపక్షం లేఖ రాసింది. 'గత బీఆర్ఎస్ హయాంలో మా పార్టీకి పవర్ పాయింట్ ప్రజంటేషన్‌కు అవకాశం ఇవ్వాలని కోరితే ఇవ్వలేదు. అందువల్ల ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్‌కు ఆ అవకాశం ఇవ్వలేం...' అంటూ ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో బుధవారం నాటి సభ మరింత రసకందాయంగా మారనుంది. ఆర్థిక స్థితిగతులపై ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజంటేషన్ ఇచ్చే అవకాశముంది. ఆయన కాకపోతే ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఇస్తారని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. బుధవారం ఉదయం 11 గంటలకు సభ ప్రారంభం కానుంది. ఇటీవల మరణించిన మాజీ శాసనసభ్యులు రామన్నగారి శ్రీనివాసరెడ్డి, కొప్పుల హరీశ్వర్‌రెడ్డి, కుంజా సత్యవతికి సభ సంతాపాన్ని ప్రకటించనుంది. అనంతరం 'తెలంగాణ రాష్ట్ర ఆర్థిక స్థితిగతులు-శ్వేతపత్రం' అనే అంశంపై స్పీకర్ లఘు చర్చను ప్రారంభిస్తారని శాసనసభ కార్యక్రమాల పట్టికలో పేర్కొన్నారు.



స్టార్క్@ రూ 24.50కోట్లు

• ఐపీఎల్ వేలం చరిత్రలో అత్యధిక ధర • కోల్‌కతా నైట్‌రైడర్స్ సొంతం



దుబాయ్: ఆస్ట్రేలియాకే చెందిన సీనియర్ ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ ఐపీఎల్ చరిత్రలో అత్యంత ఖరీదైన ఆటగాడిగా సరికొత్త రికార్డు నెలకొల్పాడు. మినీ వేలంలో స్టార్క్‌ను కోల్‌కతా నైట్‌రైడర్స్ ఫ్రాంచైజీ కనీవినీ ఎరుగని రీతిలో రూ.24.75 కోట్లకు కొనుగోలు చేసింది. దీంతో గతంలో ఐపీఎల్‌లో ప్యాట్ కమిన్స్(రూ.20.5 కోట్లు) రికార్డును స్టార్క్ బద్దలు కొట్టాడు. రూ.2 కోట్ల కనీస ధర ఉన్న ఈ యార్కర్ కింగ్ కోసం కోల్‌కతా నైట్ రైడర్స్, గుజరాత్ టైటాన్స్ చివరి వరకు పోటీపడ్డాయి. కానీ, చివరకు కోల్‌కతా భారీ ధరకు స్టార్క్‌ను కొనుగోలు చేసింది. న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ డారిల్ మిచెల్ రూ.14 కోట్లతో మూడో స్థానంలో ఉన్నాడు. టీమిండియా సీనియర్ పేసర్ ఉమేశ్ యాదవ్‌ను రూ.5.8 కోట్లతో గుజరాత్ టైటాన్స్ చేజిక్కించుకుంది. ఉమేశ్ కనీస ధర రూ.2 కోట్లు. అనూహ్య రీతిలో వెస్టిండీస్ పేసర్ అల్జారీ జోసెఫ్ కోసం ఫ్రాంచైజీలు విపరీతంగా పోటీపడ్డాయి. అతడి కనీస ధర రూ.కోటి కాగా... చివరికి అతడిని రూ.11.5 కోట్లకు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) దక్కించుకుంది. అల్జారీ జోసెఫ్ గత కొన్ని సీజన్లుగా ఐపిఎల్‌లో ఆడుతున్నా... గొప్పగా బౌలింగ్ ప్రదర్శన చేసిందేమీ లేదు. అయినా అతడికి కళ్లు చెదిరే ధర లభించడం విశేషం. టీమిండియా టెస్టు జట్టు వికెట్ కీపర్ కేఎస్ భరత్ ది విచిత్రమైన గాథ. అతడి కనీస ధర రూ.50 లక్షలు కాగా, అదే ధరకు వేలంలో అతడిని కోల్‌కతా నైట్‌రైడర్స్ ఫ్రాంచైజీ కొనుగోలు చేసింది. దక్షిణాఫ్రికా యువ కెరటం ట్రిస్టాన్ స్టబ్స్‌కు ఈసారి వేలంలో ఏమంత మంచి ధర లభించలేదు. అతడిని రూ.50 లక్షల కనీస ధరకే ఢిల్లీ క్యాపిటల్స్ చేజిక్కించుకుంది.



స్టార్క్‌కు అంత ధర ఎందుకంటే..

ఆస్ట్రేలియా లెఫ్టార్మ్ పేసర్ స్టార్క్ కనీస ధర రూ.2 కోట్లు కాగా... అతడిని దక్కించుకొనేందుకు కోల్‌కతా నైట్ రైడర్స్, గుజరాత్ టైటాన్స్ తీవ్రంగా పోటీపడ్డాయి. చివరికి కోల్‌కతా ఫ్రాంచైజీదే పైచేయి అయింది.

ఎలాంటి పిచ్‌పై అయినా ప్రభావవంతంగా బౌలింగ్ చేస్తాడని స్టార్క్‌కు పేరుంది.

ఆసీస్ జట్టులో స్టార్క్‌తో కలిసి ఎన్నో ఏళ్లుగా కొత్త బంతిని పంచుకుంటున్న మరో పొడగరి పేసర్ జోష్ హేజెల్ వుడ్‌ను ఇవాళ్టి వేలం తొలి దశలో ఎవరూ కొనుగోలు చేయలేదు. అతడు అన్ సోల్డ్‌గా మిగిలిపోయాడు.

అత్యధిక ధర పలికిన ఆటగాళ్ల వివరాలు..

మిచెల్ స్టార్క్ (ఆస్ట్రేలియా)	రూ.24.75కోట్లు	కోల్‌కతా నైట్ రైడర్స్
ప్యాట్ కమిన్స్(ఆస్ట్రేలియా)	రూ.20.5కోట్లు	సన్‌రైజర్స్ హైదరాబాద్
డారిల్ మిచెల్ (న్యూజిలాండ్)	రూ.14కోట్లు	చెన్నై సూపర్ కింగ్స్
హర్షల్ పటేల్(భారత్)	రూ.11.75కోట్లు	పంజాబ్ కింగ్స్
అల్జారీ జోసెఫ్ (వెస్టిండీస్)	రూ.11.50కోట్లు	రాయల్ చాలెంజర్స్ బెంగళూరు
సమీర్ రిజ్వి(భారత్)	రూ.8.40కోట్లు	చెన్నై సూపర్‌కింగ్స్
షారుక్ ఖాన్(భారత్)	రూ.7.40కోట్లు	గుజరాత్ టైటాన్స్
రొవ్‌మన్ పావెల్(వెస్టిండీస్)	రూ.7.4కోట్లు	ఢిల్లీ క్యాపిటల్స్
ట్రావిస్ హెడ్(ఆస్ట్రేలియా)	రూ.6.80కోట్లు	సన్‌రైజర్స్ హైదరాబాద్
ఉమేశ్ యాదవ్(భారత్)	రూ.5.8కోట్లు	గుజరాత్ టైటాన్స్
శివమ్ దూబే(భారత్)	రూ.5.8కోట్లు	రాజస్తాన్ రాయల్స్
గెరాల్డ్ కోయెట్జీ (దక్షిణాఫ్రికా)	రూ.5.0కోట్లు	ముంబై ఇండియన్స్
యశ్ దయాల్(భారత్)	రూ.5.0కోట్లు	రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు
క్రిస్ వోక్స్ (ఇంగ్లండ్)	రూ.4.2కోట్లు	పంజాబ్ కింగ్స్
శార్ధూల్ ఠాకూర్ (భారత్)	రూ.4.0కోట్లు	చెన్నై సూపర్ కింగ్స్
హ్యరీ బ్రూక్ (ఇంగ్లండ్)	రూ.4.0కోట్లు	ఢిల్లీక్యాపిటల్స్
సుశాంత్ మిశ్రా(భారత్)	రూ.2.2కోట్లు	గుజరాత్‌టైటాన్స్
రచిన్ రవీంద్ర(న్యూజిలాండ్)	రూ.1.8కోట్లు	చెన్నై సూపర్ కింగ్స్
కుమార్ కుషగ్ర	రూ.7.20కోట్లు	ఢిల్లీ క్యాపిటల్స్

హాకీ అత్యుత్తమ ఆటగాళ్లుగా

హార్దిక్, సవిత

ఎఫ్ఐహెచ్ ప్లేయర్ ఆఫ్ ది ఇయర్ అవార్డ్సు



లాసన్నె: 2023 ఏడాదికిగాను హాకీ అత్యుత్తమ ఆటగాళ్లుగా భారత్‌కు చెందిన హార్దిక్ సింగ్, గోల్ కీపర్ సవిత పునియా అవార్డులను గెలుచుకున్నారు. ఇంటర్నేషనల్ హాకీ ఫెడరేషన్(ఎఫ్ఐహెచ్- 2023 ఏడాదికిగాను మంగళవారం ప్రకటించిన అత్యుత్తమ ఆటగాళ్ల పేర్లను వెల్లడించింది. హార్దిక్‌సింగ్‌తోపాటు వాన్-డి-వార్డ్(నెదర్లాండ్స్) కూడా 2023 ఏడాదికి అత్యుత్తమ ఆటగానిగా ఎంపికయ్యాడు. దీంతో మహిళల విభాగం గోల్ కీపర్‌గా అత్యుత్తమ క్రీడాకారిణిగా ఎంపికైన మూడో ప్లేయర్ సవిత మాత్రమే. ఎవర్ట్స్ ప్యానల్, నేషనల్ అసోసియేషన్స్, జాతీయ జట్లకు ఆడిన కెప్టెన్లు, కోచ్‌లతోపాటు అభిమానులు, మీడియా ప్రతినిధులు వేసిన ఓట్ల ఆధారంగా ఎంపిక చేశారు. గోల్‌కీపర్ సవితతోపాటు నెదర్లాండ్స్ గోల్‌కీపర్ పర్మిన్ బ్లాక్, ఎఫ్ఐహెచ్ రైజింగ్ స్టార్స్‌గా తెరెసా లిమా(స్పెయిన్), గాస్పర్డ్ సావియర్(ఫ్రాన్స్) ఎంపికయ్యారు. అలాగే చైనా మహిళల హాకీ హెడ్ కోచ్ అలీసన్ అన్నన్, జర్మనీ పురుషుల జట్టు కోచ్ ఆండ్రీ హెన్నింగ్ ఎఫ్ఐహెచ్ కోచ్ ఆఫ్ ది ఇయర్ అవార్డులను గెలుచుకున్నారు. ఈ అవార్డు రేసులో మొత్తం 114మంది నిలువగా భారత్‌కు చెందిన హార్దిక్.. భారతజట్టు ఒలింపిక్స్‌లో కాంస్య పతకం గెలుచుకోవడంలో కీలకపాత్ర పోషించడంతో అతనికి అవార్డు సొంతమైంది. దీంతో 2022లో బల్బీర్ సింగ్ సీనియర్ తర్వాత ఈ అవార్డును చేజిక్కించుకున్న రెండో భారత ఆటగాడు హార్దిక్ మాత్రమే. 33ఏళ్ల సవిత 2021, 2022లో పలు అవార్డులను కైవసం చేసుకోవడంతోపాటు 2023లో ఆస్ట్రేలియాతో జరిగిన టెస్ట్ మ్యాచ్, ఆసియా క్రీడల్లో భారత మహిళల హాకీ జట్టు స్వర్ణ పతకం చేజిక్కించుకోవడంలో కీలకపాత్ర పోషించడంతో ఆమెకు ఈ అవార్డు వరించింది.

నవచిత్రం

ధిర ధిరన..


నేహ జురెల్, రవితేజ నున్న

తన్విక అండ్ మోక్షిక క్రియేషన్స్ పతాకంపై నూతన తారలు రవితేజ నున్న హీరోగా, నేహ జురెల్ హీరోయిన్‌గా రూపొందుతున్న చిత్రం 'రాజు గారి అమ్మాయి - నాయుడు గారి అబ్బాయి'. సత్య రాజ్ దర్శకునిగా పరిచయం అవుతున్న ఈ చిత్రానికి రామిసెట్టి సుబ్బారావు, ముత్యాల రామదాసు నిర్మాతలు. ఈ చిత్రం నుండి ఇప్పటికే విడుదలైన 'ఐ లవ్ యు' పాట ప్రేక్షకులను కట్టిపడేసింది. తాజాగా ఈ చిత్రం నుంచి శృంగార గీతం 'ధిర ధిరన' లిరికల్ వీడియో విడుదలైంది.
సంగీత దర్శకుడు కోటి తనయుడు రోషన్ సాలూరి స్వరపరిచిన 'ధిర ధిరన' ఈ పాట అందర్నీ విశేషంగా ఆకట్టుకుంటోంది. సాహితి చాగంటి ఆలపించిన ఈ పాటకు రెహమాన్ సాహిత్యం అందించారు. లిరికల్ వీడియోలో నాయిక నాయకుల మధ్య కెమిస్ట్రీ చక్కగా కుదిరింది. థియేటర్లలో ఈ సాంగ్ యువత మనసు దోచుకోవడం ఖాయమనిపిస్తోంది. ఈ సినిమా కథ ఈ తరం సినిమా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని కలిగిస్తుందని చిత్ర బృందం చెబుతోంది. ఇప్పటికే విడుదలైన టీజర్ మెప్పించింది. ప్రేక్షకులలో ఈ సినిమాపై ఉన్న ఆసక్తిని రెట్టింపు చేయడానికి త్వరలో ట్రైలర్ విడుదల కానుందని, మరికొద్ది రోజుల్లోనే ఈ సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్టు మేకర్స్ తెలిపారు.

మెప్పించే అభిరామ్..


యష్ రాజ్, నవమి గాయక్

లెజెండరీ ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై రామకృష్ణార్జున్ దర్శకత్వంలో శ్రీనివాసులు నిర్మిస్తున్న చిత్రం 'అభిరామ్'. ఈ చిత్ర టీజర్‌ని ఇటీవలే నిర్మాత ప్రసన్నకుమార్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ఇప్పటికే ఈ సినిమా ఆడియో టిప్స్ మ్యూజిక్‌లో విడుదలై మంచి సక్సెస్‌ని అందుకుంది. పాటలకు చాలా మంచి స్పందన లభిస్తోంది. టీజర్ చూస్తుంటే ఈ సినిమా కమర్షియల్ ఎలిమెంట్స్‌తో ఉన్న ఒక మంచి లవ్ స్టోరీగా కనిపిస్తోంది. టైటిల్ కూడా చాలా క్యాచీగా ఉంది. శివ బాలాజీ, యష్ రాజ్, రఘు బాబు, అన్నపూర్ణమ్మ, తులసి, వై విజయతోపాటు బాహుబలి ప్రభాకర్ కూడా ఒక ముఖ్య పాత్ర పోషించారు. గండికోట సంస్థానంలా భారీగా ఖర్చుకి ఎక్కడా వెనకాడకుండా ఈ సినిమాని నిర్మించారు. త్వరలో సినిమా కూడా విడుదలై మంచి సక్సెస్ అవ్వాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. 'మా ఈ సినిమా టీజర్‌ని రిలీజ్ చేసి మమ్మల్ని సపోర్ట్ చేసిన నిర్మాత ప్రసన్న కుమార్‌కి కృతజ్ఞతలు. ఓ మంచి సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నందుకు చాలా గర్వంగా ఉంది' అని నిర్మాత శ్రీనివాసులు చెప్పారు.
ఈ చిత్రానికి నిర్మాత : జింకా శ్రీనివాసులు, కథ, మాటలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం : రామకృష్ణార్జున్, ఎడిటర్ : మార్తాండ్ కె వెంకటేష్, డి ఓ పి : జగదీష్ కొమారి, సంగీతం : మీనాక్షి భుజంగ్, కొరియోగ్రఫీ : చంద్ర కిరణ్, స్టంట్స్ : విన్సెన్ అంజి, సాహిత్యం : సాగర్ నారాయణ ఎం, ఆర్ట్ డైరెక్టర్ : చంటి.

భిన్న పాయింట్‌తో మహతి



సందీప్ మాధవ్ హీరోగా శివ ప్రసాద్ స్వీయ దర్శక నిర్మాణంలో శ్రీ పద్మిని సినిమాస్ పతాకంపై ప్రొడక్షన్ నెం.3గా రూపొందుతున్న చిత్రం 'మహతి'. సుహాసిని మణిరత్నం, దీప్సిక కీలక పాత్రలు పోషిస్తున్నారు. మంగళవారం ఈ సినిమా పూజా కార్యక్రమాలతో గ్రాండ్‌గా ప్రారంభమైంది.
ముహూర్తపు సన్నివేశానికి చంద్రమౌళి క్లాప్ కొట్టగా, పద్మ కెమెరా స్విచాన్ చేశారు. సుహాసిని మణిరత్నం మేకర్స్‌కు స్క్రిప్ట్‌ని అందించగా, తొలి షాట్‌కి రాజారవీంద్ర గౌరవ దర్శకత్వం వహించారు.
సుహాసిని మణిరత్నం మాట్లాడుతూ,'మహతి కథ, నా పాత్ర చాలా నచ్చింది. ఫ్యామిలీ ఎమోషన్స్, సెంటిమెంట్స్ ఉంటాయి. టైటిల్‌కి తగట్టు మహిళా ప్రాధాన్యత గల చక్కని అంశాలు ఉన్నాయి. ఒక క్రైమ్ చేయడం కంటే ఆ క్రైమ్‌ని చూస్తూ ఏం చేయకుండా ఊరుకోవడం ఇంకా పెద్ద క్రైమ్. అదే ఈ సినిమా ప్రధానాంశం' అని తెలిపారు.
'ఈ కథ వినప్పుడు చాలా ఎగ్జైటింగ్‌గా ఫీలైయ్యాను. డైరెక్టర్ శివ ఆద్యంతం ఆకట్టుకునేలా ఈ కథని తీర్చిదిద్దారు. నా పాత్రకు డిఫరెంట్ షేడ్స్ ఉంటాయి' అని సందీప్ మాధవ్ చెప్పారు. దీప్సిక మాట్లాడుతూ, 'ఈ కథ అద్భుతంగా ఉంటుంది. ఇందులో నా పాత్ర అందరినీ కచ్చితంఅ ఆకట్టు కుంటుంది. తెలుగులో ఇది నాకు చాలా మంచి చిత్రం అవుతుందనే నమ్మకం ఉంది' అని తెలిపారు. 'దర్శకుడిగా ఇది నా రెండో చిత్రం. నిర్మాతగా మూడవది. సుహాసిని, హీరో సందీప్, మిగతా టీంసభ్యులంతా కథని బలంగా నమ్మారు. వాళ్ళ నమ్మకాన్ని నిలబెడతాననే నమ్మకం ఉంది' దర్శక, నిర్మాత శివ ప్రసాద్ బూర్లె అన్నారు.

సిసలైన సంక్రాంతి సినిమా



తేజ సజ్జా

హీరో తేజ సజ్జ, దర్శకుడు ప్రశాంత్ వర్మ కాంబోలో రూపొందుతున్న 'హను-మాన్' థియేట్రికల్ ట్రైలర్ గ్రాండ్‌గా లాంచ్ అయ్యింది. డైరెక్టర్ ప్రశాంత్ వర్మ మాట్లాడుతూ,'మనందరి ఇష్టదైవం హనుమంతుడు. ఆయనే రియల్ సూపర్ హీరో. మా స్కూల్ డేస్‌లో పురాణ పురుషులు గురించి చెప్పేవారు. కానీ ఈ జనరేషన్ పిల్లలు చాలా మందికి అది రీచ్ కావడం లేదు. టీజర్ రిలీజైన తర్వాత హనుమంతుడు ఎవరు? ఆయన గురించి చెప్పమని పేరెంట్స్‌ని పిల్లలు అడుగుతున్నారని తెలిసి చాలా ఆనందపడ్డాను. టీజర్ తర్వాత సినిమాపై హైప్ వందరెట్లు పెరిగిపోయింది. ట్రైలర్ కంటే సినిమా పదిరెట్లు అద్భుతంగా ఉంటుంది. సంక్రాంతి లాంటి పండక్కి ఈ సినిమా రావడం కరెక్ట్. తెలుగులో సుమారుగా 400 థియేటర్స్, హిందీలో 1500 థియేటర్స్‌లో విడుదలౌతుంది' అని తెలిపారు.
'ఈ సినిమా కోసం వందకి వందశాతం కంటే ఎక్కువ కష్టపడి పని చేశాను. మామూలు కుర్రాడికి దేవుని ఆశీస్సులతో సూపర్ పవర్స్ వస్తే వాడు చేసే అసాధారణ పనులు ఏమిటనేది ఈ సినిమా కథ' అని హీరో తేజ సజ్జ అన్నారు.

సరికొత్త ప్రేమకథ


సుధీష్ వెంకట్, అంకిత సాహ

సుధీష్ వెంకట్, అంకిత సాహ హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'పాషన్'. ఫ్యాషన్ డిజైనింగ్ కాలేజ్ నేపథ్యంగా సాగే ప్రేమ కథా చిత్రమిది.
ఈ సినిమాను తోలు బొమ్మలాట ఫిల్మ్ బ్యానర్ పై డాక్టర్ అరుణ్ మొండితోక, నరసింహ, ఏ పద్మనాభ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రంతో ఫ్యాషన్ డిజైనర్ అరవింద్ జోషువా దర్శకుడిగా పరిచయమవు తున్నారు. మంగళవారం హైదరాబాద్‌లో ఈ సినిమా లాంఛనంగా ప్రారంభమైంది. దర్శకులు శేఖర్ కమ్ముల ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ ఇవ్వగా, ఎమ్మెల్సీ అరుణ్ కుమార్ మొండితోక కెమెరా స్విచ్చాన్ చేశారు. దర్శకుడు వేణు ఊడుగుల ఫస్ట్ షాట్ డైరెక్షన్ చేశారు. నిర్మాత పద్మనాభ రెడ్డి స్క్రిప్ట్‌ను దర్శకుడు అరవింద్ జోషువాకు అందజేశారు.
ఈ సందర్భంగా దర్శకుడు శేఖర్ కమ్ముల మాట్లాడుతూ, 'నేను అంతా కొత్తవాళ్ళతో తీసిన 'హ్యాపీడేస్'లా పాషన్ కూడా యూత్‌ని ఆకట్టుకుని, ఇన్‌స్పైర్ చేసే మంచి సినిమా అవుతుందని నమ్ముతున్నాను' అని చెప్పారు. 'ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ చేస్తాం' అని నిర్మాత అరుణ్ మొండితోక చెప్పారు. మరో నిర్మాత ఏ పద్మనాభ రెడ్డి మాట్లాడుతూ, 'ఈ స్క్రిప్ట్ విన్నప్పుడు బాగా ఎంగేజింగ్‌గా అనిపించింది. అందుకే భాగస్వామి అయ్యాను' అని తెలిపారు. 'ఈ సబ్జెక్ట్‌ను నిజాయితీగా తెరకెక్కించే ప్రయత్నం చేస్తున్నాం' అని దర్శకుడు అన్నారు.

కరీంనగర్ కుర్రాళ్ల కథ


అమన్ సూరేపల్లి, సాయి సూరేపల్లి, అనిరుధ్

పొలిటికల్ క్రైమ్ డ్రామా నేపథ్యంలో రూపొందిన వెబ్ సిరీస్ 'కరీంనగర్స్- మోస్ట్ వాంటెడ్'. స్ట్రీట్ బీట్జ్ సినిమా నిర్మాణంలో బాలాజీ భువనగిరి దర్శకత్వం వహించిన ఈ వెబ్ సిరీస్ ఈనెల 22న ఆహా ఓటీటీలో విడుదల కానుంది. ఇటీవల విడుదలైన ఈ సిరీస్ ట్రైలర్, రాహుల్ సిప్లిగంజ్ పాడిన కరీంనగర్స్ వాలే పాట సెన్సేషన్ క్రియేట్ చేశాయి. కరీంనగర్‌లోని నలుగురు సామాన్య కుర్రాళ్ళ జీవితాలని ఆసక్తికరంగా పరిచయం చేస్తూ మొదలైన ట్రైలర్ యాక్షన్, డ్రామా, ఎమోషన్స్‌తో కట్టిపడేసింది.
నూతన నటులు అమన్ సూరేపల్లి, సాయి సూరేపల్లి ,అనిరుధ్ తుకుంట్ల తమ సహజత్వ నటనతో అందర్నీ మెప్పించారు. దర్శకుడు బాలాజీ భువనగిరి గ్రిప్పింగ్ కథనం, సంకీర్త్ రాహుల్ కెమెరా వర్క్, సాహిత్య సాగర్ సంగీతం, ఎస్.అనంత్ శ్రీకర్ నేపథ్య సంగీతం ఆకట్టు కున్నాయి. 'బలగం' రైటర్ రమేష్ ఎలిగేటి ఈ సిరీస్‌కు కథా, కథనం, సంభాషణలు అందించారు.
ఈ సిరీస్‌లో నటించిన ప్రధానపాత్ర ధారులందరూ రంగస్థల కళాకారులే కావడం ఓ విశేషమైతే, వీరంతా కరీంనగర్‌కు చెందిన వారే కావడం మరో విశేషం. 'కరీంనగర్స్ వాలే..' పాటని కొత్త యూట్యూబ్ ఛానల్ విడుదల చేసినప్పటికీ మిలియన్ వ్యూస్‌ని క్రాస్ చేసిందని మేకర్స్ తెలిపారు.

దుబాయ్‌లో గామా అవార్డ్స్


వి.ఎన్.ఆదిత్య, కోటి, ఎం.ఎం.శ్రీలేఖ

దుబాయ్‌లో ప్రతి సంవత్సరం అంగరంగ వైభవంగా జరిగే గామా అవార్డ్స్ కార్యక్రమాన్ని వచ్చే ఏడాది మార్చి 3న మరింత భారీగా నిర్వహించ బోతున్నారు. ఈసారి అవార్డు వేడుకల్లో ప్రత్యేక అతిథిగా విచ్చేసే నేషనల్ అవార్డ్ విన్నర్ అల్లు అర్జున్‌ను 'గామా నేషనల్ ఐకాన్ అవార్డ్'ను వేలాది మంది తెలుగు, తమిళ, మళయాల సినీ ప్రేమికుల సమక్షంలో ప్రత్యేక సత్కారం చేయాలని భావిస్తున్నట్లు గామా అవార్డ్స్ చైర్మన్ కేసరి త్రిమూర్తులు తెలిపారు.
2021, 2022, 2023 సంవత్సరంలో విడుదలైన చిత్రాలనుంచి - బెస్ట్ యాక్టర్ (మేల్, ఫిమేల్), బెస్ట్ మూవీ డైరెక్టర్, బెస్ట్ మ్యూజిక్ డైరెక్టర్, బెస్ట్ సింగర్ (మేల్, ఫిమేల్), బెస్ట్ బాక్ గ్రౌండ్ స్కోర్, బెస్ట్ లిరిక్స్, బెస్ట్ సెలబ్రిటీ సింగర్ వంటి వివిధ కేటగిరీల్లో నామినేషన్ సాధించిన వారికి ఆన్ లైన్ ఓటింగ్, మీడియా రిపోర్ట్స్, గామా జ్యూరీ చైర్ పర్సన్‌తోపాటు శ్రీలేఖ, దర్శకులు వి.ఎన్.ఆదిత్య నిర్ణయించిన విజేతలకు గామా అవార్డ్స్‌తో సత్కరించనున్నారు.
తాను గత 3 గామా అవార్డ్స్‌కి అతిథిగా వెళ్ళానని మళ్లీ ఈసారి జ్యూరీ సభ్యురాలిగా వెళ్ళడం ఆనందంగా ఉందని ఎం.ఎం.శ్రీలేఖ అన్నారు. ఈ అవార్డుల వేడుక గ్రాండ్ సక్సెస్ అవ్వాలని ఆశిస్తున్నాను అని సంగీత దర్శకుడు కోటి చెప్పారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886